www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

డాడీ చుట్టూ దయ్యాలు

పార్టీలో నాపై అంతర్గత కుట్రలు, కుతంత్రాలు

కుట్రలు చేసే ఆ దయ్యాలే నా లేఖను లీక్ చేశాయి

నాన్నకు లేఖ వెనుక వ్యక్తిగత ఎజెండా లేదు

నా లేఖే బయటపడితే ఇతరుల పరిస్థితేంటి?

లోపాలపై చర్చించాలి.. కోవర్టుల్ని తప్పించాలి

అప్పుడే పార్టీ పదికాలాలు చల్లగా ఉంటుంది

అమెరికా నుంచి తిరిగొచ్చిన కవిత వ్యాఖ్యలు

12



శనివారం | 24-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 38

శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: ద్వాదశి రా.7:21 తదుపరి త్రయోదశి, నక్షత్రం: రేవతి మ.1:48 తదుపరి అశ్విని, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ. 5:44-7:27, అమృతఘడియలు: ఉ.11:37-1:04, తె.4:46-6:12, రాహుకాలం: ఉ. 9:00-10:30, సూర్యోదయం: 5:44, సూర్యాస్తమయం: 6:39

విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఇసుకాసురులపై సిట్!

వైసీపీ హయాంలో జరిగిన రూ. కోట్ల ఇసుక దోపిడీ గుట్టును తవ్వి తీసేందుకు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వానికి 2,566 కోట్ల రూపాయల నష్టం కలిగించిన అక్రమార్కుల పని పట్టబోతోంది.

వైసీపీ హయాంలో రూ.2,566 కోట్ల అక్రమాలు

నేతలు జిల్లాలను పంచుకుని అడ్డంగా తవ్వేశారు

డబ్బు మూటలతో రీచ్‌లను గుప్పిట పట్టిన అరాచకం

మరో భారీ కుంభకోణం వెలికితీతకు ఏసీబీ 'సిట్'

రాయలసీమ జేడీ రాజశేఖర్‌రావు నేతృత్వంలో ఏర్పాటు

ఏఎస్పీ, నలుగురు డీఎస్పీలు, 9మంది సీఐలూ..

నాటి కాంట్రాక్టు కంపెనీలు, మైనింగ్ అధికారులు, వైసీపీ నాయకుల పాత్రపై ఆధారాలు

ఎక్కడెక్కడ తవ్వారు, సహకరించిన మైనింగ్ అధికారులు, చోద్యం చూసిన సెబ్ అధికారులపై ఆరా!

ఇటు లిక్కర్.. అటు ఇసుక.. రెండు భారీ స్కామ్‌లలో కీలక వ్యక్తి కాఫీ షాప్ ఓనర్

రెండు కేసుల్లోనూ వినిపిస్తున్న పేరు బాలం సుధీర్

అమరావతి, మే 23 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో ఇసుక దోపిడీకి పాల్పడ్డ ఇసుకాసురుల పని పట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) బృందాన్ని ఏర్పాటు చేసింది. పద్నాలుగు మందితో కూడిన ఈ సిట్‌కు రాయలసీమ జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్ రావు నేతృత్వం వహిస్తారని తెలిపింది. అడిషనల్ ఎస్పీ దిలీప్‌కుమార్, డీఎస్పీలు కిశోర్(దర్యాప్తు అధికారి), సుబ్బరాజు, రామకృష్ణ, జెస్సీ ప్రశాంతి ఈ బృందంలో కీలకంగా వ్యవహరిస్తారు. వారికి సహాయకులుగా తొమ్మిదిమంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ఉంటారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా... ఇలా మూడు జోన్లుగా విభజించి ఏ జోన్లో ఎన్ని ఇసుక రీచ్‌లు ఉన్నాయి.. వాటిలో ఎక్కడెక్కడ ఎవరెవరు ఇసుక తవ్వారు.. కాంట్రాక్టు కంపెనీయా లేదా స్థానిక వైసీపీ

మిగతా 3వ పేజీలో...

అమరావతి అధికారికం!



రాజధానిగా నోటిఫై చేస్తూ చట్టం సవరించాలని షాను కోరా: చంద్రబాబు

వచ్చే పార్లమెంటు సమావేశాల్లో సవరణకు చాన్సు

తెలిసీ తెలియనితనంతో అమరావతిపై జగన్ వ్యాఖ్యలు

మూడేళ్లలో రాజధాని కొలిక్కి!

అక్కడ బెంగళూరు, హైదరాబాద్ కంటే అధునాతన ఎయిర్‌పోర్టు

విశాఖను ఆర్థిక కేంద్రంగా మార్చే చర్యలు

జగన్ మద్యం స్కాంపై షాతో చర్చించా

వైసీపీ హయాంలో పోలవరం ధ్వంసం

2027 మార్చిలోపు దానిని పూర్తిచేస్తాం

జగన్ జమానాలో రాష్ట్రంలో విధ్వంసం

మరమ్మతులు చేయలేనంతగా నష్టం

లక్షా 20 వేల కోట్ల బిల్లులు బకాయి

రూ.9.94 లక్షల కోట్ల అప్పులు

అందుకే ప్రజలు శిక్షించారు: ముఖ్యమంత్రి

న్యూఢిల్లీ, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ నోటిఫై చేసేందుకు రాష్ట్ర విభజన చట్టాన్ని సవరించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కోరినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. మూడేళ్లలో అమరావతి నిర్మాణం కొలిక్కి వస్తుందన్నారు. రాజధాని అభివృద్ధి నిరంతర ప్రక్రియగా పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తున్నామని.. 2027 మార్చిలోపే పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. నాణ్యత, వేగం విషయంలో ఎలాంటి రాజీ పడబోమన్నారు. శుక్రవారం రాత్రి ఢిల్లీలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విభజన చట్టంలో

మిగతా 13వ పేజీలో...



ఢిల్లీలో శుక్రవారం అమిత్ షాకు జ్ఞాపిక అందజేస్తున్న చంద్రబాబు

అనుమతి రాగానే బనకచర్ల పనులు!

సముద్రంలో వృథాగా కలిసే నీటినే వాడుకుంటాం: సీఎం

లేపాక్షి- ఓర్వకల్లు ప్రాంతంలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పరిశ్రమలు

రాష్ట్రానికి ఏరో స్పేస్ ప్రాజెక్టులు.. రక్షణ రంగ పరిశ్రమలు పెట్టాలనీ అడిగాం

ఏపీలో సైనిక కంటోన్మెంట్ ఏర్పాటుకు రాజ్‌నాథ్ ఓకే: చంద్రబాబు

నిర్మల, పాటిల్, అమిత్‌షా సహా ఏడుగురు కేంద్ర మంత్రులతో భేటీ

13



మీ పోస్టులు శ్రుతిమించాయ్!

అవి మాకు అర్థం కాలేదనుకున్నారా?

ఏ ఉద్దేశంతో పెట్టారో తెలుసుకోలేమా?

సజ్జల భార్గవ్‌రెడ్డిపై సుప్రీంకోర్టు ఆగ్రహం



అసభ్య పోస్టులను వ్యవస్థ క్షమించదు

తప్పకుండా శిక్షిస్తుంది

సోషల్ మీడియా దుర్వినియోగం కేసుల్లో త్వరగా బెయిల్ వస్తుందనుకోవద్దు

సులభంగా దొరికితే ఇలాంటివారిని నియంత్రించలేం: ధర్మాసనం

ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత.. రెండువారాల పాటు మధ్యంతర రక్షణ

రెగ్యులర్ బెయిల్ కోసం ఎస్సీ, ఎస్టీ కోర్టుకు వెళ్లాలని సూచన

14



14

సుప్రీంలో కసిరెడ్డికి చుక్కెదురు

మద్యం కేసులో రాజ్, ఆయన తండ్రి పిటిషన్లను కొట్టివేసిన ధర్మాసనం

బెయిల్ కోసం దిగువ కోర్టును ఆశ్రయించాలని సూచన



'అగ్రిగోల్డ్'లో అడ్డంగా దొరికిన జోగి

సీఐడీ, ఈడీ అటాచ్‌లోని భూముల స్వాహా గుట్టు రట్టు

రెవెన్యూ, సీఐడీ, ఏసీబీ విచారణలో ఆధారాలు లభ్యం

భూములు కొన్నట్లుగా డాక్యుమెంట్లు సృష్టి

వాటినే ప్లాట్లుగా వేసి తిరిగి విక్రయం

కుమారుడు, సోదరుడి పేరిట లావాదేవీలు

తెరవెనుక కథ నడిపించిన మాజీ మంత్రి



అంబాపురంలో అగ్రిగోల్డ్ భూములను పరిశీలిస్తున్న అధికారులు

విజయవాడ, మే 23(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ భూములను అక్రమంగా విక్రయించిన వ్యవహారంలో వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ అడ్డంగా బుక్కయ్యారు. గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డు పెట్టుకుని.. ఏకంగా సీఐడీ, ఈడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న భూములను కొనుగోలు చేసినట్టుగా డాక్యుమెంట్లు సృష్టించి, వాటినే ప్లాట్లుగా వేసి విక్రయించినట్టు విచారణలో తేలింది. ఈ వ్యవహారంలో జోగి రమేశ్ తన కొడుకు, సోదరుడిని రంగంలోకి దింపారు. భూ లావాదేవీలన్నీ వారి పేరిటే జరిగాయి. జోగి రమేశ్ తెరవెనుక ఉండి మొత్తం కథ నడిపించారు. గురువారం సాయంత్రం రెవెన్యూ, సీఐడీ, ఏసీబీల సంయుక్త బృందం.. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత ఈ అక్రమాలను నిగ్గుతేల్చింది. అగ్రిగోల్డ్ భూములను విక్రయించినట్టు చట్టబద్ధమైన ఆధారాలు లభించాయి. దీంతో జోగి రమేశ్ మెడకు మరింతగా ఉచ్చు బిగుసుకోవటం ఖాయంగా కనిపిస్తోంది. సీఐడీ, ఈడీ అటాచ్‌లో

మిగతా 14వ పేజీలో...



2

యాపిల్‌పై 25% ఈయూపై 50%

ఆగని ట్రంప్ సుంకాల రంకెలు

అమెరికాలో అమ్మే ఐఫోన్లు అమెరికాలోనే తయారుచేయాలి

భారత్‌లోనో మరెక్కడో కాదని అమెరికా అధ్యక్షుడి హుకుం

జూన్ 1 నుంచి ఈయూ ఉత్పత్తులపై 50% టారిఫ్ అని హెచ్చరిక

హార్వర్డ్‌పై నిషేధం నిలిపివేత

అమెరికా జిల్లా కోర్టు తాత్కాలిక ఉత్తర్వులు

ఊపిరి పీల్చుకున్న 6703 మంది విదేశీ విద్యార్థులు

మూడు రోజుల్లో మహానాడు!

అంబరాన్నంటేలా టీడీపీ పసుపు పండుగ

కడపలో ముమ్మరంగా సాగుతున్న ఏర్పాట్లు

23 వేల మందితో ప్రతినిధుల సమావేశం

తొలి రోజు పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి

రెండో రోజు కూటమి ఏడాది విజయాలపై చర్చ

మూడో రోజు 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ

సంక్షేమం, అభివృద్ధిపై 14 ముసాయిదా తీర్మానాలు

రాయలసీమ అభివృద్ధిపై ప్రత్యేక చర్చకు నిర్ణయం

కడపలోనే మంత్రుల మకాం.. పనుల పర్యవేక్షణ



మహానాడుపై చర్చిస్తున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్ రెడ్డి

అమరావతి/కడప, మే 23(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడు మరో మూడు రోజుల్లో ప్రారంభంకానుంది. ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడప వేదికగా నిర్వహించే మహానాడుకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. తొలి రోజు.. పార్టీ ప్రతినిధుల సభ, పార్టీ సంస్థాగత నిర్మాణం, విధివిధానాలు, సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణపై కేడర్‌కు నేతలు దిశానిర్దేశం చేయనున్నారు. రెండో రోజు ప్రతినిధుల సభతోపాటు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన ముసాయిదా తీర్మానాలపై చర్చించనున్నారు. మూడో రోజు 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు కన్వీనర్‌గా ఉన్న మహానాడు తీర్మానాల కమిటీ కసరత్తు పూర్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మినీ మహానాడుల నుంచి వచ్చిన తీర్మానాలతోపాటు పార్టీ పరంగా

మిగతా 13వ పేజీలో...

పసుపుదళానికి నూతనోత్తేజం!

మహానాడులో 6 కీలక అంశాల ప్రతిపాదన

కాలానికి అనుగుణంగా పార్టీలో మార్పులు



ప్రమాదంలో లారీ కింద ఇరుక్కుపోయిన కారు

అతివేగానికి ఆరుగురు బలి

రాంగ్ రూట్‌లో వచ్చి లారీని ఢీకొట్టిన కారు

ఒకే కుటుంబంలో ఆరుగురు దుర్మరణం

ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు

ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

14

గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో పెచ్చులూడి పడి బాలుడి మృతి

తలకు తీవ్ర గాయాలై దుర్మరణం



10

2.69 లక్షల కోట్ల డివిడెండ్

కేంద్ర ప్రభుత్వానికి ఆర్‌బీఐ భారీ నజరానా

రికార్డు స్థాయిలో చెల్లింపులు

2024-25లో 27.4% పెరిగిన డివిడెండ్

కలిసొచ్చిన ఫారెక్స్ లావాదేవీలు

బెట్టింగ్.. వికృత క్రీడ

ఐపీఎల్ ముసుగులో బెట్టింగ్, జూదం

ప్రజలు పాల్గొనడాన్ని చట్టాలతో ఆపలేం

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై సుప్రీం కోర్టు

యాప్‌లపై కేఏ పాల్ పిటిషన్ కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు

2

కనిమొళి బృందానికి రష్యాలో తప్పిన ముప్పు

మాస్కో/చెన్నై, మే 23: పాకిస్థాన్ వ్యవహార శైలిని ప్రపంచ దేశాల దృష్టికి తీసుకెళ్లే ప్రణాళికలో భాగంగా రష్యాకు వెళ్లిన డీఎంకే ఎంపీ కనిమొళి సారథ్యంలోని ఎంపీల బృందానికి పెద్ద ముప్పు తప్పింది. వీరు ప్రయాణించిన విమానం గురువారం రష్యా రాజధాని మాస్కోలోని విమానాశ్రయంలో నిర్దేశిత సమయంలో దిగకుండా కొంత సమయంపాటు ఆకాశంలో చక్కర్లు కొట్టింది. రష్యాతో దీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధంలో భాగంగా ఉక్రెయిన్..గురువారం రాత్రి మాస్కోపై డ్రోన్ దాడులతో విరుచుకు పడడమే ఇందుకు కారణం. డజన్ల కొద్దీ ఉక్రెయిన్ డ్రోన్లు మాస్కోను లక్ష్యంగా చేసుకోవడంతో.. అధికారులు అక్కడి విమానాశ్రయాలను కొంత సమయంపాటు మూసివేశారు. దీంతో, 45 నిమిషాలు ఆలస్యంగా డొమొడెడోవో విమానాశ్రయంలో వీరి విమానం సురక్షితంగా లాండ్ అయినట్లు కనిమొళి సన్నిహిత వర్గాలు తెలిపాయి.

భారత్‌తో రూ.180 కోట్ల రక్షణ ఒప్పందం రద్దు

» బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ నిర్ణయం

కోల్‌కతా, మే 23: భారత్‌తో దౌత్య సంబంధాలు నానాటికీ దిగజారుతున్న వేళ ఇరు దేశాల మధ్య దూరాన్ని పెంచే విధంగా బంగ్లాదేశ్ మరో నిర్ణయం తీసుకుంది. కోల్‌కతాకు చెందిన ప్రభుత్వ రంగ నౌకా నిర్మాణ సంస్థతో రూ.180.25 కోట్ల విలువైన భారీ ఒప్పందాన్ని బంగ్లాలోని తాత్కాలిక ప్రభుత్వం రద్దు చేసుకుంది. ఈ మేరకు భారత రక్షణ శాఖ పరిధిలో పనిచేసే గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ లిమిటెడ్ (జీఆర్ఎస్ఈ) తాజాగా స్టాక్ ఎక్స్ఛేంజీకి సమాచారం ఇచ్చింది. పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ బంగ్లాదేశ్ ప్రభుత్వం తమకు ఇచ్చిన ఆర్డర్‌ను రద్దు చేసుకున్నట్లు తెలిపింది. సముద్రంలో ఓడలను లాక్కెళ్లడానికి, మునిగిపోయిన పడవలను వెలికి తీసే ఆపరేషన్లలో వినియోగించే అధునాతన టగ్ బోట్ల నిర్మాణం కోసం జీఆర్ఎస్ఈతో బంగ్లా ఒప్పందం చేసుకుంది.

పాక్‌కు 20 బిలియన్ల ప్యాకేజీపై పునరాలోచన

» ప్రపంచ బ్యాంకుకు విజ్ఞప్తి చేయనున్న భారత్

న్యూఢిల్లీ, మే 23: పాకిస్థాన్ ఆర్థిక మూలాలపై దెబ్బ కొట్టేందుకు భారత్ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. దీనిలో భాగంగా ప్రపంచ బ్యాంక్‌తో పాటు ఎఫ్ఏటీఎఫ్‌ను కలవనుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. వచ్చే నెలలో పాక్‌కు 20 బిలియన్ డాలర్ల ప్యాకేజీకి ఆమోదం తెలిపే అంశంపై పునరాలోచన చేయాలని ప్రపంచ బ్యాంకుకు భారత్ విజ్ఞప్తి చేయనుందని పేర్కొన్నాయి. అదేవిధంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాక్‌ను తిరిగి గ్రే లిస్ట్‌లోకి చేర్చాలని ఎఫ్ఏటీఎఫ్‌పై ఒత్తిడి తీసుకొచ్చే అంశాన్ని కూడా పరిశీలిస్తోంది. దీనిద్వారా దాయాది దేశం ఆర్థిక లావాదేవీలపై పర్యవేక్షణ పెరుగుతుంది. అలాగే ఆ దేశానికి విదేశీ పెట్టుబడులతో పాటు ప్రపంచ ఆర్థిక సంస్థల నుంచి నిధుల విడుదలకు అడ్డుకట్ట వేయాలని భారత్ యోచిస్తోంది.

నీటిని ఆపేస్తే.. మీ పీక నొక్కేస్తాం: పాక్ అధికారి

న్యూఢిల్లీ, మే 23: సింధూ జలాల ఒప్పందం రద్దుపై పాకిస్థాన్ సైనిక ప్రతినిధి ఒకరు భారత్‌పై తీవ్ర అనుచిత వ్యాఖ్యలు చేశారు. పాక్‌లోని ఓ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి మాట్లాడుతూ, 'మా దేశానికి రావాల్సిన సింధూ జలాలను మీరు అడ్డుకుంటే.. మీ పీక నొక్కేస్తాం' అంటూ నోరు పారేసుకున్నారు. లష్కరే తొయిబా చీఫ్ ఉగ్రవాది హఫీజ్ సయీద్ తరహాలో ఒక ఆర్మీ అధికారి మాట్లాడటం వివాదాస్పదమైంది. ఆయన వ్యాఖ్యలను అఫ్ఘాన్ రాజకీయ నాయకురాలు, మాజీ ఎంపీ మరియం సొలైమాన్‌ఖిల్ తీవ్రంగా ఖండించారు. 'మీరు నీటిని ఆపేస్తే.. మేం మీ ఊపిరి ఆపేస్తాం' అంటూ గతంలో హఫీజ్ చేసిన వ్యాఖ్యలను షరీఫ్ కాపీ కొట్టినట్లుందని అన్నారు.

'ప్రాజెక్టు కుశ' ప్రొటోటైప్ ఏడాదిలో సిద్ధం: బెల్

న్యూఢిల్లీ, మే 23: ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ చేసిన డ్రోన్, క్షిపణి దాడులను భారత్ సమర్థవంతంగా అడ్డుకుంది. రష్యా తయారీ ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ ఇందులో కీలక పాత్ర పోషించింది. అలాంటి మన సొంత అధునాతన రక్షణ వ్యవస్థ త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రాజెక్ట్ కుశ'పై.. డీఆర్‌డీవో, బెల్ (భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్) సంస్థలు యుద్ధప్రాతిపదికన పనిచేస్తున్నాయి. ఉపరితలం నుంచి గాలిలోకి (సర్ఫేస్ టు ఎయిర్) ప్రయోగించే దీర్ఘశ్రేణి క్షిపణులు, అత్యాధునిక రాడార్లు, కమాండ్ కంట్రోల్ వంటివి దీనిలో భాగంగా ఉంటాయి. మరో ఏడాది, ఏడాదిన్నరలో మన సొంత గగనతల రక్షణ వ్యవస్థ ప్రొటోటైప్ (ప్రాథమిక రూపం) సిద్ధమవుతుందని బెల్ సంస్థ ఇటీవల తమ నివేదికలో తెలిపింది.

మన విదేశాంగ విధానం కుప్పకూలింది: రాహుల్

న్యూఢిల్లీ, మే 23: కేంద్ర మంత్రి జైశంకర్ తీరుతో మన విదేశాంగ విధానం కుప్పకూలిపోయిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. పృథ్వీరాజ్ సింగ్ చౌహాన్‌కు వ్యతిరేకంగా మహమ్మద్ ఘోరీతో చేతులు కలిపిన రాజపుత్ ప్రభువు జైచంద్ పేరు ధ్వనించేలా జైశంకర్‌ను 'జై చంద్ జై శంకర్- జేజే' అని సంబోధిస్తూ ఆయనపై రాహుల్ ప్రశ్నల వర్షం కురిపించారు. "పాకిస్థాన్ చర్యలను ఖండిస్తూ ఎందుకని ఒక్క దేశమూ మన వెనుక నిలబడలేదు?" అంటూ నిలదీశారు. "ఉగ్రవాదంపై పాక్ ప్రకటనను ఎలా విశ్వసించారు? భారత ప్రయోజనాలను ఎందుకని ట్రంప్‌కు పణం పెట్టారు? కెమెరాల ఎదుట మాత్రమే ఎందుకని మీ రక్తం పొంగుతుంది? వట్టి ప్రసంగాలు కట్టిపెట్టి ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పండి" అని రాహుల్ డిమాండ్ చేశారు.

పోలింగ్ స్టేషన్ దాకా మొబైల్ తీసుకెళ్లొచ్చు!

న్యూఢిల్లీ, మే 23: పోలింగ్ రోజున ఓటర్లు తమ ఫోన్లను పోలింగ్ స్టేషన్ దాకా తీసుకువెళ్లడానికి ఎన్నికల సంఘం(ఈసీ) వెసులుబాటు కల్పించింది. అయితే, వాటిని పోలింగ్ స్టేషన్ నుంచి 100 మీటర్ల దూరంలోనే స్విచ్ఛాఫ్ చేయాలని సూచించింది. ఓటు వేసే ముందు ఫోన్లను పోలింగ్ స్టేషన్ వెలుపల ఏర్పాటు చేసే కౌంటర్లలో దాచిపెట్టాలని తెలిపింది. ఈ మేరకు శుక్రవారం మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రజలకు ఫోన్ అవసరాలు పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఇంతకుముందు పోలింగ్ స్టేషన్ నుంచి 100మీటర్ల దూరం వరకు మొబైల్ ఫోన్లపై నిషేధం ఉండేది. మరోవైపు, ఓటర్లకు ఓటర్ స్లిప్పులు అందించడానికి, బూత్ నంబర్లు చెప్పడానికి రాజకీయ పార్టీలు పోలింగ్ స్టేషన్ నుంచి 100మీటర్ల అవల బూత్‌లను ఏర్పాటు చేసుకోవచ్చని ఈసీ తెలిపింది. ఇంతకుముందు ఈ పరిధి 200మీటర్లుగా ఉంది.

యూపీలో జైలు నుంచి 104 ఏళ్ల ఖైదీ విడుదల

» 43 ఏళ్ల జైలు శిక్ష తర్వాత నిర్దోషిగా ప్రకటించిన హైకోర్టు

కౌశాంబీ (యూపీ), మే 23: హత్య, హత్యాయత్నం కేసుల్లో 43 ఏళ్ల పాటు శిక్ష అనుభవించిన 104 ఏళ్ల ఖైదీ నిర్దోషిగా జైలు నుంచి విడుదలయ్యాడు. గతంలో జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన అప్పీలు చేయగా, నిర్దోషిగా ప్రకటిస్తూ ఇటీవల హైకోర్టు ఆదేశాలిచ్చింది. కౌశాంబీ జిల్లా గౌరాయే గ్రామానికి చెందిన లఖన్ 1921లో జన్మించినట్టు జైలు రికార్డుల్లో ఉంది. 1977 ఆగస్టు 16న రెండు వర్గాల మధ్య జరిగిన కొట్లాటలో ఒకరిని హత్య చేయడంతో పాటు, మరికొందరిపై దాడి చేసినట్టు కేసు నమోదయింది. విచారణ జరిపిన ప్రయాగ్‌రాజ్ జిల్లా, సెషన్స్ కోర్టు లఖన్‌తో పాటు మరో ముగ్గురికి 1982లోయావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఈ తీర్పుపై వారు అలహాబాద్ హైకోర్టులో అప్పీలు చేశారు. హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే ముగ్గురు నిందితులు మరణించారు. విచారణ జరిపిన హైకోర్టు ఆయనను ఈ నెల 2న నిర్దోషిగా ప్రకటించింది.

బయోసెన్సర్‌తో రొమ్ము క్యాన్సర్ గుర్తింపు

న్యూఢిల్లీ, మే 23: ప్రయోగశాలల్లో చేసే ఖరీదైన పరీక్షలు అవసరం లేకుండా తక్కువ ఖర్చుతో, సులువుగా, వేగంగా రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించేందుకు రూర్కెలా-నిట్ పరిశోధకులు బయోసెన్సర్‌ను అభివృద్ధి చేశారు. టీఎఫ్ఈటీ(టన్నెల్ ఫీల్డ్ ఎఫెక్ట్ ట్రాన్సిస్టర్) అనే ఈ పరికరం టీసీఏడీ(టెక్నాలజీ కంప్యూటర్ ఎయిడెడ్) సిమ్యులేషన్ ఆధారంగా పని చేస్తుంది. సాధారణంగా ఎక్స్‌రే, మామోగ్రాఫీ, అల్ట్రా సోనోగ్రఫీ, ఎంఆర్ఐ తదితర పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తిస్తారు. ఈ పరీక్షల కోసం కొన్ని రసాయనాలు, ఇతర పదార్థాలను వినియోగిస్తారు. ఇలాంటివి అవసరం లేకుండా టీఎఫ్ఈటీ బయోసెన్సర్.. కణాల భౌతిక లక్షణాల ఆధారంగా క్యాన్సర్‌ను గుర్తిస్తుంది.

యాపిల్‌పై 25%.. ఈయూపై 50%



ఆగని ట్రంప్ సుంకాల రంకెలు

» అమెరికాలో అమ్మే ఐఫోన్లు అమెరికాలోనే తయారుచేయాలని ఇండియాలోనో మరెక్కడో కాదని అమెరికా అధ్యక్షుడి హుకుం

» జూన్ 1 నుంచి ఈయూ ఉత్పత్తులపై 50% టారిఫ్ అని హెచ్చరిక

వాషింగ్టన్, మే 23: చైనాపై సుంకాలు పెంచిన నేపథ్యంలో తన తయారీని భారత్‌కు మార్చే ప్రయత్నాల్లో ఉన్న యాపిల్ కంపెనీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారీ షాక్ ఇచ్చారు. అమెరికాలో అమ్మే ఐఫోన్లను అమెరికాలో తయారు చేయకపోతే వాటిపై 25 శాతం సుంకం విధిస్తానని హెచ్చరించారు. దీనిపై తాను ఇప్పటికే యాపిల్ సీఈవో టిమ్ కుక్‌కు సమాచారం ఇచ్చానని ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమమైన ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా వెల్లడించారు. "నేను చాలా కాలం క్రితమే యాపిల్ సీఈవో టిమ్ కుక్‌కు సమాచారం ఇచ్చాను. అమెరికాలో అమ్మే ఐఫోన్లు యూఎస్ఏలోనే తయారుకావాలి తప్ప ఇండియాలోనో, మరోచోటో కాదనే విషయాన్ని ఆయనకు చెప్పాను. అలా చేయకపోతే కనీసం 25% సుంకాన్ని యాపిల్ అమెరికాకు చెల్లించాల్సి ఉంటుంది" అని ఆయన ఆ పోస్టులో పేర్కొన్నారు. వచ్చే కొన్నేళ్లలో ప్రపంచవ్యాప్తంగా విక్రయించే ఐఫోన్లలో 25 శాతం ఫోన్లను భారత్‌లో తయారుచేయాలని యాపిల్ లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో యాపిల్ సంస్థ 22 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.87 లక్షల కోట్లు) విలువ చేసే ఐఫోన్లను యాపిల్ సంస్థ భారత్‌లో ఉత్పత్తి చేసింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 60 శాతం దాకా ఎక్కువ. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అమ్ముడవుతున్న ప్రతి ఐదు ఐఫోన్లలో ఒకటి భారత్‌లోనే తయారవుతోంది. యాపిల్‌పై సుంకాల హెచ్చరికతో పోస్టు పెట్టిన అరగంటకే.. ట్రంప్ తన సుంకాల అస్త్రాన్ని ఈయూపై గురిపెట్టారు. అమెరికాతో వాణిజ్య చర్చలకు రాని కారణంగా జూన్ 1 నుంచి యూరోపియన్ యూనియన్ ఉత్పత్తులపై 50 శాతం సుంకాలను సిఫారసు చేస్తున్నట్టు మరో పోస్టు పెట్టారు. ఈయూతో వ్యవహారం కష్టంగా ఉందని.. తమ మధ్య చర్చలు ముందుకు సాగట్లేదని ఆయన పేర్కొన్నారు. ట్రంప్ పోస్టుల దెబ్బకు అమెరికా ఫ్యూచర్స్ మార్కెట్ కుదేలైంది. అటు ఈయూ స్టాక్ మార్కెట్లు కూడా 2% మేర పతనమయ్యాయి.

హార్వర్డ్‌పై నిషేధం నిలిపివేత

» అమెరికా జిల్లా కోర్టు తాత్కాలిక ఉత్తర్వులు

» ఊపిరి పీల్చుకున్న 6703 మంది విదేశీ విద్యార్థులు

బోస్టన్, మే 23: హార్వర్డ్ యూనివర్సిటీలో విదేశీ విద్యార్థుల అడ్మిషన్లపై నిషేధం విధించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఎదురు దెబ్బ తగిలింది. దీనిపై హార్వర్డ్ యూనివర్సిటీ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన బోస్టన్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జి అల్లిసన్ బుర్రోగ్స్.. శుక్రవారం ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ నిషేధాజ్ఞలను తాత్కాలికంగా నిలిపివేశారు. అంతకుముందు శుక్రవారం ఉదయం.. 'ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ స్పష్టంగా దేశ రాజ్యాంగాన్ని, ఫెడరల్ చట్టాలను ఉల్లంఘిస్తోంది' అని పేర్కొంటూ హార్వర్డ్ యూనివర్సిటీ పిటిషన్ దాఖలు చేసింది. విద్యారంగంలో తనదైన ముద్ర వేసేందుకు, అన్ని విద్యా సంస్థలను తన గుప్పిట్లో పెట్టుకునేందుకు గురువారం హార్వర్డ్ వర్సిటీలో విదేశీ విద్యార్థుల అడ్మిషన్లపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్ (ఎస్ఈవీపీ) సర్టిఫికేషన్ రద్దు చేయడంతో ఎఫ్-1 లేదా జే-1 వీసా కింద విదేశీ విద్యార్థులకు ఈ యూనివర్సిటీలో ప్రవేశార్హత ఉండదు. అయితే, తాము పెట్టిన 6 కఠిన షరతులకు కట్టుబడి ఉంటూ 72 గంటల్లో వివరణ ఇస్తే నిషేధం ఎత్తేస్తామని డీహెచ్ఎస్ షరతు విధించింది. ఒకవేళ, ట్రంప్ సర్కార్ నిర్ణయం అమల్లోకి వస్తే 2024-25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పొందిన 788 మంది భారతీయులు సహా మొత్తం 6703 మంది విదేశీ విద్యార్థులు మరో ఎస్ఈవీపీ సర్టిఫైడ్ యూనివర్సిటీలో అడ్మిషన్ పొందడం లేదా బహిష్కరణ వేటుకు ఎదుర్కోవాల్సి ఉండేది. గత ఐదేళ్లలో తమ సంస్థలో విద్యాభ్యాసం చేసిన విదేశీ విద్యార్థుల ప్రవర్తన, క్రమశిక్షణ, క్యాంపస్ ఆవరణలో నిరసనల ప్రదర్శనలు, హింసాత్మక కార్యకలాపాలపై వచ్చే 72 గంటల్లో హార్వర్డ్ యూనివర్సిటీ ఇచ్చిన నివేదికను బట్టి తన నిషేధాన్ని ఎత్తివేస్తామని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ షరతు విధించిన సంగతి తెలిసిందే.

కెనడా స్టడీ పర్మిట్లలో భారీ కోత

» ఈ ఏడాది జనవరి-మార్చి మధ్య కేవలం 30,640 పర్మిట్లు జారీ

» గత ఏడాదితో పోలిస్తే 31% తగ్గుదల

» భారతీయ విద్యార్థులకు గట్టి షాక్

ఒట్టావా, మే 23: భారీ స్థాయిలో వలసల నేపథ్యంలో కెనడా అనుసరిస్తున్న కఠినమైన వీసా నిబంధనల కారణంగా ఆ దేశానికి వెళ్లి చదువుకొనే భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. స్టడీ పర్మిట్లలో కెనడా ఈ ఏడాది భారీగా కోత పెట్టింది. ఇమిగ్రేషన్ రిఫ్యూజెస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా (ఐఆర్‌సీసీ) గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది మొదటి త్రైమాసికం (జనవరి-మార్చి)లో భారతీయ విద్యార్థులకు కేవలం 30,640 పర్మిట్లు జారీచేశారు. ఇది గత ఏడాది ఇదే కాలానికి సంబంధించి జారీచేసిన పర్మిట్లతో పోలిస్తే 31 శాతం తగ్గుదల కనిపిస్తోంది. దేశంలోకి భారీగా వస్తున్న విదేశీ విద్యార్థుల సంఖ్యను నియంత్రించేందుకు కెనడా ప్రభుత్వం 2023 నుంచి చర్యలు తీసుకుంటోంది. ఆ ఏడాది మొత్తం 6,81,155 స్టడీ పర్మిట్లను జారీచేయగా.. వాటిల్లో భారతీయులే 2,78,045 ఉన్నారు. అదే 2024 నాటికి మొత్తం సంఖ్యను 5,16,275కు తగ్గించారు. అందులో భారతీయ విద్యార్థుల సంఖ్య 1,88,465కు పడిపోయింది. భారీ స్థాయిలో వలసలు ఉండడంతో కెనడా ప్రభుత్వం విద్యార్థుల పర్మిట్ల విషయంలో నియంత్రణ విధించాలని నిర్ణయించింది. దేశంలో పెరుగుతున్న గృహ సంక్షోభం ఇందుకు ప్రధాన కారణంగా ఉంది. దీంతో పాటు ఆరోగ్య, రవాణా మౌలిక సదుపాయాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోంది. కొత్త ప్రధానిగా ఎన్నికైన మార్క్ కార్నీ ఇటీవల కీలక ప్రకటన చేశారు. విదేశీ విద్యార్థులు, పనిచేసే వారితో సహా దేశంలో తాత్కాలిక నివాసితుల సంఖ్య 2028 నాటికి దేశ జనాభాలో 5 శాతానికి మించకూడదన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఐఆర్‌సీసీ.. 2025కు సంబంధించి స్టడీ పర్మిట్లను 4,37,000కు పరిమితం చేసింది. తొలుత దీన్ని 4,85,000 అనుకున్నారు. కెనడాలో ఉంటున్న విదేశీ విద్యార్థుల్లో భారతీయుల సంఖ్య అధికంగా ఉంటుంది. 2022లో మొత్తం విదేశీ విద్యార్థుల్లో మనవాళ్ల సంఖ్య 41 శాతం వరకు ఉండటం గమనార్హం.

లోకం తీరు



టెక్ ఉద్యోగాలకు భారీగా కత్తెర

» దిగ్గజ సంస్థల్లో కొనసాగుతున్న కోత

» ఏఐ ప్రభావం, ఆర్థిక అనిశ్చితి కారణం

న్యూఢిల్లీ, మే 23: దిగ్గజ టెక్నాలజీ సంస్థలు ఈ ఏడాది కూడా ఉద్యోగులను భారీ సంఖ్యలో తొలగిస్తున్నాయి. ఉద్యోగాలకు కోతలు పెడుతున్న వాటిలో మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, క్రౌడ్ స్ట్రయిక్ వంటి సంస్థలు ఉన్నాయి. ఆదాయ ఆర్జన మందగించడం, ఆర్థిక అనిశ్చితి కొనసాగడం, కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం పెరగడం తదితర కారణాల వల్ల ఈ కంపెనీలు ఉద్యోగులకు లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయి. 2025లో ఇప్పటి వరకు 130 కంపెనీలు 61 వేల మంది ఉద్యోగులను తొలగించాయని లేఆఫ్స్‌డాట్‌ఎఫ్‌వైఐ సంస్థ వెల్లడించింది. ఒక్క మైక్రోసాఫ్ట్ సంస్థ తన ఉద్యోగుల్లో ఈ ఏడాది 6 వేల మందిని ఇంటికి పంపించింది. వాషింగ్టన్ రాష్ట్రంలోనే 2 వేల మందికి ఉద్వాసన పలికింది. 2023 తర్వాత ఆ కంపెనీలో ఇంత ఎక్కువ మందిని తీసివేయడం ఇదే మొదటిసారి. గూగుల్‌లో అయితే 2023లో 12 వేల మందిని ఒకేసారి తొలగించిన తర్వాత కూడా ఆ పంథాను స్థిరంగా కొనసాగిస్తోంది. తన ఆపరేషన్ మోడల్‌ను మెరుగుపరిచే క్రమంలో ఈ ఏడాది పిక్సెల్, ఆండ్రాయిడ్, క్రోమ్, క్లౌడ్ యూనిట్లలో ఉద్యోగాలకు కత్తెర వేసింది. ఇక ఈనెల ప్రారంభంలో తన యాడ్ సేల్స్ భాగస్వామ్య విభాగాలను నిర్వహించే గ్లోబల్ బిజినెస్ ఆర్గనైజేషన్ నుంచి 200 మందిని తొలగించింది. ఈ ఏడాది అమెజాన్ తన డివైజెస్ అండ్ సర్వీస్ విభాగంలో 100 మందిని పక్కనబెట్టింది. ఈ విషయంలో ఐబీఎం కొంత వైవిధ్యాన్ని చూపుతోంది. ఓ పక్క హెచ్ఆర్ వంటి విభాగాల్లో ఉద్యోగులను తొలగిస్తూ ఆ స్థానాలను ఏఐ టెక్నాలజీతో పూరిస్తోంది. మిగిలిన నిధులతో ప్రోగ్రామింగ్, సేల్స్‌లో నైపుణ్యం కలిగిన వారిని తీసుకుంటోంది.

అమ్మా.. నేను చోరీ చేయలేదు!

సూసైడ్ నోట్ రాసి 13 ఏళ్ల బాలుడి ఆత్మహత్య

కోల్‌కతా, మే 23: చేయని దొంగతనాన్ని తనపై మోపారన్న మనస్తాపంలో 13ఏళ్ల బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకుముందు సూసైడ్ నోట్ రాశాడు. అందులో 'అమ్మా నేను దొంగతనం చేయలేదమ్మా' అని బాధపడ్డాడు. పశ్చిమ బెంగాల్‌లోని తూర్పు మిడ్నాపోర్‌లో ఇటీవల ఈ ఘటన జరిగింది. బాలుడి పేరు కృష్ణేందు దాస్. శుభాంకర్ దీక్షిత్ అనే వ్యక్తి స్థానికంగా ఓ దుకాణం నిర్వహిస్తున్నాడు. అతడు షాపులో లేని సమయంలో కృష్ణేందు మూడు చిప్స్ ప్యాకెట్స్ తీసుకొని వెళ్లిపోయాడని స్థానికులు చెప్పారు. దీక్షిత్ కోపంతో నేరుగా బాలుడి ఇంటికి వెళ్లాడు. అక్కడ ఆ బాలుడు దీక్షిత్‌కు 20 రూపాయలు ఇచ్చాడు. అయినా, కృష్ణేందును తనతో పాటు దుకాణానికి తీసుకెళ్లిన దీక్షిత్, చిప్స్ ప్యాకెట్స్ ధర 15రూపాయలను మినహాయించుకొని ఆ చిన్నారికి ఐదు రూపాయలు తిరిగిచ్చేశాడు. ఆపై చిన్నారిని కొట్టి.. స్థానికుల ఎదుట క్షమాపణలు చెప్పించుకున్నాడు. దీంతో బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.



గ్యాంగ్ రేప్ నిందితుల రోడ్ షో

నలుగురి అరెస్ట్.. ముగ్గురి కోసం గాలింపు

బెంగళూరు, మే 23(ఆంధ్రజ్యోతి): గత ఏడాది జనవరి 8న కర్ణాటకలోని హనగల్ శివారులో ఓ మహిళపై గ్యాంగ్‌రేప్ జరిగింది. ఈ కేసులో 19 మంది నిందితులు. వారిలో ఏడుగురు ప్రధాన నిందితులు. ఈ ఏడుగురు ఈ నెల 20న జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ సందర్భంగా వారు 5కార్లతో అనుచరులతో రోడ్ షో చేస్తూ ఇళ్లకు వెళ్లారు. ఆ వీడియోలు వైరల్ అయ్యాయి. దీంతో, ఆ నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల్లో నలుగురిని శుక్రవారం అరెస్టు చేశారు. మిగిలిన ముగ్గురికోసం గాలిస్తున్నారు.

కోటాలోనే ఎందుకు విద్యార్థులు చనిపోతున్నారు?

» రాజస్థాన్‌ను నిలదీసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మే 23: కోచింగ్ సెంటర్ల కేంద్రమైన రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతుండడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఏడాదిలో ఇంతవరకు 14 మంది చనిపోవడం తీవ్రమైన విషయమని తెలిపింది. ఇందుకు సంబంధించిన వ్యాజ్యంపై శుక్రవారం విచారణ చేపట్టింది. పిల్లల ఆత్మహత్యల నివారణకు రాజస్థాన్ ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించింది. దర్యాప్తునకు సిట్‌ను నియమించినట్టు రాజస్థాన్ న్యాయవాది బదులిచ్చారు. విద్యార్థుల ఆత్మహత్యలపై కేసు నమోదులో ఆలస్యంపైన కూడా సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసింది.

బెట్టింగ్.. సమాజ వికృత క్రీడ

అందులో పాల్గొనకుండా చట్టాలతో ఆపలేం .. ఐపీఎల్ ముసుగులో బెట్టింగ్, జూదం ఆడుతున్నారు

» ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై సుప్రీం వ్యాఖ్యలు

» యాప్‌లను నిషేధించాలంటూ కేఏ పాల్ వ్యాజ్యం



న్యూఢిల్లీ, మే 23(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ అనేది సమాజ వికృత క్రీడని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. చట్టాన్ని అమలు చేయడం ద్వారా ప్రజలు స్వచ్ఛందంగా బెట్టింగ్‌లో పాల్గొనడాన్ని ఆపలేమని అభిప్రాయపడింది. అన్ని ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై నిషేధం విధించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ మార్చి 26న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. కేఏ పాల్ స్వయంగా వాదనలు వినిపించారు. బెట్టింగ్ యాప్‌ల కారణంగా ఒక్క తెలంగాణలోనే గత రెండేళ్లలో 1,023 మంది బలవన్మరణానికి పాల్పడ్డారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు 25మంది నటులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు తమ స్వార్థం కోసం అమాయకుల జీవితాలతో ఆటలాడుతున్నారని ఆరోపించారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలపై చర్యలు తీసుకోవాలని, దీనికి సంబంధించి ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చేలా కేంద్రానికి ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. "సచిన్‌ను క్రికెట్ దేవుడని అభిమానులు భావిస్తారు. అలాంటి వ్యక్తి ఆమోదిస్తే.. ఆ యాప్ సరైందేనని ప్రజలు అనుకుంటారు" అని తెలిపారు. ఈ సందర్భంగా ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. 'బెట్టింగ్‌ను ఎలాగైనా ఆపాలి. ఈ విషయంలో కోర్టు మీతో ఉంది. అయితే, చట్టం ద్వారా బెట్టింగ్ ఆపవచ్చనే అపోహలో మీరున్నట్టు కనిపిస్తోంది. హత్య చేస్తే ఎంతో బలమైన చట్టాలు ఉన్నాయి. ఐపీసీ 302 కింద జీవిత ఖైదు నుంచి మరణ శిక్ష వరకు విధించే అవకాశం ఉంది. మరి హత్యలు చేయకుండా మీరు ఆపగలరా?" అని పిటిషనర్‌ను ప్రశ్నించింది. కేఏ పాల్ పిటిషన్‌పై సమాధానం చెప్పాలని కేంద్రానికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. అవసరమైతే రాష్ట్రాలకు కూడా నోటీసులు జారీ చేస్తామని పేర్కొంది.

మాతృత్వ సెలవులు ఇద్దరికే కాదు

మాతృత్వ ప్రయోజనాల్లో సెలవులు కూడా ఓ భాగమని శుక్రవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దానిని ఇద్దరు పిల్లలకే పరిమితం చేయాడదని సూచించింది. తనకు మొదటి వివాహం ద్వారా కలిగిన ఇద్దరు పిల్లల విషయంలో మాతృత్వ సెలవులు ఇచ్చారని, రెండో వివాహం ద్వారా కలిగిన సంతానానికి ఇవ్వలేదని పేర్కొంటూ తమిళనాడుకు చెందిన ఓ టీచరు చేసిన ఫిర్యాదుపై విచారణ జరిపిన కోర్టు ఈ స్పష్టత ఇచ్చింది. సెలవులు పొందేందుకు పిల్లల సంఖ్య అడ్డం కాబోదని తెలిపింది.

అతడి చేష్టను ఆమె నేరంగా చూడటం లేదు

» 14 ఏళ్ల బాలికతో శృంగారంలో పాల్గొన్న వ్యక్తిని నిర్దోషిగా ప్రకటించిన సుప్రీం

న్యూఢిల్లీ, మే 23: పోక్సో కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు శుక్రవారం అరుదైన తీర్పును వెలువరించింది. ఏడేళ్ల క్రితం 14 ఏళ్ల బాలికతో శృంగారంలో పాల్గొని, పోక్సో చట్టం కింద దోషిగా తేలిన వ్యక్తిని సర్వోన్నత న్యాయస్థానం నిర్దోషిగా ప్రకటించింది. పైగా ఈ కేసు అందరికీ 'కనువిప్పు' కావాలి అని తీర్పులో ప్రత్యేకంగా ప్రస్తావించింది. 'తనపట్ల నిందితుడు చేసిన పనిని బాధితురాలు నేరంగా పరిగణించడం లేదు. పైగా అతడితో ఆమె భావోద్వేగంతో కూడిన అనుబంధాన్ని పెంచుకొంది' అని తీర్పులో వ్యాఖ్యానించింది. 2018లో 14 ఏళ్ల బాలికగా ఒకానొక రోజు ఆమె కనిపించకుండా పోయింది. అదేరోజు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మర్నాడు.. ఆ బాలికను 25 ఏళ్ల వ్యక్తి పెళ్లి చేసుకున్నట్లు కుటుంబసభ్యులకు తెలిసింది. దీనిపై స్థానిక కోర్టులో బాలిక కుటుంబసభ్యులు కేసు వేశారు. విచారణ చేసిన కోర్టు ఆ వ్యక్తికి పోక్సో చట్టం కింద దోషిగా నిర్ధారించి 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఈ కేసు క్రమంగా సుప్రీంకోర్టును చేరింది. 'బాధితురాలు ఇప్పుడు ఆ వ్యక్తి భార్య' అని విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం ప్రత్యేకంగా ప్రస్తావించింది. 'తన భర్తను శిక్ష నుంచి కాపాడుకునేందుకు ఆమె పోరాటం చేస్తోంది. ప్రస్తుతం ఆ దంపతులకు బిడ్డ కూడా ఉంది. ఈ కేసులో నిందితుడికి శిక్ష విధిస్తే న్యాయం జరగదు. అలా చేస్తే కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసినట్లవుతుంది" అని పేర్కొంది.

నేషనల్ హెరాల్డ్ విరాళాలపై మళ్లీ కలకలం

పదవుల ఆశ చూపి వసూలు చేశారు

» ఇది క్విడ్ ప్రో కో కిందే వస్తుంది: ఈడీ



న్యూఢిల్లీ, మే 23: కాంగ్రెస్ అధికార పత్రిక నేషనల్ హెరాల్డ్ కోసం ఆ పార్టీ నేతల నుంచి విరాళాలు సేకరించిన వ్యవహారం మరోసారి కలకలం రేపింది. రేవంత్‌రెడ్డి, అహ్మద్ పటేల్, పవన్ బన్సల్ లాంటి ముఖ్యమైన నేతలు పార్టీ టికెట్లు, పదవులిస్తామని ఆశ చూపి కాంగ్రెస్ నేతల దగ్గర నుంచి విరాళాలు సేకరించారని, ఇది క్విడ్ ప్రో కో కిందకు వస్తుందంటూ గత నెల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఢిల్లీ కోర్టులో దాఖలు చేసిన చార్జిషీటు తాజాగా వెలుగులోకి రావడంతో రాజకీయ దుమారం రాజుకుంది. నిజానికి 2022లోనే తెలంగాణకు చెందిన పలువురు నేతలను ఈడీ విరాళాల వ్యవహారంలో ప్రశ్నించింది. తాజాగా వెలుగులోకి వచ్చిన చార్జిషీటులో రేవంత్‌రెడ్డి సూచన మేరకే రాష్ట్ర నాయకులు రూ.80 లక్షలు విరాళంగా ఇచ్చారని పేర్కొంది. బయటి వ్యక్తులను కూడా విరాళాలు ఇవ్వాలని రేవంత్‌రెడ్డి కోరారని తెలిపింది. డీకే శివకుమార్ స్వయంగా రూ.25 లక్షలు విరాళమిచ్చారని, ఆయనకు సంబంధించిన ట్రస్ట్ నుంచి రూ.2 కోట్లు ఇప్పించారని పేర్కొంది. యంగ్ ఇండియా కార్యకలాపాలేమిటో తనకు తెలియదని, పార్టీ కోశాధికారి పవన్ బన్సల్ కోరితే విరాళమిచ్చానని శివకుమార్ చెప్పారని వెల్లడించింది. ఈ కేసులో ఈడీ కాంగ్రెస్ ముఖ్యనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలను ప్రధాన నిందితులుగా పేర్కొంది. అభియోగ పత్రాల్లో రేవంత్‌రెడ్డి, పవన్ బన్సల్, అహ్మద్ పటేల్‌ల పేర్లను ప్రస్తావించినా వారిని నిందితులుగా పేర్కొనలేదు. ఈ కేసు విచారణ బుధవారం రౌస్ ఎవెన్యూ కోర్టులో జరగడంతో చార్జిషీటు వెలుగులోకి వచ్చింది. ఈడీ అభియోగపత్రం ప్రతీకార రాజకీయాల్లో భాగమని కాంగ్రెస్ పేర్కొంది. ముగ్గురు నేతల మనసు కష్టపెట్టడం పార్టీలో తమ భవిష్యత్తుకు నష్టం చేస్తుందనే అభిప్రాయాన్ని విరాళాలు ఇచ్చిన నేతలు చెప్పినట్లు ఈడీ తెలిపింది. యంగ్ ఇండియాకు కాంగ్రెస్ నేతలు, ఇతరులు ఇచ్చిన సొమ్మును విరాళాలుగా పరిగణించరాదని, అవి స్వచ్ఛందంగా ఇచ్చినవి కాదని, రాజకీయంగా ప్రయోజనాన్ని ఆశించి ఇచ్చినవని ఈడీ అభియోగ పత్రంలో పేర్కొంది. విరాళాలను కాంగ్రెస్ పార్టీ ఆదాయ పన్ను శాఖకు చెల్లించాల్సిన పన్ను బకాయిలపై అప్పీలుకు డిపాజిట్‌గా వాడిందని పేర్కొంది. విరాళాలు వసూలు చేయాలన్న నిర్ణయాన్ని పార్టీ నేతలతో పంచుకున్నది దివంగత నేత ఆస్కార్ ఫెర్నాండెజ్ అని ఈడీ వెల్లడించింది.



మద్యం మత్తులో ఉన్న పోలీసులు

ముగ్గురు ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల వీరంగం


రోడ్డుపై పడి దొర్లుతున్న కానిస్టేబుల్


కానిస్టేబుళ్లను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

తిరుమల/కర్నూలు క్రైం, మే 23(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు భద్రత కల్పించాల్సిన పోలీసులే తప్పతాగి స్థానికులను, వాహనదారులను భయభ్రాంతులకు గురిచేశారు. కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఓంకార్ నాయక్, కానిస్టేబుళ్లు రాజశేఖర్, షేక్ సిరాజుద్దీన్ తిరుమలలో విధులు నిర్వహించేందుకు రెండు రోజుల క్రితం వచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం ఏపీఎస్పీ విభాగానికి చెందిన ఓ అధికారి వాహనం తీసుకుని తిరుపతికి వెళ్లారు. మద్యం తాగి.. అలిపిరి భద్రతా తనిఖీలను దాటి మరీ సాయంత్రం తిరుమల చేరుకున్నారు. డీ టైప్ క్వార్టర్స్ వద్దనున్న సచివాలయం వద్ద డివైడర్‌ను ఢీకొనడంతో జీపు ముందు టైర్ పగిలిపోయింది. దీంతో వారు వాహనం దిగి నానా హంగామా చేశారు. నేలపై పడి దొర్లుతూ.. రోడ్డు పక్కనే మూత్ర విసర్జన చేసి హల్‌చల్ చేశారు. ఈ విషయం తెలిసి విజిలెన్స్, ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈలోగా షేక్ సిరాజుద్దిన్ పారిపోగా, రాజశేఖర్, ఓంకార్ నాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు.

కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు

మద్యం తాగి తిరుమలలో వీరంగం చేసిన కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్ కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ కమాండెంట్ దీపికా పాటిల్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే వీరి ఇన్‌చార్జి ఆర్ఎస్ఐకి కూడా చార్జిమెమో జారీ చేసినట్టు వెల్లడించారు.

తిరుమలలో నమాజ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు

తిరుమల, మే 23(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా తిరుమలలో నమాజ్ చేసిన వ్యక్తిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుమలలోని కల్యాణ వేదికలో గురువారం అన్యమతానికి చెందిన ఓ వ్యక్తి నమాజ్ చేసిన వీడియో బయటకు వచ్చింది. ఈ మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కారు నెంబరు ఆధారంగా అతన్ని చెన్నైకు చెందిన అబ్బాస్‌గా పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. ఇక్కడ నమాజ్ చేయవచ్చా అని సమీపంలోని మరో వ్యక్తిని అడిగిన క్రమంలో చేసుకోవచ్చని చెప్పాడని, దాంతోనే నమాజ్ చేశాడని పోలీసులు ప్రాథమిక విచారణలో తేలినట్టు సమాచారం.

ఇంటర్న్‌షిప్ మూడేళ్లా?: ఏపీ ఐఎంఏ

గుంటూరు మెడికల్, మే 23(ఆంధ్రజ్యోతి): కొన్ని నెలలుగా విదేశాల్లో వైద్య విద్య అభ్యసించిన తెలుగు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బాసటగా నిలుస్తామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిషోర్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఏడాది కాల పరిమితి ఉండే వైద్య విద్యార్థుల ఇంటర్న్‌షిప్ ఏపీలో మాత్రం రెండు, మూడు సంవత్సరాలు విధించడం సమంజసంకాదని తెలిపారు.

ఇసుకాసురులపై సిట్!

(మొదటి పేజీ తరువాయి)

నాయకులా అనేదానితోపాటు, ఇందుకు సహకరించిన మైనింగ్ అధికారులు.. చోద్యం చూసిన సెబ్ అధికారులు.. తవ్విన ప్రొక్లయినర్లు, ఇసుక తీసుకెళ్లిన లారీలు చేరిన గమ్యం....ఇలా ప్రతి విషయాన్నీ విశ్లేషించుకుని పూర్తి స్థాయిలో ఉచ్చు బిగించేందుకు ఏసీబీ సిట్ నడుం బిగించింది. నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ ఆదేశాలను సైతం ధిక్కరించి రాత్రింబవళ్లూ నదీగర్భాన్ని తవ్వి తరలించిన ప్రతి ఒక్కరి పనీ 'సిట్' పట్టబోతోంది. వైసీపీ ప్రభుత్వంలో ఇసుక తవ్వకాల కాంట్రాక్టు కంపెనీలు, సబ్ కాంట్రాక్టు తీసుకున్న సంస్థలు, జిల్లాల్లో అడ్డూఅదుపు లేకుండా తవ్వేసి తరలించిన వైసీపీ నేతలు, పూర్తిగా సహకరించిన మైనింగ్ అధికారుల పాత్రపై ఆధారాలను ఏసీబీ ఇప్పటికే సేకరించింది. ఏపీలోని నదులు, వాగుల నుంచి పొరుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి మహా నగరాలకు అక్రమ ఇసుక ఎలా తరలి వెళ్లిందో ఏసీబీ పసిగట్టింది. తాడేపల్లిలోని సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ కార్యాలయం నుంచి ఏసీబీ సిట్ తన పని మొదలు పెట్టనుంది.

జిల్లాలను పంచుకుని తవ్వేశారు

గత జగన్ పాలనలో ఇసుక తవ్వకాల పేరుతో భారీ అవకతవకలకు 2021 మే నుంచి బీజం పడింది. జిల్లాల్లో అధికార పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజా ప్రతినిధులు ఇసుక అక్రమంగా తరలించి భారీగా లాభపడుతున్నట్లు జగన్ తాను అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పసిగట్టారు. స్థానిక నేతలు ఆర్థికంగా బలపడితే తన మాట వినరనే ఆలోచనతోపాటు అవినీతిని కేంద్రీకృతం చేస్తే వేల కోట్లు తనకే చేరతాయనే అసలు లక్ష్యంతో ఇసుక రీచ్‌లను టెండర్ పద్ధతిలో కట్టబెట్టారు. జై ప్రకాశ్ పవర్ వెంచర్స్(జేపీ వెంచర్స్) నవంబర్ 2023 వరకూ 'కాగితాల'పై తవ్వకాలు చేపట్టినా ఏడాదిలోనే తన వల్ల కాదంటూ చేతులెత్తేసింది. అర్నెల్లు బలవంతంగా టెండర్ పొడిగించి, ఆ తర్వాత టర్న్‌కీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్‌కు అప్పగించారు. ఎక్కడికక్కడ వైసీపీ నేతలు (చిత్తూరులో పెద్దిరెడ్డి, నెల్లూరులో వైసీపీ నేతలు, గుంటూరులో నందిగం సురేశ్, కృష్ణాలో కొడాలి నాని, గోదావరి జిల్లాల్లో అక్కడి నేతలు, ఉత్తరాంధ్రలో అప్పటి వైసీపీ 2పేరుతో) ఇసుక తవ్వుకొని తీసుకెళుతుంటే 'మా వల్ల కాదం'టూ టర్న్ కీ దండం పెట్టేసింది. మూడో కృష్ణుడి రూపంలో ప్రతిమా అనే కంపెనీ ముందుకొచ్చినా రాజస్థాన్‌కు చెందిన జీసీకేఎల్‌కు మొత్తంగా ఇచ్చేసింది. ఏదీ సాధ్యం కాకపోవడంతో జిల్లాల్లోని నేతలకే ఎక్కడికక్కడ కట్టబెట్టేందుకు గత ప్రభుత్వం సిద్ధమైంది. ప్రభుత్వ పెద్దలు ముందుగా ఎవరు టేబుల్‌పై డబ్బులు పెడితే వారికే ఇసుక రీచ్‌లు అంటూ ఆఫర్ ఇచ్చారు. ఆశపడి రూ.పది కోట్లు ఇచ్చుకున్న గోదావరి జిల్లాల్లో ఓ కాంట్రాక్టరు చివరికి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

వెంకటరెడ్డితో మొదలుపెట్టి..

వైసీపీ ప్రభుత్వంలో ఇసుక టెండర్లు, తవ్వకాల్లో భారీగా జరిగిన అక్రమాల వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు 2,566 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని కూటమి ప్రభుత్వం నిర్ధారించింది. మైనింగ్ కార్పొరేషన్ మాజీ ఎండీ వెంకట రెడ్డిపై ఏసీబీ కేసు నమోదు చేసి అరెస్టు చేసింది. ఇండియన్ కోస్ట్‌గార్డులో సీనియర్ సివిలియన్ స్టాఫ్ ఆఫీసర్‌గా పనిచేస్తోన్న వెంకటరెడ్డి ఏపీలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడగానే డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి వచ్చారు. గనుల శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి 2020 నుంచి అక్రమాలకు పాల్పడ్డారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత విచారణకు ఆదేశించడంతో ఏసీబీ రంగంలోకి దిగింది. ప్రాథమిక విచారణలో కీలక ఆధారాలు బయట పడ్డాయి. దీంతో ఏసీబీ అధికారులు వెంకట రెడ్డిపై అవినీతి నిరోధక చట్టంతోపాటు ఇండియన్ మినరల్స్ యాక్టు, ఐపీసీలోని నేరపూరిత కుట్ర, మోసం సెక్షన్లతో అభియోగాలు మోపారు. సహ నిందితులుగా అనిల్ ఆత్మారామ్ కామత్ (జేపీపీఎల్), పి.అనిల్ కుమార్ (ప్రతిమా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్); ఆర్.వెంకటకృష్ణారెడ్డితోపాటు(జేసీకేఎల్ ప్రాజెక్ట్స్ అండ్ వర్క్స్) జేపీపీఎల్, ప్రతిమా సంస్థలను కూడా చేర్చింది. విచారణకు పిలుద్దామని ఏసీబీ అధికారులు ప్రయత్నించగా వెంకటరెడ్డి పరారయ్యారు. చివరికి గతేడాది సెప్టెంబరు చివరి వారంలో హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని విజయవాడ జైలుకు పంపారు. కండీషన్ బెయిల్‌పై విడుదలై వారానికి రెండుసార్లు ఏసీబీ కార్యాలయానికి వచ్చి వెంకటరెడ్డి సంతకం చేసి వెళుతున్నారు. ఇక..ఆయన సహ నిందితులకూ ఉచ్చు బిగించేందుకు 'సిట్' సిద్ధమవుతోంది.

ఇటు లిక్కర్‌లో.. అటు ఇసుకలో..

- రెండు భారీ స్కామ్‌లలో కీలక వ్యక్తి కాఫీ షాప్ ఓనర్
- రెండు కేసుల్లోనూ వినిపిస్తున్న ఏకైక పేరు బాలం సుధీర్

అమరావతి, మే 23(ఆంధ్రజ్యోతి): 'నేను తెలుగు భాష లెక్క.. ఆడా ఉంటా, ఈడా ఉంటా'.. ఇది ఒక సినిమాలో హీరో అల్లు అర్జున్ చెప్పే ఫేమస్ డైలాగ్.. 'నేను వైసీపీ పాలనలో స్కాముల లెక్క.. అందులోనూ ఉంటా, ఇందులోనూ ఉంటా' అంటున్నాడు ఓ కాఫీ షాప్ ఓనర్. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన బాలం సుధీర్ హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో 'బియాండ్ కేఫ్' పేరుతో కాఫీ షాప్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'కాఫీ షాపు వర్కర్ లిక్కర్ కథ ఇదీ' అంటూ ప్రచురితమైంది. ఆ వార్తలో పురుషోత్తం వరుణ్ కుమార్ అనే రూ.32 వేల ఉద్యోగికి లిక్కర్ స్కామ్‌లో పాత్ర ఎలా ఉందనే సమాచారం ఇటు లిక్కర్ సిట్.. అటు ఏసీబీ అధికారుల్లో చర్చకొచ్చింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని కాఫీ షాపు గురించి ఆరా తీసిన దర్యాప్తు సంస్థలకు సుధీర్ పేరు తెలిసింది. లిక్కర్ స్కామ్‌లో ఏ1 రాజ్ కసిరెడ్డికి అత్యంత సన్నిహితుల్లో ఒకరైన సుధీర్ కేఫ్‌లో మద్యం అక్రమార్కులు తరచూ కలిసేవారని సిట్ అధికారులకు సమాచారం ఉంది. మద్యం వ్యాపారుల నుంచి ముడుపులు అందుకున్న క్యాష్ హ్యాండ్లర్లు పలుమార్లు ఇదే కాఫీ షాపులోకి రాజ్ కసిరెడ్డి సూచన మేరకు డబ్బు సంచులు ఇచ్చి వెళ్లినట్లు ఆధారాలున్నాయి. ఈ నేపథ్యంలో లిక్కర్ సిట్ అధికారులు కూపీ లాగుతున్నారు. కాగా.. ఇసుక అక్రమ తవ్వకాల కేసు దర్యాప్తు చేస్తోన్న ఏసీబీ అధికారులు ఇటీవల సుధీర్‌ను పిలిచి విచారించారు. కాకినాడకు చెందిన ఒక వైసీపీ నాయకుడి సహకారంతో ఇసుక అక్రమ తవ్వకాల్లోకి ప్రవేశించిన సుధీర్ భారీగా హైదరాబాద్‌కు ఇసుక అక్రమంగా తరలించినట్లు ఏసీబీ ఆధారాలు సేకరించింది. ఎంపీ అయ్యేందుకు పార్టీలు మారి ఓటమిలో రికార్డు సృష్టించిన ధనికుడి ద్వారా రాజ్ కసిరెడ్డితోనూ పరిచయం ఏర్పడినట్లు తెలుస్తోంది. ఇదే పరిచయంతో పురుషోత్తం వరుణ్ కుమార్‌ను ఏపీలో లీలా డిస్టిలరీస్‌కు ఇన్‌చార్జిగా ముందు పెట్టి మొత్తం బాగోతం సుధీర్ నడిపించినట్లు సమాచారం.


వర్క్‌షాపులో మాట్లాడుతున్న పి.కృష్ణయ్య

పర్యావరణ పరిరక్షణకు కాలుష్య నియంత్రణ బోర్డు కీలకం

- రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు చైర్మన్ పి.కృష్ణయ్య

విజయవాడ, మే 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కీలకపాత్ర పోషిస్తుందని ఏపీపీసీబీ చైర్మన్ పి.కృష్ణయ్య అన్నారు. శుక్రవారం విజయవాడలోని ఓ హోటల్‌లో ఏర్పాటుచేసిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడుతూ, భూమ్మీద పేరుకుపోతున్న వ్యర్థాలను తొలగించడంలో బాధ్యతాయుతమైన పాత్ర నిర్వహించడంతో పాటు ఈ రంగంలో ఉద్యోగాలను పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. అందులో భాగంగానే బోర్డు నిర్వహించిన వర్క్‌షాపులో పలు ఐఐటీ, మెటీరియల్ రీసైక్లింగ్, పరిపత్రం సొల్యూషన్ నిపుణులతో ఎకానమీ, వినూత్న అవకాశాలు, మార్గాలను తెలుసుకోవడం కోసం నిపుణులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు వెల్లడించారు. ముఖ్యంగా రాష్ట్రంలో ప్లాస్టిక్, ఘన, బ్యాటరీ, ఫోటో వోల్టాయిక్, వేస్ట్ ఆయిల్, టైర్, మెటల్ వ్యర్థాలు గడువు ముగిసిన వాహనాలు వివిధ రకాల వ్యర్థాలకు సంబంధించిన చర్చాగోష్టి నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏపీపీసీబీ సభ్యుడు శరవణన్, సుమారు 150 మంది వివిధ స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

రూ.643.81 కోట్లకు నకిలీ ఇన్వాయిస్‌లు

- వ్యాపారిని అరెస్టు చేసిన జీఎస్టీ ఇంటెలిజెన్స్

విశాఖపట్నం, మే 23(ఆంధ్రజ్యోతి): ఏపీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో రూ.643.81 కోట్ల వ్యాపారం చేసినట్టు నకిలీ ఇన్వాయిస్‌లు, రికార్డులు సమర్పించిన వ్యాపారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు విశాఖపట్నం జోన్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ విభాగం శుక్రవారం తెలిపింది. తమిళనాడులోని వెల్లూరుకు చెందిన అబూబకర్ సిద్ధిక్ ఇతరులకు చెందిన గుర్తింపు కార్డులను తస్కరించి, వాటితో 302 షెల్ కంపెనీలు సృష్టించి, వివిధ వ్యాపారాలు చేసినట్టు అధికారులను నమ్మించాడు. తద్వారా రూ.115.88 కోట్ల ఇన్‌పుట్ క్రెడిట్‌ను పొందాడు. ఈ విషయం గుర్తించిన జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు బెంగళూరులో అతన్ని అరెస్ట్ చేశారు. విశాఖపట్నం ప్రత్యేక కోర్టులో 14 రోజులు రిమాండ్ విధించినట్టు విశాఖ యూనిట్ అడిషనల్ డైరెక్టర్ ఎన్.మొహ్మద్ అలీ తెలిపారు.

పోలీసుల అదుపులో 15 మంది రోహింగ్యాలు

విజయవాడ, మే 23(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరులో ఉంటున్న 15 మంది రోహింగ్యాలను కౌంటర్ ఇంటెలిజెన్స్, విజయవాడ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. బంగ్లాదేశ్, మయన్మార్ దేశాలకు చెందిన వీరంతా కానూరు, గోశాల వద్ద వివిధ భవన నిర్మాణాల్లో సెంట్రింగ్ పనులు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఉన్న రోహింగ్యా రెఫ్యూజీ క్యాంపులో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఏడుగురు రోహింగ్యాలు గురువారం విజయవాడకు చేరుకున్నారు.

సీన్ రివర్స్!

కర్ణాటక సరిహద్దులో తగ్గిన మద్యం అమ్మకాలు


మల్లికార్జున, అబ్కారీ శాఖ కమిషనర్

- జగన్ హయాంలో 'ఏపీ బ్రాండ్లు' తాగలేక కర్ణాటకకు...
- ఇప్పుడు ఏపీకే పోతున్నారు
- దీంతో అమ్మకాలు పడిపోయాయి
- కర్ణాటక ప్రభుత్వానికి అబ్కారీ శాఖ నివేదిక

(బళ్లారి ఆంధ్రజ్యోతి)

'ఏపీ బ్రాండ్లా...అమ్మ బాబోయ్' అన్నది నిన్నటి మాట! 'ఏపీ మద్యం బ్రాండ్లు సూపర్.' అనేది ఈనాటి మాట! అయితే, ఇవి మన మాటలు కావు. ఏపీకి సరిహద్దులోని కర్ణాటక స్వయంగా చేసిన ప్రకటన! ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ రాష్ట్రం లో అన్ని రకాల బ్రాండ్లు లభిస్తుండటం, కర్ణాటక కంటే ఏపీలో కొన్ని బ్రాండ్లు తక్కువ ధరకు దొరుకుతున్నాయని కర్ణాటక ప్రభుత్వానికి అబ్కారీ శాఖ నివేదించింది. దీనివల్ల 'మన మద్యం అమ్మకాలు పడిపోయాయి' అని తెలిపింది. నిజానికి, మాజీ సీఎం జగన్ పాలించిన ఐదేళ్లూ కర్ణాటకలో మద్యం వ్యాపారం మూడు చీర్స్ ఆరు పెగ్గులుగా వర్ధిల్లింది. తాను ఇచ్చిన మద్యం బ్రాండ్లే తాగాలి అనే రీతిలో జగన్ పాలన సాగించారు. కొందరు అక్కడి బ్రాండ్లు తాగలేక కర్ణాటక నుంచి మద్యం తీసుకువెళ్లి తాగేవారు. ఊరి దేవరలు, ఇతర వేడుకలకు, రాజకీయ కార్యక్రమాలకు కర్ణాటక నుంచి మద్యాన్ని తీసుకువెళ్లేవారు. ఈ కారణంగా అప్పట్లో కర్ణాటక ప్రభుత్వానికి మద్యం ద్వారా వచ్చే ఆదాయం ఎక్కువగా ఉండేది. ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. కర్ణాటక మద్యం ప్రియులే సరిహద్దు దాటి ఏపీలోని మద్యం షాపుల వద్ద బారులు తీరుతున్నారని ఆ నివేదికలో అబ్కారీ శాఖ తెలిపింది.

ఏపీకే కర్ణాటక బ్రాండ్లు

కర్ణాటకలోని బళ్లారి, విజయనగర, రాయచూరు, కొప్పళ, చిత్రదుర్గం జిల్లాలు ఏపీ సరిహద్దులో ఉన్నాయి. కర్నూలు, అనంతపురం, పుట్టపర్తి జిల్లాల్లోని చాలా గ్రామాలు కర్ణాటకలోకి చొచ్చుకువచ్చినట్లు ఉంటాయి. వైసీపీ హయాంలో కర్ణాటక సరిహద్దులో బార్లు, బ్రాందీ షాపులు భారీగా ఉండేవి. సుమారు 200 మద్యం దుకాణాలు, హోటళ్లు, సీఎల్-2, సీఎల్-4, సీఎల్-7 (కంట్రీ లిక్కర్) షాపులు ఉండేవి. కానీ చంద్రబాబు మరోమారు ముఖ్యమంత్రి అయ్యాక మద్యం పాలసీ మార్చారు. అన్ని రకాల మద్యం బ్రాండ్లను అందుబాటులో ఉంచారు. మైసూరులో తయారవుతున్న మద్యం బ్రాండ్లను కూడా చంద్రబాబు ప్రభుత్వం టెండర్లు వేయడానికి ఆహ్వానిస్తోంది. ఈ చర్యలన్నీ కర్ణాటక మద్యం ఆదాయంపై ప్రభావం చూపుతున్నట్లు అబ్కారీ శాఖ తన నివేదికలో పేర్కొంది.

కర్ణాటకలో గత ఐదేళ్లలో..

సంవత్సరం	లక్ష్యం	అమ్ముడైనవి	పెరుగుదల /తగ్గుదల	శాతం
2020-21	1203783	1419450	215666	17.92
2021-22	1419450	1638286	218786	15.41
2022-23	1638236	1750435	112199	6.85
2023-24	1750435	1761992	11557	0.66
2024 (జూన్)-25	1761992	1613813	148179	-8.41

ఏపీలో తక్కువ రేటుకు మంచి బ్రాండ్లు

"ఆంధ్రా సరిహద్దులోని కర్ణాటక ప్రాంతాల్లో మద్యం అమ్మకాలు బాగా తగ్గాయి. ఏపీలో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత అక్కడ మద్యం పాలసీ మారింది. అన్ని రకాల బ్రాండ్లు దొరుకుతున్నాయి. రేటు కూడా తక్కువగా ఉంది. ఇంతకు ముందు జగన్ సీఎంగా ఉన్నపుడు అక్కడ లిక్కర్ బాగలేదని కర్ణాటక నుంచి ఎక్కువగా తీసుకుపోయేవారు. ఇప్పుడు అక్కడ పరిస్థితి మారింది. కొన్ని లిక్కర్ బ్రాండ్లు కర్ణాటకతో కూడా టయ్యప్ అయ్యారు. అక్కడ అన్ని రకాల మంచి మద్యం బ్రాండ్లు, బీర్లు, విస్కీ, బ్రాందీ లభిస్తున్నాయి. ఇదే విషయాన్ని కర్ణాటక ప్రభుత్వానికి నివేదించాం"

- అబ్కారీ శాఖ కమిషనర్ మల్లిఖార్జున


మావోయిస్టు నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించి నివాళులు అర్పిస్తున్న పౌర హక్కులు, పలు సంఘాల నేతలు

మావాళ్ల మృతదేహాలను అప్పగించాలి

- హైకోర్టులో మావోయిస్టులు కేశవరావు, నాగేశ్వరరావు కుటుంబ సభ్యుల హౌజ్‌మోషన్ పిటిషన్లు
- నేడు విచారించనున్న హైకోర్టు ధర్మాసనం

అమరావతి/గుంటూరు సిటీ, మే 23(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు, అగ్రనేత సజ్జా వెంకట నాగేశ్వరరావు అలియాస్ నవీన్ మృతదేహాలను తమకు అప్పగించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులు శుక్రవారం అత్యవసరంగా హైకోర్టులో హౌజ్‌మోషన్ పిటిషన్లు దాఖలు చేశారు. కేశవరావు తల్లి భారతమ్మ, సోదరుడు ఢిల్లీశ్వరరావు, అలాగే సజ్జా నాగేశ్వరరావు సోదరుడు శ్రీనివాసరావు, మరికొందరు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ రెండు వ్యాజ్యాలపై న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.హరినాథ్, జస్టిస్ వైఎల్.లక్ష్మణరావుతో కూడిన ధర్మాసనం శనివారం విచారణ జరపనుంది. కేంద్ర హోంశాఖ కార్యదర్శి, ఛత్తీస్‌గఢ్ పోలీసులు, శ్రీకాకుళం ఎస్పీ, చీరాల ఒకటో పట్టణ పోలీసులు మృతదేహాలను అప్పగించడానికి నిరాకరించడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని పిటిషన్‌లో వారు కోరారు. వారి తీరు చూస్తే బూటకపు ఎన్‌కౌంటర్ అనే సందేహం కలుగుతోందన్నారు. మృతదేహాలను అప్పగించాలని కోరితే పోలీసులు బెదిరిస్తున్నారన్నారు. వ్యాజ్యాలు పరిష్కారం అయ్యేవరకు మృతదేహాలను భద్రపరిచేలా పోలీసులను ఆదేశించాలని అభ్యర్థించారు.

ఎస్పీ అడ్డుకుంటున్నారు

నంబాల కేశవరావు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకా చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన గుంటూరులో మాట్లాడుతూ, కేశవరావు కుటుంబ సభ్యులు మృతదేహం వద్దకు వెళ్లకుండా శ్రీకాకుళం ఎస్పీ అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. కాగా, సజ్జా నాగేశ్వరరావు కుటుంబాన్ని శుక్రవారం పలు ప్రజాసంఘాల నేతలు పరామర్శించారు.

రెండు రోజుల్లో కేరళకు 'నైరుతి'

- రుతుపవనాల ప్రవేశానికి అనుకూల వాతావరణం
- అరేబియా సముద్రంలో బలపడిన అల్పపీడనం
- నేడు రాష్ట్రంలో పలు చోట్ల మోస్తరు వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, మే 23(ఆంధ్రజ్యోతి): కేరళలో నైరుతి రుతుపవనాల ప్రవేశానికి వాతావరణం అనుకూలంగా ఉంది. అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో ఉపరితల ఉష్ణోగ్రతలు 30-32 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. రుతుపవన గాలులు హిందూ మహాసముద్రం మీదుగా అరేబియా, బంగాళాఖాతం వైపు వీస్తున్నాయి. దీంతో కేరళ, కర్ణాటకల్లో 2-3 రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. ఇదే సమయంలో దక్షిణ కొంకణ్‌కు ఆనుకుని అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం శుక్రవారానికి బలపడి తీవ్ర అల్పపీడనంగా మారింది.

27న బంగాళాఖాతంలో అల్పపీడనం

కాగా, ఈ నెల 27న పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్నది. ఇది నైరుతి రుతుపవనాల పురోగమనానికి అనుకూలిస్తుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. బంగాళాఖాతంలో అనేక ప్రాంతాలకు ఇప్పటికే నైరుతి రుతుపవనాలు విస్తరించిన నేపథ్యంలో రుతుపవన కరెంట్ బలంగా ఉంది. దీంతో కోస్తాంధ్ర తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున 27 వరకు చేపల వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది.

నేడు అక్కడక్కడా మోస్తరు వర్షాలు

శనివారం అల్లూరి, మన్యం, తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ, ఏలూరు జిల్లాల్లో పిడుగులతో మోస్తరు వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అనకాపల్లి, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్ జిల్లాలతో పాటు రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు.. మేఘాలు ఆవరించని ప్రాంతాల్లో ఎండ, ఉక్కపోత కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం తిరుపతి జిల్లా గుండుపల్లిలో 39.8, నెల్లూరు జిల్లా మునబోలులో 39.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మరణిస్తున్న మానవత

గాజా మొత్తాన్ని ఖాళీచేయిస్తాం, పసిపిల్లలను కూడా వదిలేది లేదంటూ ఇజ్రాయెల్ పాలకులు చేస్తున్న ప్రకటనలు, తదనుగుణంగా మరింత హెచ్చుస్థాయిలో అమానుషంగా సాగుతున్న దాడులు మానవత్వం ఉన్నవారి మనసులు కలిచివేస్తున్నాయి. అత్యంత ఘోరమైన, క్రూరమైన పరిస్థితులను గాజా ఎదుర్కొంటున్నదని, కాస్తంత దయతలచాలని ఇజ్రాయెల్ ప్రధానిని ఐక్యరాజ్యసమితి అధినేత బతిమాలుతున్నారు. గురు,శుక్రవారాల్లో ఇజ్రాయెల్ దాడుల్లో 140మంది పాలస్తీనియన్లు చనిపోతే, ఆకలి మరో నలభైమందిని చంపేసింది. ఆయుధాలతో పాటు ఆకలిని కూడా మారణాయుధంగా ప్రయోగించి ప్రాణాలు తీస్తున్న నెతన్యాహూను అమెరికా మాత్రమే ఆపగలదన్నట్టుగా మిగతాప్రపంచం, మరీముఖ్యంగా అరబ్‌దేశాలు చేతులెత్తేయడం ఆశ్చర్యం, అమానుషం.

దాదాపు వందరోజులైంది గాజాలోకి ఆహారం అడుగుపెట్టి. వేలాదిమంది పిల్లలు చావుఅంచున ఉన్నా ఇజ్రాయెల్ అధినేతకు మనసు కరగ లేదు. గాజాలో ప్రవేశం కోసం సరిహద్దుల్లో నిరీక్షిస్తున్న ఆహారపు ట్రక్కులను ఆయన లోపలకు రానివ్వలేదు. అస్త్రాలతో పాటు, ఆకలిని కూడా వాడి ఒక్క పసిగుడ్డును కూడా గాజాలో మిగలనివ్వకుండా మొత్తం ఖాళీచేయించే దిశగా ఆయన పావులుకదుపుతున్నాడు. గాజాను స్వాధీనం చేసుకొని, ఖాళీచేయించి, దానిని ఒక టూరిస్టు రిసార్టుగా మార్చేందుకు అమెరికాకు అప్పగించడం కోసమే ఈ ఊచకోత కొనసాగుతోందన్నది స్పష్టం. కాల్పుల విరమణ ఒప్పందం చక్కగా అమలుజరుగుతూ, తనవద్ద ఉన్న బందీలను అనుకున్నప్రకారం హమాస్ సవ్యంగా అప్పగిస్తున్న దశలో, అమెరికా అధ్యక్షుడు తన మనసులో మాట చెప్పడం, ఆ కాస్తంత శాంతినీ బద్దలు కొడుతూ, ఒక అర్ధరాత్రివేళ ఇజ్రాయెల్ మారణాయుధాలతో విరుచుకుపడి ఒకేరోజు ఏకంగా ఆరువందల మందిని హతమార్చడం చూశాం. అలా ఆరంభమైన ఆ ప్రయత్నం నానాటికీ మరింత దుర్మార్గంగా, అమానుషంగా అమలు జరుగుతోంది. ట్రంప్ కళ్ళలో ఆనందం చూడటానికి, ఆయన అనుమతితోనే ఈ మారణకాండను మళ్ళీ మొదలెట్టానని అప్పట్లో చెప్పిన నెతన్యాహూ ఇప్పుడు అదే ఆప్తమిత్రుడి కోరిక మీద కాసిన్ని ఆహారధాన్యాలు గాజాలోకి అనుమతించాలని నిర్ణయించుకున్నారు. ఆకలిచావుల చిత్రాలు చూడటానికి ట్రంప్ దొరవారు ఇష్టపడకపోవడంతో కడివెడు అవసరమైనచోటకు ఒక గరిటెడు పంపడానికి నెతన్యాహూ సరేనన్నారు.

ఐదునెలల తరువాత విలేకరుల సమావేశంలో మాట్లాడిన నెతన్యాహూ గాజా మొత్తం ఖాళీ అయ్యేదాకా యుద్ధం ఆగదంటూ ఒకేఒక్కముక్కలో అసలు విషయాన్ని తేల్చేశారు. అమెరికా అధ్యక్షుడి ఆలోచన అద్భుతం, అమోఘం అని తెగమెచ్చుకుంటూ, ఇది పశ్చిమాసియా తీరుతెన్నులనే మార్చేస్తుందన్నారు. లక్ష్యసాధనలో కచ్చితంగా విజయం సాధిస్తామని, ఏడాదిన్నరలోనే అనుకున్నది సాధిస్తానని అంటున్నారు. ఇప్పటికే ఓ అరవైవేలమంది సామాన్యులను ఊచకోతకోసి, సగటున రోజుకోవందమందిని హతమారుస్తున్న నెతన్యాహూ ఈ లక్ష్యసాధనకోసం మరింత దుర్మార్గంగా ప్రవర్తించబోతున్నారని అర్థం. ఇజ్రాయెల్‌మీద దాడిచేసిన హమాస్‌ను దుంపనాశనం చేస్తానంటూ ఆరంభించిన ఈ యుద్ధాన్ని ఆయన ఇంకా అవేమాటలు వాడుతూ మరో అవసరం కోసం కొనసాగిస్తున్నారు. లక్షలాదిమంది ప్రాణాలను, జీవితాలను ఇజ్రాయెల్‌కు బలిపెట్టిన హమాస్‌ను ఇప్పటివరకూ నెతన్యాహూ ఎంత మేరకు దెబ్బతీయగలిగారో తెలియదు కానీ, గాజామొత్తం నామరూపాల్లేకుండా పోయింది. కంటిఎదుట కన్నబిడ్డలు కన్నుమూస్తున్నా ఏడ్చే ఓపికలేని తల్లులు, ఆకలితో మరణిస్తున్న పిల్లలూ వృద్ధులతో స్మశానంలాగా మారిన గాజాలో ఒక్క ఆస్పత్రిని కూడా మిగలనివ్వలేదు నెతన్యాహూ. బ్రిటన్, ఫ్రాన్స్, కెనడాలకు కాస్తంత మనసుకరిగి, ఆగ్రహం కలిగి, వాణిజ్యచర్చలను బందుపెట్టినందువల్ల ఇజ్రాయెల్ అధినేత ఈ కాస్తంతైనా దిగివచ్చి, నాలుగుమెతుకులు అందించడానికి ఒప్పుకున్నాడు. అంతే కాని, గాజావాసులకు కడుపునిండా అన్నంపెట్టి, పుట్టినచోటే ఉండనిచ్చే ఆలోచన తనకు లేదని ఆయన తేల్చేశాడు. అగ్రరాజ్యాధినేత అభీష్టానికి అనుగుణంగా, ఆకలితో పూర్తిగా చావనివ్వకుండా ఉంచి, ఆయుధాలతో మిగతాపని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు ఆయన.

మోదీపై అక్కసుతోనే ఇన్ని అవాస్తవాలు!

'తిరోగమనంలో పురోగామి భారత్!' శీర్షికతో మే 17వ తేదీన రామచంద్ర గుహ రాసిన వ్యాసంలో మోదీ ప్రభుత్వ వ్యతిరేకత, హిందూ సమాజంపై ద్వేషం కొట్టొచ్చినట్లు కనపడుతున్నాయి. తమ మత ఔన్నత్యం ఉత్కృష్టమైనదని హిందూ మత దురభిమానులు విశ్వసిస్తారని గుహ అన్నారు. వాస్తవంగా హిందూ మతానికి సంబంధించిన ఏ గ్రంథాలైనా, ఏ పీఠాధిపతి అయినా హిందూ మతమే అన్ని మతాల కంటే శ్రేష్ఠమైనదని, ఈ మతాన్ని అనుసరిస్తే మాత్రమే స్వర్గానికి అర్హత పొందుతారని చెప్పలేదు. మన మహర్షులు 'ఏకం సత్ విప్రా బహుదా వదన్తి' (సత్యం అంటే భగవంతుడు ఒక్కడే, ఆయనను అనేక రూపాల్లో కొలుచుకోవచ్చు) అని ఉద్బోధించిన మార్గాన్ని హిందూ సమాజం నేటికీ అనుసరిస్తూనే ఉంది. హిందువులకు ఉండే ఈ ఔన్నత్యమే మైనారిటీలైన ముస్లింలు, క్రైస్తవులు హిందూత్వ విలువలను ద్వేషించడానికి, దూషించడానికి మార్గాన్ని సుగమం చేసిందంటే అతిశయోక్తి కాదేమో! మతం ఆధారంగా రెండు భూభాగాలు ఈ దేశం నుంచి విడిపోయిన తర్వాత ఈ దేశం లౌకిక విలువలకు పట్టం కట్టిందంటే, ఈ దేశంలో మెజారిటీ ప్రజలైన హిందువుల ఆలోచన విధానమే ఇందుకు ప్రధాన కారణం. ఈ విషయాన్ని ఒప్పుకొనే మానసిక స్థితి వ్యాసకర్త రామచంద్ర గుహకు ఉన్నట్లు కనిపించలేదు.

రిపబ్లిక్ సంస్థాపక విలువలైన ప్రజాస్వామ్యం, బహుళత్వవాదం ఈ దేశంలో ఆచరించబడలేదని ఒక పేరాలో చెప్పి, ఈ విలువలు సుస్థిరంగా ఉన్నాయని మరొక పేరాలో చెప్పడంలో ఆంతర్యం ఏమిటి? చెప్పాలనుకున్న విషయంలో స్పష్టత ఉండాలి కదా? భారత రాజ్యాంగం పురాతన హిందూ రాజరికపు నమూనాను తిరస్కరించిన మాట వాస్తవమే. కానీ ఆచరణలో 1947 నుంచి 2014 వరకు ఈ దేశంలో ప్రజాస్వామ్యం పేరుతో కుటుంబ పరిపాలన కొనసాగిందనే విషయం దేశ ప్రజలకు బాగా ఎరుక. ఇక మతాన్ని రాజ్య వ్యవస్థలో మిళితం చేయలేదని చెప్పడం పచ్చి అబద్ధం. మతం ఆధారంగానే దేశాన్ని పంచారు. కొన్ని మతాల వాళ్లకు ప్రత్యేక చట్టాలు కూడా తయారు చేసి ఇచ్చారు. రాజ్యాంగం సాక్షిగా ప్రజలందరూ కట్టిన పన్నుల నుంచి వచ్చిన ఆదాయాన్ని ఒక మతం వారికి విదేశీ యాత్రలకు ఖర్చు చేయడం, రాష్ట్రపతి భవనాన్ని ఇఫ్తార్ విందులకు కేంద్రంగా మార్చడం మన ప్రజాస్వామ్యంలో భాగమే!



మతం ఆధారంగా రెండు భూభాగాలు ఈ దేశం నుంచి విడిపోయిన తర్వాత ఈ దేశం లౌకిక విలువలకు పట్టం కట్టిందంటే, ఈ దేశంలో మెజారిటీ ప్రజలైన హిందువుల ఆలోచన విధానమే ఇందుకు ప్రధాన కారణం. రామచంద్రగుహ వ్యాసంలో మోదీ ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది.

ఇక కశ్మీర్ సమస్యపై అంతర్జాతీయ సమాజం పాకిస్థాన్‌ను, ఇండియాను ఒకే గాటన కట్టేసి మాట్లాడడానికి కారణాలు ఉన్నాయి. అంతర్జాతీయ సమాజం అమెరికా చెప్పినట్లు వినాల్సిందే. అక్కడ ప్రభుత్వంలో ట్రంప్ ఉండొచ్చు మరొకరు ఉండొచ్చు. అమెరికాకు భారత్ కంటే పాకిస్థాన్ ప్రియమైన దేశం. దక్షిణాసియాలో అమెరికా పెత్తనం కొనసాగాలంటే పాకిస్థాన్‌కు ఆ దేశ సహాయ సహకారాలు అందాల్సిందే. మరొక కోణంలో భారత్ ఆర్థికంగా ఎదగడం అమెరికాకు ఇష్టం ఉండదు. క్రయోజనిక్ టెక్నాలజీని రష్యా మనకు ఇవ్వకుండా అమెరికా మోకాలొడ్డింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషితో 562 సంస్థానాలు సులభంగా విలీకరణ చెందితే, మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జోక్యంతో కశ్మీర్ సంస్థానం అంతర్జాతీయ సమస్యగా మారింది. ఈ కోణంలో ఆలోచిస్తే వాస్తవం బోధపడుతుంది.

కశ్మీర్ సమస్యపై పాకిస్థాన్ భారత్‌తో మూడు యుద్ధాలు కాదు, నాలుగు యుద్ధాలు చేసింది. ఇక పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని తీవ్రవాద కేంద్రాలపై దాడి మాత్రమే చేసింది. దానిని యుద్ధంగా కొందరు స్వయంప్రకటిత మేధావులు, దేశ వ్యతిరేక మీడియా ప్రచారం చేయడం, 'యుద్ధాన్ని నేనే నిలుపుదల చేసినాను' అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనలు ఇచ్చుకోవడం బుద్ధి మాంద్యంగా భావించాలి. భారత సైన్యం జరిపిన లక్ష్య నిర్దేశిత దాడులకు బెదిరిపోయిన పాక్ నాయకులు, సైన్యం తోక ముడిచి ట్రంప్‌కు దాసోహం అయింది. ఈ విషయంలో తీవ్రవాద శిక్షణా కేంద్రాలు మాత్రమే తమ టార్గెట్ అని భారత్ ముందుగానే ప్రకటించింది ఆ లక్ష్యాన్ని నెరవేర్చుకున్నది. ట్రంప్ మాటలు అబద్ధాలని ప్రపంచంలోని రాజకీయ విశ్లేషకులందరికీ తెలుసు. అన్ని విధాల చెడిపోయిన పాకిస్థాన్‌పై యుద్ధం చేయాలని మోదీ ప్రభుత్వం కోరుకోలేదు. 'నా మాట వినకపోతే వాణిజ్య సంబంధాలను తెంచేసుకుంటాన'ని ట్రంప్ చెప్పిన మాటలను భారత ప్రభుత్వం లెక్క చేయలేదు అనే విషయం ఇక్కడ గమనార్హం. పోఖ్రాన్ అణుపరీక్షల తర్వాత అమెరికా మన దేశంపై ఆర్థిక ఆంక్షలు విధించి, భంగపాటుకు గురైందనే విషయం ట్రంప్‌కు తెలుసు.

ఇక కశ్మీరు, ఈశాన్య రాష్ట్రాలలో రాజ్య హింస ఉందని చెప్పడం వాస్తవాలను దాచడమే. జమ్మూ కశ్మీర్‌లో వేర్పాటువాదుల దుశ్చర్యల వల్ల మూడు లక్షల మంది హిందువులు లోయ నుండి పారిపోయి వచ్చారు. అనేక మంది హిందువులు హత్య గావించబడ్డారు. ఇక నాగాలాండ్, మిజోరం, అస్సాం, మణిపూర్ రాష్ట్రాలలో అంతర్జాతీయ ప్రాయోజిత వేర్పాటువాద గ్రూపుల వల్ల అక్కడ హింస చెలరేగి, శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతున్నది. వాస్తవ విషయాలు ఇలా ఉంటే రాజ్య హింస అని బుకాయింపు ఏమిటి?

ఈ వ్యాసంలో అత్యంత సెలెక్టివ్ డిస్క్రిమినేషన్ ఎక్కడంటే– ఈ దశాబ్ది కాలంలో అంటే మోదీ ప్రభుత్వ హయాంలో భారతదేశం తిరోగమించిందని చెప్పడం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో తొమ్మిదవ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ ఐదవ స్థానానికి వచ్చింది. కరోనా విపత్కర పరిస్థితిని తట్టుకొని, గుణాత్మకమైన ఆర్థికాభివృద్ధిని సాధించింది. కరోనా టీకాలను అభివృద్ధి చేసి ప్రపంచ దేశాలకు అందించి, వసుధైక కుటుంబ భావనకు నాంది పలికింది మోదీ ప్రభుత్వం అనే విషయం దేశాన్ని ప్రేమించే వాళ్లకు మాత్రమే తెలుస్తుంది.

ఇక పహల్గాం దాడి తర్వాత కశ్మీర్‌లో అమాయకులపై కేసులు బనాయించి ఇబ్బంది పెడుతున్నారని చెప్పడం వ్యాసకర్త వక్రబుద్ధికి పరాకాష్ఠ! తీవ్రవాద కార్యకలాపాలలో పాలుపంచుకున్న వారిని మాత్రమే ప్రభుత్వం అరెస్టు చేసింది. వాస్తవంగా కశ్మీర్‌లో వేర్పాటువాదులు, తీవ్రవాదులు పేట్రేగిపోవడానికి ప్రధాన కారణం కశ్మీరీ ముస్లింల భారత వ్యతిరేకత.

మోదీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి లౌకికవాద ముసుగు వేసుకున్న హిందూ వ్యతిరేక హిందువులు మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ముస్లిములను రెచ్చగొట్టే పనిలో ఉన్నారు. ఇలాంటి వారి వలన భారతదేశం భవిష్యత్తులో అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి ఉంటుంది. ఈ దేశంలో ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని ప్రేరేపించి, దేశాన్ని అతలాకుతలం చేయడానికి అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలకు వీరి ఆలోచనలు బాగా ఉపయోగపడతాయి. ఈ విషయంలో దేశ హితాన్ని కోరే ప్రజా సమూహం అప్రమత్తంగా ఉండాలి.

• ఉల్లి బాలరంగయ్య

ఇప్పుడు అంబేడ్కర్ ఉంటే ఏం చేసేవారు?

మావోయిస్టులది ప్రకటిత హింసామార్గం. ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి సందేహాలూ లేవు. హింసామార్గాన్ని చేపట్టిన మావోయిస్టుల్ని హింసతోనే అంతం చేయాలని కేంద్ర ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉంది. కగార్, బ్లాక్ ఫారెస్ట్ తదితర ఆపరేషన్లు ఆ లక్ష్యంతోనే పనిచేస్తున్నాయి. ఈ విషయంలోనూ ఎవరికీ ఎలాంటి సందేహాలూ లేవు. అయితే, ప్రభుత్వం చేపట్టిన హింసామార్గం రాజ్యాంగ ఆదర్శాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా ఉందా? లేదా? అన్నది వర్తమాన ప్రజాస్వామిక వాదుల్ని కుదిపేస్తున్న సందేహం.



అంబుజ్‌మడ్‌లోని నారాయణ్‌పూర్ అడవుల్లో మే 21న సీపీఐ –మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజును భద్రతాదళాలు హతమార్చాయి. ఆయనతో పాటు మరో పాతికమంది స్త్రీ–పురుష మావోయిస్టుల్నీ మట్టుబెట్టారు. ఈ సంఘటనపై ఎక్స్ వేదిక మీద స్పందించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా, "నక్సలిజాన్ని నిర్మూలించే పోరాటంలో ఇది ఒక మైలురాయి విజయం" అన్నారు.

హింసావాదుల్ని హింసతోనే అంతం చేయడం ధర్మబద్ధమే అని కొందరు అనవచ్చు. కేంద్ర హోం మంత్రి ప్రకటనలు కొందరికి సమంజసంగా అనిపించవచ్చు. మరికొందరికి గొప్ప ఉత్సాహాన్ని కూడ కలిగించవచ్చు. ఇంకొందరు ఉన్మాదంతో ఊగిపోనూ వచ్చు. కమ్యూనిస్టుల్ని చీదరించుకునేవారో, విప్లవ వ్యతిరేకులో అలా అనుకుంటే అదో ఇది. కానీ, ప్రజలకూ ప్రభుత్వానికి మధ్య భారత రాజ్యాంగం అనే ఆధునిక పవిత్రగ్రంథం ఒకటుందని మరచిపోవడం ఆలోచనాపరులకు సమంజసం కాదు. రాజ్యాంగ ప్రకటిత ఆదర్శాలను మార్గదర్శకాలనూ ప్రభుత్వాలు సరిగ్గా పాటిస్తే తిరుగుబాట్లు తలెత్తాల్సిన అవసరమే ఉండదు. ప్రభుత్వాలు రాజ్యాంగ ఆదర్శాలను తుంగలో తొక్కినపుడే తిరుగుబాట్లు తలెత్తుతాయి. ఇది అందరికీ తెలిసిన సమాజ నియమం.

జాతీయోద్యమ కాలంలోనే రాజకీయాల్లో రెండు స్రవంతులు ఏర్పడ్డాయి. మనం ఎంతగానో ఉద్వేగ భరితంగా తలచుకునే భగత్‌సింగ్, అల్లూరి శ్రీరామ రాజు, ఉద్ధామ్‌సింగ్ తదితరులది బాహాటంగా హింసామార్గం. గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్‌లది అహింసామార్గం. వాళ్ళ మధ్య అభిప్రాయ బేధాలు, ఇతర వివాదాలు కూడ ఉండవచ్చుగాక; ఉన్నాయి కూడ. అయితే, అంతిమంగా వాళ్ళది అహింసా మార్గం. చాలామంది వాళ్ల మధ్య ఘర్షణను మాత్రమే చూస్తుంటారు గానీ ఐక్యతను చూడరు. ఇదొక సెలెక్టివ్ విజన్.

రాజ్యాంగ రచన సాగుతున్న కాలంలోనే పొరుగు దేశం చైనాలో రక్తపాత విప్లవం విజయవంతమై ఒక రకం సామ్యవాద సమాజం ఏర్పడింది. మనదేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ సాయుధపోరాట పంథాను కొనసాగిస్తున్నది. పైగా, అల్లూరి, భగత్‌సింగ్‌ల మీద ప్రజలకు ఆరాధనాభావం ఉంది. ఈ నేపథ్యంలో, ప్రభుత్వాల పనితీరుతో విసిగిపోయిన ప్రజలు సాయుధులై తిరగబడే ప్రమాదాన్ని నివారించాలనేది భారత రాజ్యాంగ రచనకు ప్రధాన లక్ష్యంగా మారింది. రాజ్యాంగ రచనా కమిటీ ఛైర్మన్ బీఆర్ అంబేడ్కర్ ఇదే విషయాన్ని ఇంకో పద్ధతిలో చెప్పాడు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తరువాత... ముందు రాజకీయరంగంలో సమానత్వాన్ని సాధిస్తుంది. ఆ తరువాత, భావి ప్రభుత్వాలు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లోనూ సమానత్వాన్ని సాధించడానికి ప్రత్యేకంగా ప్రయత్నించాలి అన్నాడు. పాలకులు అలా చేయకపోతే, వివిధ రంగాల్లో కొనసాగుతున్న అసమానత్వానికి బాధితులైనవారు తిరగబడి ఏకంగా 'ప్రజాస్వామ్య భవనాన్ని' పేల్చేస్తారు అని హెచ్చరించాడు.

వివిధ రంగాల్లో కొనసాగుతున్న అసమానత్వాన్ని రూపుమాపని ప్రభుత్వాలను మనం ఏమీ అనం. వాళ్ళు అసమానత్వాన్ని పెంచిపోషిస్తున్నా అభ్యంతరం చెప్పం. అసమానత్వం మీద తిరగబడే ప్రజల్ని మాత్రం దోషులుగా, దారి తప్పినవారిగా, హింసావాదులుగా, నైరాశ్యంలో కూరుకుపోయినవారిగా నిందార్థంలో చూస్తాం. మన ఆలోచనల్లో ఇదొక ద్వంద్వం.

19వ శతాబ్దం చివర్లో మద్రాసు–కలకత్తా ఈస్ట్ కోస్ట్ రైల్వే లైన్ నిర్మించడానికి, దారి కోసం బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆదివాసుల్ని అడవి నుంచి తరిమేసింది. రైలు పట్టాల కింద వేసే చెక్క స్లీపర్ల కోసం తూర్పు కనుమల్లోని అడవుల్ని విచక్షణారహితంగా నరికి వేసింది. అడవిని కోల్పోయి, రోడ్డు నిర్మాణ కూలీలుగా మారిన ఆదివాసుల్ని అణా (6 నయాపైసలు), అర్ధణా (3 నయాపైసలు) వేతనం ఇవ్వడానికి కూడ వేధించింది. అణిచివేత ఈ స్థాయికి చేరుకోవడంతో అత్యంత సహజంగానే మన్యంలో తిరుగుబాటు తలెత్తింది.

మన్యంకు వాయువ్య దిశలోనే బస్తర్ ఉంటుంది. అక్కడా అప్పట్లో మన్యం వంటి తిరుగుబాట్లు సాగాయి. అక్కడా అల్లూరి వంటి పోరాట వీరులు పుట్టుకొచ్చారు. అక్కడి ఆదివాసులు ఇప్పటికీ ఆ వీరుల్ని ఏడాదికి ఒకసారైనా తలుచుకుంటుంటారు. ఇప్పుడూ బస్తర్‌లో వందేళ్ళ నాటి వేధింపులు సాగుతున్నాయి. ఆదివాసుల్ని అడవుల నుంచి తరిమేసి అటవీ సంపదనీ, ఖనిజ వనరుల్ని అస్మదీయ కార్పొరేట్లకు అప్పగించేందుకు ఒక మహాయజ్ఞం అక్కడ సాగుతోంది. ఆదివాసులకు అప్పుడూ, ఇప్పుడూ అణిచివేత స్వీయ అనుభవమే. తెల్లవాళ్ళ మీద తిరగబడడం న్యాయమేగానీ, నల్లవాళ్ల మీద తిరగబడడం అన్యాయం అని ఆదివాసులకు మన మైదానవాసులు హితవు చెపుతారా?

అల్లూరిని చంపినపుడూ ఇంగ్లండులో సహితం మారుమోగేలా అదొక మైలురాయి విజయం అంటూ చాలా గట్టిగానే వికటాట్టహాసం చేశారు బ్రిటిష్ అధికారులు. భగత్‌సింగ్‌ను ఉరి వేసిన తరువాత 1931 ఏప్రిల్ 13 నాటి జనతా వార్తాపత్రికలో 'ముగ్గురు బాధితులు' శీర్షికతో అంబేడ్కర్ ఒక వ్యాసం రాశాడు. న్యాయదేవత మీద భక్తివిశ్వాసాలతో వాళ్ళీ పని చేయలేదు; ఇంగ్లండ్‌లోని కన్జర్వేటివ్ పార్టీ పెద్దల్నీ, అక్కడి మూర్ఖులయిన జనాన్నీ సంతృప్తిపరచడానికి ఒక బలిదానాన్ని ఉరికంబం ఎక్కించారన్న వాస్తవం ఈ ప్రభుత్వానికే కాదు; మొత్తం ప్రపంచానికి కూడ స్పష్టంగా తెలుసు అంటూ తీవ్రంగా విమర్శించాడు. ఇప్పుడు నంబాల కేశవరావును చంపి, సరిగ్గా అలాంటి ప్రకటనలే చేస్తున్నారు ఏలినవారు. ఇప్పుడు అంబేడ్కర్ ఉంటే ఏం రాసేవాడో?



బస్తర్ ఆదివాసులు మావోయిస్టులుగా మారాలని ఏమీ అనుకోలేదు. అణిచివేతను అడ్డుకోవాలనుకున్నారు. అందుబాటులో మావోయిస్టులు ఉన్నారు కాబట్టి వాళ్లలో చేరారు. రేపు మరొకరితో చేతులు కలపవచ్చు. ఆయుధాలను చేపట్టడాన్ని తప్పుపడుతున్నవాళ్ళు అణిచివేతనూ తప్పుపట్టాలి. లేకుంటే మనలోనే ఏదో తప్పు ఉన్నట్టు లెక్క.

చరిత్ర ఒక ప్రహసనంగా పునరావృతం అవుతోందో లేదో గానీ, మన మధ్యనే మరో ప్రపంచం, మరో సమాజం, మరో జాతి, మరో తెగ కొనసాగుతున్నాయని గుర్తించకపోవడం మాత్రం మన కాలపు విషాదం.

రాజ్యాంగం తొలి ప్రతిలో ప్రజాస్వామ్యం అనే ఆదర్శం ఒక్కటే ఉంది. దానికి మరింత వివరణ ఇస్తూ, దాని పరిధిని పెంచుతూ సామ్యవాద, మత సామరస్య రాజ్యాంగం అని పునర్ నిర్వచించుకున్నాం. ఆ తరువాత లెక్క ప్రకారం ప్రజల కష్టాలు తగ్గిపోవాలి. కానీ, అలా జరగడంలేదు. రాజ్యాంగాన్ని నెత్తిన పెట్టుకుని మోస్తున్నవారు, పార్లమెంటు భవన మెట్లను ముద్దాడుతున్నవారు అనుక్షణం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారు. దేశ సంపదలో 70 శాతం కేవలం పది శాతం కుటుంబాల చేతుల్లో ఉందట. 40 శాతం సంపద ఒక శాతం కుటుంబాల చేతుల్లో ఉందట. 70 నుంచి 80 శాతం జనాభా కేవలం 3 శాతం దేశ సంపదతో జీవితాన్ని వెళ్ళబుచ్చుతున్నది. రాజ్యాంగ ఆదర్శమయిన సామ్యవాదాన్ని ఇంతగా అపహాస్యం చేస్తున్నది ఎవరూ?

దేశంలో మతసామరస్యం గురించి ఇక చెప్పనక్కరలేదు. దేశంలోని ఒక సమూహాన్ని బాహాటంగా శత్రువర్గం జాబితాలో పడేశారు. ఒక చట్టం తెచ్చి వాళ్ళ పడకగదుల్లోకి ప్రవేశించారు. ఇంకో చట్టం తెచ్చి వాళ్ళ పౌరసత్వాన్ని సందిగ్ధంలో పడేశారు. మరో చట్టంతో వాళ్ళ ఆస్తి హక్కుని నిరాకరిస్తామన్నారు. వాణిజ్య కూడళ్ళలో హాకర్లు, చిరువ్యాపారులుగా మారి, కాస్త ఊపిరి పీల్చుకుంటున్నా సహించలేక వాళ్ళ బతుకుల్ని బుల్‌డోజర్లతో నేలమట్టం చేస్తున్నారు. అయినా, మతసామరస్యం అనే అక్షరాలు రాజ్యాంగంలో మెరుస్తూనే ఉన్నాయి. ఇంతటి వైరుధ్యాన్ని భరించడం మనుషులకు ఎక్కువ కాలం సాధ్యం కాకపోవచ్చు.

మైదాన ప్రాంతాల్లో ముస్లింలను భయపెట్టి కొత్త అస్పృశ్యులుగా మార్చాలనీ, అడవుల్లో ఆదివాసుల్ని తుడిచిపెట్టేయాలనీ ఏలినవారు ఒక దృఢ నిశ్చయంతో ఉన్నట్టు ఇప్పుడు అందరికీ స్పష్టంగానే కనపడుతోంది. చర్యల మీద మనకు అభ్యంతరాలు లేనపుడు ప్రతిచర్యల మీద మాత్రమే అభ్యంతరాలుండడం సబబు కాదు.

బస్తర్ ఆదివాసులు మావోయిస్టులుగా మారాలని ఏమీ అనుకోలేదు. అణిచివేతను అడ్డుకోవాలనుకున్నారు. అందుబాటులో మావోయిస్టులు ఉన్నారు కాబట్టి వాళ్లలో చేరారు. రేపు మరొకరితో చేతులు కలపవచ్చు. ఆయుధాలను చేపట్టడాన్ని తప్పుపడుతున్నవాళ్ళు అణిచివేతనూ తప్పుపట్టాలి. లేకుంటే మనలోనే ఏదో తప్పు ఉన్నట్టు లెక్క. నారాయణపూర్ మృతుల ఫొటోల్ని ప్రభుత్వం విడుదల చేసింది. ఇప్పుడు సర్వత్రా అవి అందుబాటులో ఉన్నాయి. వాళ్ళ తలలకు గురిపెట్టి తుపాకులు కాల్చినట్టు చాలా స్పష్టంగా కనిపిస్తున్నది.

రాజ్యాంగం చెడ్డదయినా సరే అమలు చేసేవాడు మంచోడయితే అది మంచిదయిపోతుంది. రాజ్యాంగం మంచిదయినా సరే అమలు చేసేవాడు చెడ్డోడయితే అది చెడ్డదయిపోతుంది అని అంబేడ్కరే అన్నాడు. ఇప్పుడు అంబేడ్కర్ ఉంటే ఏం చేసేవాడో?

▪ డానీ
సమాజ విశ్లేషకులు



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

ఉద్యోగాలు సృష్టించగల చిన్న, మధ్యతరహా పరిశ్రమల యాజమానులు రుణ సదుపాయం లోటు, నిర్వహణపరమైన కఠిన నిబంధనలతో నానా సమస్యల నెదుర్కొంటున్నారు. ఉద్యోగార్థులకు సరైన విద్యార్హతలు, నైపుణ్యాలు ఉండడం లేదు. ఈ లోపాలను అధిగమించేందుకు ప్రభుత్వం తొలుత నైపుణ్యాల శిక్షణతో కూడిన పాఠశాల విద్యను సమకూర్చాలి. ఆ తరువాత చిన్న, మధ్యతరహా పరిశ్రమల వ్యవస్థాపకులకు ఉదారంగా స్వల్ప వడ్డీతో కూడిన పరపతి సదుపాయాన్ని సమకూర్చాలి.

యువతకు ఉద్యోగాలు ఎందుకు లేవు?


సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్ ప్రైజెస్ – ఎమ్ఎస్ఎమ్ఈ) రంగంపై ఇటీవల రెండు నివేదికలు విడుదలయ్యాయి. ఒకటి 'స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధ్యయనం కాగా మరొకటి నీతిఆయోగ్ రూపొందించినది. రెండూ అధికారిక నివేదికలే. ఇవేకాక మరొకటి– 'యాన్యువల్ సర్వే ఆఫ్ అన్ఇన్‌కార్పొరేటెడ్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్' నివేదిక కూడా ఉన్నది.

ఎమ్ఎస్ఎమ్ఈల గురించి ఈ రెండు అధికారిక నివేదికలు వెల్లడించిన ప్రాథమిక వాస్తవాలు ఏమిటి? ప్రస్తుత వర్గీకరణ ప్రకారం సూక్ష్మ పరిశ్రమలలో పెట్టుబడుల గరిష్ఠ పరిమితి రూ.2.5 కోట్లు కాగా అవి చేసే మొత్తం వ్యాపారం గరిష్ఠంగా రూ.10 కోట్ల మేరకు ఉంటుంది; చిన్న తరహా పరిశ్రమలలో మదుపుల గరిష్ఠ పరిమితి రూ.25 కోట్లు కాగా, వాటి మొత్తం వ్యాపారం గరిష్ఠంగా రూ.100 కోట్లు దాకా ఉంటుంది; మధ్యతరహా పరిశ్రమలలో పెట్టుబడుల గరిష్ఠ పరిమితి రూ. 125 కోట్లు కాగా, వాటి గరిష్ఠ వ్యాపారం రూ.500కోట్లు దాకా ఉంటుంది. ఈ వర్గీకరణ ప్రకారం భారతదేశంలో పరిశ్రమలు అత్యధికం ఎమ్ఎస్ఎమ్ఈలేనని స్పష్టమవుతుంది.

ఎమ్ఎస్ఎమ్ఈలలో సూక్ష్మ పరిశ్రమలే అత్యధికంగా ఉన్నాయి. మొత్తం ఎమ్ఎస్ఎమ్ఈలలో సూక్ష్మ పరిశ్రమలు 98.64 శాతం కాగా, చిన్నతరహా పరిశ్రమలు 1.24 శాతంగా ఉంటే, మధ్యతరహా పరిశ్రమలు కేవలం 0.12 శాతం మాత్రమే. యాజమాన్యం విషయానికి వస్తే ఒక వ్యక్తి లేదా కుటుంబ యాజమాన్యంలో ఉన్నవి 59 శాతం కాగా భాగస్వామ్య కంపెనీలు 16 శాతం మేరకు ఉన్నాయి. ఎల్ఎల్‌పి 1 శాతం కాగా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు 23 శాతం, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు 1 శాతం మేరకు ఉన్నాయి.

యావద్భారతదేశంలో ఇంచుమించు 7,34,00,000 ఎమ్ఎస్ఎమ్ఈలు ఉన్నాయి. మార్చి 2025 నాటికి ఉద్యామ్ పోర్టల్‌లో నమోదయి ఉన్న కంపెనీలు 6,20,00,000.

ఎమ్ఎస్ఎమ్ఈల రంగంలో పరపతి లోటు (అవసరమైన ఆర్థిక వనరులు, వాస్తవంగా అందుతున్న రుణ సదుపాయం మధ్య వ్యత్యాసం) 24 శాతం (రూ. 30లక్షల కోట్లు) కాగా, సర్వీసెస్ సబ్ సెక్టార్‌లో ఈ లోటు 27 శాతం కాగా మహిళల యాజమాన్యంలో ఉన్న కంపెనీలకు పరపతి లోటు 35 శాతం మేరకు ఉన్నది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ సరుకుల ఎగుమతులలో ఎమ్ఎస్ఎమ్ఈల వాటా 45 శాతం. 2024–25లో తమ ఉత్పత్తులను ఎగుమతి చేసిన కంపెనీలు 1,73,350 మాత్రమే. (మొత్తం ఎమ్ఎస్ఎమ్ఈలలో ఇవి కేవలం 1 శాతం మాత్రమే) ఇవి ఎగుమతి చేస్తున్న ప్రధాన సరుకులు రెడీమేడ్ వస్త్రాలు, ఆభరణాలు, చర్మ ఉత్పత్తులు, చేతి వృత్తుల ఉత్పత్తులు, ప్రాసెస్డ్ ఆహారాలు, ఆటోమొబైల్స్ విడిభాగాలు. వీటిలో ఒకటి మినహా మిగతావన్నీ ఉత్పత్తికి ఖరీదైన సాంకేతికతలు అవసరం లేని సామాన్య వస్తువులే.



ఎమ్ఎస్ఎమ్ఈల పురోగతికి రుణ సదుపాయ పథకాలు, అభివృద్ధి సహాయ కార్యక్రమాలు చాలా ఉన్నాయి. ప్రస్తావిత అధికారిక నివేదికలను బట్టి కనీసం రెండు సబ్సిడీ పథకాలు, నాలుగు క్రెడిట్ గ్యారంటీ పథకాలు, కనీసం 13 అభివృద్ధి సహాయ పథకాలు ఉన్నట్టు నాకు అర్థమయింది. 2025–26 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్ కొత్తగా ఈ రంగంలోకి ప్రవేశించిన వారికి ఒక సబ్సిడీ పథకాన్ని, ఒక క్రెడిట్ కార్డ్ పథకాన్ని ప్రకటించింది. అంతే కాకుండా ఒక కొత్త ఫండ్ ఆఫ్ ఫండ్స్, ఒక డీప్ టెక్ ఫండ్ ఆఫ్ ఫండ్స్, వీథుల్లో బళ్లపై వివిధ సరుకులు పెట్టుకుని అమ్ముకునే వారికి ఒక నిధి (పీఎమ్ స్వనిధి)ని ప్రకటించింది. ఉద్యోగాల సృష్టికి ప్రధాన ఆధారం ఎమ్ఎస్ఎమ్ఈలే. ఈ రంగం మొత్తం 26 కోట్ల మందికి ఉద్యోగ సదుపాయాన్ని కల్పిస్తోందని ప్రభుత్వం ప్రకటించింది.

ఇక ఇప్పుడు ఒక ప్రధాన ప్రశ్నను తరచి చూద్దాం. ప్రస్తావిత అధికారిక నివేదికల ప్రకారం ఎమ్ఎస్ఎమ్ఈలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు: నిపుణ కార్మికుల కొరత, నైపుణ్యాల లోటు, ప్రతిభావంతులను ఆకట్టుకోవడంలో కష్టసాధ్యాలు. ఈ నివేదికలు వెల్లడించిన వాస్తవాలు మన దేశంలో నిరుద్యోగిత సంపూర్ణ కథను విశదం చేస్తున్నాయి. రూ.125 కోట్ల గరిష్ఠ పెట్టుబడులతో మొత్తం రూ.500 కోట్ల వ్యాపారం చేస్తున్న పెద్ద పరిశ్రమలు ఉన్నత విద్యార్హతలు, మెరుగైన నైపుణ్యాలు ఉన్నవారిని కార్మికులుగా, ఉద్యోగులుగా నియమించుకుంటున్నాయి. నిరుద్యోగులుగా ఉన్నవారిలో అత్యధికులకు అటువంటి విద్యార్హతలు, నైపుణ్యాలు కొరవడడం ఒక వాస్తవం. ఎమ్ఎస్ఎమ్ఈలకు కార్మికుల అవసరం చాలా ఉంది. అయితే ఈ పరిశ్రమలు కూడా కార్మికుల కొరత నెదుర్కొంటున్నాయి, ప్రతిభావంతులను ఆకర్షించలేకపోతున్నాయి. ఎందుకని? మొదటి కారణం– ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటున్నవారికి సంబంధిత ఉద్యోగాలకు అవసరమైన విద్యార్హతలు, నైపుణ్యాలు ఉండడం లేదు; రెండో కారణం– ఈ పరిశ్రమలు సమకూరుస్తున్న ఉద్యోగాలలో చేరేందుకు యువజనులు ఆసక్తి చూపడం లేదు. అవి ఇవ్వజూపుతున్న వేతన భత్యాలు సంతృప్తికరంగా లేకపోవడం వల్లే ఆ ఉద్యోగాల పట్ల యువత విముఖత చూపుతోంది. పైగా ఈ పరిశ్రమలు నిర్వహిస్తున్న కంపెనీలలో చేరడమనేది సమాజంలో ప్రతిష్ఠాకరం కాకపోవడం కూడా ఆ విముఖతకు కారణమవుతోంది.

ఎమ్ఎస్ఎమ్ఈల వ్యవస్థాగత వాస్తవాలు, ఉద్యోగిత పరిణామాలను బట్టి యువ భారతీయులలో నిరుద్యోగిత అధికంగా ఎందుకు ఉన్నదో తెలుసుకోవడం కష్టమేమీ కాదు. ఏప్రిల్ 2025లో భారత జనాభా 146 కోట్లు. కార్మిక శక్తి భాగస్వామ్యం (లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ – ఎల్ఎఫ్‌పిఆర్) అంటే ఉద్యోగాలలో ఉన్నవారు, ఉద్యోగం కోసం క్రియాశీలంగా ప్రయత్నిస్తున్నవారు వెరసి మొత్తం ప్రజలు 81 కోట్లు (55.6 శాతం). ఉపాధి పొందుతున్న జనాభా నిష్పత్తి (వర్కర్ పాపులేషన్ రేషియో –డబ్ల్యుపిఆర్) 52.8 శాతం (77 కోట్లు). ఈ రెండు గణాంకాల మధ్య వ్యత్యాసం (4 కోట్లు) నిరుద్యోగుల సంఖ్యను వెల్లడిస్తుంది. వీరంతా నిరుద్యోగులు. నిరుద్యోగుల సంఖ్య చాలా హెచ్చుగా ఉన్నది, సందేహం లేదు. అయితే ఈ నిరుద్యోగులు అదరూ 'ఉద్యోగానికి క్రియాశీలంగా ప్రయత్నిస్తున్న జనాభా'లోని వారేనన్న విషయాన్ని విస్మరించ కూడదు. వివిధ కారణాలతో ఉద్యోగ ప్రయత్నాలను విరమించిన వారు లక్షల సంఖ్యలో ఉన్నారనేది కూడా మరువకూడదు. 81 కోట్ల శ్రామిక జనావళిలో నిరుద్యోగులు 4 కోట్ల మంది అంటే నిరుద్యోగిత 5.0 శాతం. ఇది అధికారిక గణాంకం.

ఎమ్ఎస్ఎమ్ఈలలో అత్యధికం (98.64 శాతం) సూక్ష్మ పరిశ్రమలే. యాజమాన్యం, భాగస్వామ్యం మొత్తం ఎమ్ఎస్ఎమ్ఈలలో 75 శాతం మేరకు ఉన్నదనే వాస్తవాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే ఈ రంగం కంపెనీలలో ఉద్యోగులు లేదా కార్మికులుగా ఉన్న 26 కోట్ల మందిలో చాలా మంది కుటుంబ సభ్యులు లేదా యాజమానుల బంధువులే అయివుంటారన్నది స్పష్టం. చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమల (మొత్తం ఎమ్ఎస్ఎమ్ఈలలో 1.36 శాతం లేదా ఇంచుమించు 10,00,000)లో మాత్రమే కుటుంబ, బంధుత్వాల వెలుపలి వారిని నియోగించుకోవడం జరుగుతోంది. దీన్నిబట్టి యజమాని– సేవకుడు సంబంధం ఉన్నది చిన్న, మధ్యతరహా పరిశ్రమలలోనే అని విశదమవుతుంది. పది లక్షల ఎమ్ఎస్ఎమ్ఈలు తమ వ్యాపారాలను పెంపొందించుకుంటూ కొత్త ఉద్యోగాలను సృష్టిస్తున్నాయి. పాఠశాల విద్యను మధ్యలోనే ఆపివేసిన వారు లేదా పాఠశాల విద్యార్హతలు మాత్రమే ఉన్నవారు లేదా ఒక ప్రాథమిక ఆర్ట్స్ లేదా సైన్స్ డిగ్రీ ఉన్న వారి నుంచి ఉద్యోగాలకు డిమాండ్ వస్తోంది. ఈ డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది. మరి వీరికి ఉద్యోగ సదుపాయం కల్పించగల చిన్న, మధ్యతరహా పరిశ్రమల యాజమానులు రుణ సదుపాయంలోటు, పరిశ్రమల నిర్వహణకు సంబంధించిన కఠిన నిబంధనలతో నానా సమస్యల నెదుర్కొంటున్నారు. ఉద్యోగాలను కోరుకుంటున్నవారికి సరైన విద్యార్హతలు, నైపుణ్యాలు ఉండడం లేదు. వృత్తిపరమైన శిక్షణ లేకపోవడం వారి ఉద్యోగావకాశాలకు అవరోధంగా ఉన్నది. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఉద్యోగాభిలాషులలో 'ప్రతిభా లోపం' సమృద్ధిగా ఉన్నది. ఈ లోపాలను అధిగమించేందుకు ప్రభుత్వం ఏమి చెయ్యాలి? తొలుత నైపుణ్యాల శిక్షణతో కూడిన పాఠశాల విద్యను సమకూర్చాలి. ఆ తరువాత సూక్ష్మపరిశ్రమలను వదిలివేసి చిన్న, మధ్యతరహా పరిశ్రమల వ్యవస్థాపకులకు ఉదారంగా స్వల్ప వడ్డీతో కూడిన పరపతి సదుపాయాన్ని సమకూర్చాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)





● చక్కనితల్లికి చాంగుభళా

బంగారు బొమ్మలు

బందరురోడ్డులోని జోయలుక్కాస్ షోరూం పునఃప్రారంభంతో పాటు బ్రిలియస్ డైమండ్ జ్యూయలరీ షోరూం ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించగా, వజ్రాభరణాల ధగధగలతో మోడళ్లు ఆకట్టుకున్నారు. 6



సకల కళలకు ఆరాధ్యదేవత కనకదుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం భరతనాట్య ప్రదర్శన జరిగింది. దుర్గామల్లేశ్వర దేవస్థాన మహామండప ప్రాంగణంలో ఉన్న కళావేదికపై నగరానికి చెందిన శ్రీనటరాజ నృత్య కళాశాల విద్యార్థులు చక్కటి అభినయంతో నర్తించారు. 15 మంది కళాకారులు లయబద్ధంగా నాట్యం చేయగా, ఆలయ అధికారులు వారికి అమ్మవారి ప్రసాదం, సర్టిఫికెట్లు అందజేశారు.

- ఇంద్రకీలాద్రి

కలిసికట్టుగా పనిచేద్దాం!

కష్టపడిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తాం

మచిలీపట్నంలో రెండెకరాల్లో పార్టీ జిల్లా కార్యాలయం

- కృష్ణాజిల్లా మినీ మహానాడులో మంత్రి కొల్లు రవీంద్ర 8
- అధికారముందని కొందరు కంచరగాడిదలు ఇష్టానుసారం ప్రవర్తించారు
- ఇప్పుడు వారి పరిస్థితిని చూస్తున్నాం : జిల్లా ఇన్‌చార్జి మంత్రి సుభాష్



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

అక్రమాలు అనేకం

వైసీపీ అధికారంలో ఉండగా అడ్డగోలుగా చేసిన అవినీతి వ్యవహారాలు మాజీమంత్రి జోగి రమేశ్ మెడకు చుట్టుకుంటున్నాయి. తాజాగా అగ్రిగోల్డ్ భూముల కుంభకోణం వ్యవహారంలో నిజాలు నిర్ధారణ కావడంతో ఆయన అడ్డంగా బుక్కయ్యారు. ఇక పెడన కేడీసీసీ బ్యాంకులో జరిగిన రుణాలకు సంబంధించిన వివాదం తేలాల్సి ఉంది. తనవారిని రక్షించుకునే ప్రయత్నంలో బ్యాంకు అధికారుల ద్వారా చేయించిన తప్పుల వ్యవహారం కూడా నిర్ధారణ అయితే, ఆయన మరిన్ని చిక్కుల్లో పడే అవకాశం ఉంది.



అనుయాయులకే విక్రయాలు

అగ్రిగోల్డ్ భూములను కబ్జా చేసిన మాజీమంత్రి జోగి రమేశ్ అండ్ కో వాటిని తమ అనుయాయులకే విక్రయించారు. వైసీపీకి చెందిన నేతలే ఏడు ప్లాట్లను కొన్నారు. ప్రహరీ కట్టించే పనులు చేపట్టారు. ఆ తర్వాత ఈ ప్లాట్లను వేరేవారికి విక్రయించటానికి రంగం సిద్ధం చేశారు. ప్రహరీ నిర్మాణ సమయంలో అగ్రిగోల్డ్ యాజమాన్యానికి విషయం తెలిసి కథ అడ్డం తిరిగింది.

అంబాపురం అగ్రిగోల్డ్ భూముల్లో బుక్కైన మాజీమంత్రి జోగి రమేశ్

- వైసీపీ హయాంలో అడ్డగోలుగా అవినీతి
- మంత్రి హోదాలో అధికారులతో సమావేశం
- లేని భూమిని కొని.. అగ్రిగోల్డ్ భూములపై కన్ను
- సహకరించిన రెవెన్యూ అధికారులు
- భూములు కొన్నది కూడా జోగి అనుయాయులే..
- తాజా జాయింట్ ఇన్స్పెక్షన్‌లో నిజనిర్ధారణ
- ఇక పెడన కేడీసీసీ బ్యాంకు కేసుపై దృష్టి



గురువారం అంబాపురంలో అధికారుల సర్వే

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ ప్రభుత్వ హయాంలో అగ్రిగోల్డ్ భూముల వివాదంలో తెర ముందు తన కుటుంబ సభ్యులను పెట్టి, తెరవెనుక మాత్రం జోగి రమేశ్ అన్నీ తానై వ్యవహారం నడిపించారు. కుమారుడు జోగి రాజీవ్, సోదరుడు జోగి వెంకటేశ్వరరావును ముందు పెట్టి జరిపిన ఈ అవినీతిలో అడ్డంగా బుక్కయ్యారు. అంబాపురంలోని ఈ భూదందా కోసం ఏకంగా ఒక టీమ్ పనిచేసింది. లేని భూమిని అమ్మేందుకు తన అనుచరుడి కుటుంబాన్ని అడ్డు పెట్టుకున్నారు. రెవెన్యూలో రూరల్ మండల సర్వేయర్, అప్పటి స్థానిక వీఆర్వోతో కథ నడిపించారు. రిజిస్ట్రేషన్ శాఖలో ఒక డాక్యుమెంట్ రైటర్‌తో పాటు ఏకంగా సబ్ రిజిస్ట్రార్‌నే బుట్టలో వేసుకున్నారు. ఆ తర్వాత భూములను కొనేవారిని కూడా ఏర్పాటు చేసుకున్నారు. వీరంతా కూడా ఎవరి పాత్ర వారు పకడ్బందీగా ప్లాన్ చేసుకోవడంతో నకిలీ రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి.

సర్వే నెంబర్ 88లో ఇలా..

అంబాపురం గ్రామంలోని సర్వే నెంబర్ 88లో ఉన్న భూమి ఎప్పుడో చేతులు మారింది. ఈ భూమిలో అమ్మటానికి ఏమీ లేదు. చివరి యజమాని విక్రయిస్తే తప్ప అమ్మటానికి సాధ్యపడదు. సర్వే నెంబర్ 88లో ఉన్న ఈ భూమిని జోగి రమేశ్ మిగతా 6లో..

తెలియక మోసపోయారట..!

జోగి రమేశ్ కుటుంబం నుంచి ప్లాట్లు కొన్నవారు గురువారం రెవెన్యూ, సీఐడీ, ఏసీబీ అధికారులు చేసిన సంయుక్త తనిఖీ వద్దకు వచ్చి మొసలి కన్నీరు కార్చారు. ప్లాట్లను తాము కొని మోసపోయామని చెప్పారు. ఈ భూముల వెనుక కథ తమకు తెలియదని, భూములకు మట్టి చదును చేసుకుంటున్నపుడు కూడా ఎవరూ అభ్యంతరం పెట్టలేదని, అందుకే తాము కొన్నామన్నారు. కాగా, ఈ పరిశీలనకు జోగి రమేశ్‌కు భూములు అమ్మిన మహాలక్ష్మి ప్రాపర్టీస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ సంస్థ మాత్రం రాలేదు. వీరిని ఇప్పటికే సీఐడీ విడిగా విచారణ చేసినట్టు తెలుస్తోంది. ఇక నివేదిక ఏమి ఇచ్చారో తెలియాల్సి ఉంది.



జీజీహెచ్‌లో ఐసోలేషన్ వార్డు

కరోనా అలెర్ట్

జీజీహెచ్‌లో ఐసోలేషన్ వార్డు సిద్ధం

వైద్య సిబ్బంది కేటాయింపు

- అందుబాటులోకి రాని ఆక్సిజన్ ప్లాంట్లు
- ఇప్పటికైనా వినియోగంలోకి తెస్తే మేలు

విజయవాడ, మే 23 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా కరోనా కొత్త వేరియంట్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కొవిడ్ కేసులు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్న రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు వైద్యారోగ్య శాఖ రంగంలోకి దిగింది. ఇందులో భాగంగానే జీజీహెచ్‌లో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఐసోలేషన్ వార్డులో బెడ్లను సిద్ధం చేశారు. గతంలో కొవిడ్ వ్యాప్తి చెందిన సమయంలో జీజీహెచ్‌లో చేసిన ఏర్పాట్లు ఎంతో ఉపయోగపడ్డాయి. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో జీజీహెచ్ అధికారులు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బందిని కేటాయిస్తున్నారు. తాజాగా కరోనా వ్యాప్తికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇందులో భాగంగానే కొత్త వైరస్ లక్షణాలను వైద్యులు వివరిస్తున్నారు. ఈ వైరస్ సోకిన వారిలో దగ్గు, గొంతునొప్పి, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, నీరసం, కండ్ల కలక ఉంటాయని చెబుతున్నారు. ఈ లక్షణాలు కనిపించినవారు వైద్యులను సంప్రదించి మందులు వాడటంతో పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఆక్సిజన్ ప్లాంట్లు వినియోగంలోకి వచ్చేనా?

జీజీహెచ్‌లో కేంద్రప్రభుత్వం గతంలోనే రూ.3 కోట్లతో ఆక్సిజన్ ప్లాంటును ఏర్పాటు చేసింది. అయితే ఇప్పటి వరకు ఈ ప్లాంట్ వినియోగంలోకి రాలేదు. అలాగే, జీజీహెచ్‌కు అనుబంధంగా ఉన్న సిద్ధార్థ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్లాంటును కూడా గత సూపరింటెండెంట్‌తో పాటు ప్రస్తుత సూపరింటెండెంట్ కూడా పట్టించుకోలేదనే ఆరోపణలు వస్తున్నాయి.

రంగాకు మరో రిమాండ్

మైనింగ్ కేసులో కోర్టులో హాజరుపరిచిన పోలీసులు

విజయవాడ, మే 23 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో గన్నవరం, బాపులపాడు మండలాల్లో జరిగిన అక్రమ మైనింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అనుచరుడు ఓలుపల్లి మోహనరంగారావు అలియాస్ రంగాకు కోర్టు రిమాండ్ విధించింది. రంగా ప్రస్తుతం విజయవాడ జిల్లా జైల్లో వేర్వేరు కేసుల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. కొద్దిరోజుల క్రితమే రెండు కేసుల్లో బెయిల్ మంజూరైంది. మిగిలిన కేసుల్లో బెయిల్ రాకపోవడంతో జైల్లో ఉన్నాడు. వంశీ అధికారంలో ఉండగా, జరిగిన అక్రమ మైనింగ్‌ను విజిలెన్స్ నిగ్గు తేల్చిన విషయం తెలిసిందే. దీనిపై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో పోలీసులు రంగాపై గన్నవరంలోని అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేశారు. ఈ కోర్టు న్యాయాధికారి సెలవులో ఉండటంతో ఇన్‌చార్జి కోర్టు అయిన విజయవాడలోని మూడో అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో శుక్రవారం హాజరుపరిచారు. జూన్ 6 వరకు రంగాకు రిమాండ్ విధిస్తూ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది.

తిరువూరు వైస్ చైర్‌పర్సన్‌కు తాత్కాలిక చైర్మన్ బాధ్యతలు

తిరువూరు, మే 23 (ఆంధ్రజ్యోతి) : తిరువూరు నగర పంచాయతీ తాత్కాలిక చైర్‌పర్సన్‌గా వైస్ చైర్‌పర్సన్ వెలుగోటి విజయలక్ష్మికి బాధ్యతలు అప్పగిస్తూ మున్సిపల్ శాఖ ఆదేశాలు జారీ చేసిందని మున్సిపల్ కమిషనర్ జి.లోవరాజు శుక్రవారం తెలిపారు. ప్రస్తుత చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి తన పదవికి రాజీనామా చేయడంతో ఈనెల 19న చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించాలనుకున్నా పూర్తికాలేదు. కోరం లేకపోవడంతో ఆ తర్వాత రోజుకు వాయిదా పడింది. 20వ తేదీ కూడా సభ్యులెవరూ రాకపోవడంతో ఎన్నిక రద్దయ్యింది. ఈ నేపథ్యంలో చైర్‌పర్సన్ ఎన్నిక జరిగే వరకు వైస్ చైర్‌పర్సన్ వెలుగోటి విజయలక్ష్మికి తాత్కాలిక చైర్‌పర్సన్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు అందాయి.

అర్ధరాత్రి కిక్కుకు ఇక చెక్

మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లపై ఇక నిఘా

- సమయం దాటి అమ్మకాలు సాగిస్తే చర్యలు
- మూడంచెల నిఘాకు అధికారుల నిర్ణయం
- రెండు జిల్లాల్లో తనిఖీ బృందాల ఏర్పాటు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కేసు, లైసెన్స్ రద్దు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉదయం 10 గంటలకు తెరుచుకోవాల్సిన బార్లు.. సూర్యోదయానికి ముందే రహస్యంగా ప్రారంభమై పోతున్నాయి. రాత్రి 10 గంటలకు షెటర్ దించేసినా.. పక్కన ఉన్న బడ్డీకొట్లలో విక్రయాలు సాగుతున్నాయి. ఇదీ ఉమ్మడి కృష్ణాజిల్లాలోని కొన్నిచోట్ల పరిస్థితి. లైసెన్సులు పొందినప్పుడు నిబంధనల ప్రకారం షాపులు, బార్లు నిర్వహిస్తామని చెప్పి, తర్వాత ఆదాయం కోసం వాటిని ఉల్లంఘించిన వారికి చెక్ పెట్టాలని ఎక్సైజ్ అధికారులు మిగతా 6లో..





బాబోయ్..

భరించలేకున్నాం!

కలుషిత నీటితో తీవ్ర దుర్గంధం!

- తొమ్మండ్రువాగులోకి ఐడీఏ ఔషధ వ్యర్థాలు
- పంటలు, పశువులకు హానికరం
- పట్టించుకోని పాలకులు, అధికారులు 6



యోగాంధ్రలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపుదాం

● ప్రజలకు కలెక్టర్ లక్ష్మీశ పిలుపు 8

కాలుష్యం.. కట్టడి చేద్దాం 6

- నిర్ధారణ అస్త్రాలతో హెచ్చుతగ్గుల గుర్తింపు



పాపం.. పేషెంట్లు! 8

- జీజీహెచ్ ఎముకల వార్డులో టాయిలెట్ల పక్కనే బెడ్లు
- ముక్కులు మూసుకుని వైద్యం చేయించుకుంటున్న రోగులు
- సిబ్బంది నిర్వాకంపై రోగుల బంధువుల ఆగ్రహం

కాలుష్యం.. కట్టడి చేద్దాం!

» నిర్ధారణ అస్త్రాలతో హెచ్చుతగ్గుల గుర్తింపు

నేడు నగరాలు, పట్టణాల్లో ప్రజలను ఇబ్బందిపెడుతున్న సమస్య వాతావరణ కాలుష్యం. ధ్వని, వాయు కాలుష్యాలు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. గాలి కాలుష్యాన్ని, వాహనాల నుంచి వచ్చే ధ్వని కాలుష్యాన్ని గుర్తించి నిర్ధారించే అస్త్రాలను కాలుష్య నియంత్రణ మండలి విజయవాడలో ప్రదర్శించింది. వ్యర్థాల నిర్వహణ అంశంపై సదస్సులో వివరించారు. అవేంటో తెలుసుకుందాం..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)



రెస్పిరబుల్ డస్ట్ శాంపలర్



గాలిలో అనేక దుమ్ము, ధూళి కణాలు ఉంటాయి. వాతావరణంలో మార్పులను బట్టి ఈ కణాల్లో హెచ్చుతగ్గులు ఉంటాయి. మానవ జీవితంపై చెడు ప్రభావాన్ని చూపే ఈ కణాలు ఏ స్థాయిలో ఉన్నాయన్న విషయాన్ని రెస్పిరబుల్ డస్ట్ శాంపలర్ తెలియజేస్తుంది. గాలిలో ఉండే పీఎం 10 (పార్టిక్యులేట్ మ్యాటర్) విలువలను గుర్తిస్తుంది. ఎస్వో 2 (సల్ఫర్ డయాక్సైడ్), ఎన్వో 2 (నైట్రోజన్ డయాక్సైడ్), ఎన్‌హెచ్ 3 (అమ్మోనియా) విలువలను తెలియజేస్తుంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిర్దేశాల ప్రకారం గాలిలో పీఎం10, 100 మైక్రోగ్రామ్ పర్ మీటర్ క్యూబ్ ఉండాలి. అదే పీఎం 2.5, 60 మైక్రోగ్రామ్ పర్ మీటర్ క్యూబ్ ఉండాలి.

నిర్ధారణ ఇలా..

డస్ట్ శాంపలర్ పరికరంలో మూడు ఇన్‌పింజర్స్(గాజు పరీక్ష నాళికలు)లో కొన్ని రసాయనాల మిశ్రమాన్ని పోసి శాంపలర్‌లో పెడతారు. నాలుగైదు గంటలకు ఒకసారి క్షేత్రస్థాయిలో సిబ్బంది కాలుష్య నియంత్రణ మండలి ప్రయోగశాల నుంచి ఐస్‌బాక్స్‌లో రసాయనాల మిశ్రమాన్ని(సొల్యూషన్) తీసుకెళ్లి మార్చుతారు. 24 గంటల తర్వాత ప్రయోగశాలలో పరీక్షించి పీఎం10 విలువను నిర్ధారిస్తారు. విజయవాడ నగరంలో తొమ్మిది ప్రాంతాల్లో ఈ శాంపలర్స్‌ను ఏర్పాటు చేశారు.

నాయిస్ మీటర్ (ధ్వని కాలుష్యం)



కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం ఇండస్ట్రియల్ ఏరియాలో పగలు 75, రాత్రి 70 డెసిబుల్స్ లోపు ధ్వని ఉండాలి. వాణిజ్యప్రాంతాల్లో పగలు 65, రాత్రి55, నివాస ప్రాంతాల్లో పగలు 55, రాత్రి 45, నిశ్శబ్ద ప్రాంతాల్లో పగలు 50, రాత్రి 40 డెసిబుల్స్ ఉండాలి. నగరాలు, పట్టణాల్లోనే కాకుండా పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో ధ్వని కాలుష్యం ఏ స్థాయిలో ఉందో గుర్తించడానికి ఉపయోగించే పరికరం నాయిస్ మీటర్. దీనినే సౌండ్ లెవల్ మీటర్ అని వ్యవహరిస్తారు. జనావాసాలు, పారిశ్రామిక వాడలు, నిర్మానుష్య ప్రాంతాల్లో ధ్వని కాలుష్యం హెచ్చుతగ్గులను ఈ నాయిస్ మీటర్ ద్వారా గుర్తిస్తారు.

రసాయన సాంద్రతకు.. వీవోసీ

భారీ పరిశ్రమల్లో కొన్నింటిలో బాయిలర్లు ఉంటాయి. మరికొన్నింటిలో రియాక్టర్లు ఉంటాయి. ఆయా పరిశ్రమల్లో తయారయ్యే ఉత్పత్తులకు అవసరమైన రసాయన మిశ్రమాన్ని వాటి ద్వారా పంపుతారు. కొన్ని సందర్భాల్లో ఈ రియాక్టర్లు, బాయిలర్లు పేలిపోవడంతో కార్మికులు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ రియాక్టర్లు, బాయిలర్లలో ఏఏ రసాయనం సాంద్రత ఏ స్థాయిలో ఉందో గుర్తించడానికి వీవోసీ(వాలటైల్ ఆర్గానిక్ కార్బన్) పరికరాన్ని ఉపయోగిస్తారు. పేలుడు జరిగిన తర్వాత ఆ రసాయన మిశ్రమం చెల్లాచెదురైపోతుంది. పీసీబీ సిబ్బంది ఈ పరికరాన్ని ఉపయోగించి పరిశ్రమలో ఉపయోగించిన మిశ్రమంలో ఏఏ రసాయనాలు ఉన్నాయి, వాటి సాంద్రత ఏ స్థాయిలో ఉంది అన్న విషయాలను నిర్ధారిస్తారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలోని 500 మీటర్ల వరకు ఉన్న వాయువులను, రసాయనాలను ఈ పరికరం తీసుకుని, వాటిని విలువలను ట్యాబ్‌లో తెలియజేస్తుంది. ఇందుకోసం ఈ పరికరానికి అనుసంధానంగా ఒక ట్యాబ్ ఉంటుంది.





ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి రీసైకిల్ చేసిన వస్తువులు



మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

టీడీపీతోనే సామాజిక న్యాయం

» ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

కంకిపాడు, మే 23 (ఆంధ్రజ్యోతి) : సామాజిక న్యాయం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం అని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. పెనమలూరులో మార్కెట్‌యార్డు నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కొనకళ్ల మాట్లాడుతూ, వైసీపీ గత ఐదేళ్ల అరాచక పాలన నుంచి ప్రజలను విముక్తి చేసేందుకు కూటమి పార్టీల నేతలు విశేష కృషి చేశారన్నారు. రైతులకు న్యాయం చేయగలిన శక్తి మార్కెట్ యార్డు పాలకవర్గానికి ఉంటుందన్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారి శ్రేయస్సు కోసం పాటుపడాలన్నారు. ఎమ్మెల్యే బోడెప్రసాద్ మాట్లాడుతూ, టీడీపీ అంటేనే అభివృద్ధి సంక్షేమం అన్నారు. ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య మాట్లాడుతూ, రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ రైతు శ్రేయస్సు కోసం పాటుపడతామని, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పాలకవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు వెలగపూడి శంకర బాబు, జనసేన జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మీ, సర్పంచ్ బాకి రమణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన పాలకవర్గం

చైర్మన్ అన్నే ధనరామకోటేశ్వరరావు, వైస్‌చైర్మన్ మల్లంపల్లి కల్యాణి, డైరెక్టర్లు మాబు సుబాని, దండమూడి లక్ష్మి, కుంపటి రమేష్ బాబు, బొక్కా బచ్చులు, కిలారు శ్రీనివాసరావు, సింహాద్రి కృష్ణవేణి, బడుగు సాంబశివరావు, సుంకర శ్రీదేవి, గోగినేని వెంకటరమణ, గుడివాడ సామ్రాజ్యం, వడ్డీ జీవ, పి.రజని.

పరిశ్రమలతో జిల్లా అభివృద్ధి

» ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



విజయవాడ, మే 23 (ఆంధ్రజ్యోతి) : 'రాష్ట్ర రాజకీయాలకు కేంద్ర బిందువు విజయవాడ.. అటువంటి జిల్లా ఇప్పుడు వెనబడి పోయింది.' అని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మచిలీపట్నంలో జరిగిన మినీ మహానాడు కార్యక్రమంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పారిశ్రామికంగా అభివృద్ధి చెందితే తప్ప జిల్లా ముందుకు సాగడం కష్టసాధ్యమన్నారు. బందరు పోర్టు పూర్తయితే మచిలీపట్నం పూర్వ వైభవం సంతరించుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో పరిశ్రమలు వస్తే తప్ప అభివృద్ధి చెందడం అసాధ్యమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానికి ముందే పరిశ్రమలు స్థాపించిన తొలితరం పారిశ్రామిక వేత్తలు ఇక్కడి వారేనని, అలాంటి చరిత్ర కలిగిన జిల్లా నేడు మసకబారిపోయిందని విచారం వ్యక్తం చేశారు. ఎన్టీ రామారావు లాంటి మహనీయుడు ఇక్కడి నుంచే పాలన చేశారని గుర్తుచేశారు. ఇక్కడే జన్మించిన పట్టాభి సీతారామయ్య స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో ఏఐసీసీ అధ్యక్షుడు, ఆంధ్రబ్యాంకు నిర్మించిన వ్యక్తిగా చరిత్ర సృష్టించారన్నారు. ఇంతటి గుర్తింపు ఉన్న ప్రాంతం నేటికీ వెనుకబడి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో జిల్లాను సీఆర్‌డీఏ పరిధిలోకి తీసుకుని, ప్రతి నియోజకవర్గంలో కొంత భూమిని కేటాయించి ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేయాలని కోరారు. భవిష్యత్తులో ఏ పార్టీ అధికారంలో ఉన్నా రాజధానిని మార్చాలనే ఆలోచన కూడా రాకుండా సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాజధాని నిర్మాణం పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తదితరులు

కానూరులో కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు నూతన శాఖ ప్రారంభం

పెనమలూరు 23 (ఆంధ్రజ్యోతి) : కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకింగ్ సేవలను అన్నిరంగాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పెనమలూరు మండలం కానూరులో బ్యాంకు 34వ శాఖను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్న, మధ్య తరగతి ప్రజలకు బ్యాంకు ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. స్వచ్ఛ భారత్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ.. అన్ని రంగాల ఖాతాదారులకు సేవలందిస్తూ బ్యాంకు అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో నాగార్జున హాస్పిటల్స్ చైర్మన్ కొడాలి జగన్‌మోహన్‌రావు, బ్యాంకు ముఖ్యకార్యనిర్వాహక అధికారి కె.శ్యామ్ విజయవాడ రీజనల్ మేనేజర్ జాస్తి మురళి, కానూరు శాఖ మేనేజర్ సి. నెహ్రూజీ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి కిక్కుకు ఇక చెక్

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న బార్లు, మద్యం దుకాణాలపై నిరంతర నిఘా కోసం మూడు దశల్లో కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు శనివారం నుంచి రంగంలోకి దిగనున్నాయి.

ఆదాయం కోసమే..

ఎన్టీఆర్ జిల్లాలో 124 మద్యం దుకాణాలు, 122 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. కృష్ణా జిల్లాలో 135 మద్యం దుకాణాలు, 33 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు పనిచేయాలి. బార్ అండ్ రెస్టారెంట్లు ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు పనిచేయాలి. ఈ వ్యాపారంలో లక్షలాది రూపాయలను పెట్టుబడిగా పెట్టి తక్కువ సమయంలోనే లాభాలను ఆర్జించడం కోసం కొంతమంది వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. కొంతమంది బార్ అండ్ రెస్టారెంట్ యజమానులు ఉదయం 6 గంటలకే రహస్యంగా మద్యం అమ్మేస్తున్నారు. మద్యం వ్యాపారులు షాపుల్లో ఉన్న సరుకును బడ్డీకొట్లకు తరలించి అమ్ముతున్నారు.

ప్రత్యేక కమిటీలతో నిఘా

ఉమ్మడి కృష్ణాజిల్లాలోని బార్ అండ్ రెస్టారెంట్లు, మద్యం దుకాణాలపై నిరంతర నిఘా కోసం స్టేషన్ హౌస్ ఆఫీసర్ నుంచి డిప్యూటీ కమిషనర్ స్థాయి వరకు మూడు స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ఈ కమిటీ ఉంటుంది. దీని తర్వాత ఎక్సైజ్ సూపరింటెండెంట్/అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ స్థాయిలో రెండో కమిటీ ఉంటుంది. డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో మూడో కమిటీ ఉంటుంది. ఈ కమిటీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సిబ్బంది ఉంటారు. ఎక్సైజ్ అధికారులు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా జిల్లావ్యాప్తంగా నిత్యం తనిఖీలు చేస్తారు. కృష్ణాజిల్లాలో ఉన్న కమిటీలను ఎన్టీఆర్ జిల్లాకు, ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న కమిటీలను కృష్ణాజిల్లాకు పంపి మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లలో తనిఖీలు చేయిస్తారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే సంబంధిత యజమానిపై కేసు నమోదు చేయడంతో పాటు లైసెన్స్ రద్దు చేయాలని కమిషనర్‌కు సిఫార్సు చేస్తారు.

బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లు పరిశీలన

మచిలీపట్నం టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : జూన్ మొదటి వారంలో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లను మంత్రి కొల్లు రవీంద్ర శుక్రవారం రాత్రి పరిశీలించారు. అమరావతి గేట్‌తో పాటు బీచ్‌లో పార్కింగ్, ఫుడ్‌కోర్టుతో పాటు జలక్రీడలు, కబడ్డీ, వాలీబాల్ పోటీలకు అనువైన స్థలాలను మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, జిల్లా ఎస్పీ గంగాధరరావు పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. మాజీ ఎంపీపీ, టీడీపీ రూరల్ అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, డీఎస్పీ సిహెచ్ రాజా పాల్గొన్నారు.

నగరంలో 'గోల్డ్ మెన్' సందడి..



లబ్బీపేట, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఆభరణాలు అతివలకే కాదు. మగవారికీ అందాన్ని ఆనందాన్నిస్తాయని చెబుతున్నాడు. ఈ గోల్డ్‌మెన్. నగరానికి చెందిన శివశంకర్ ఒంటిపై కేజీన్నర బంగారు ఆభరణాలతో శుక్రవారం సందడి చేశాడు. నగరంలో ఓ షోరూం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని సందర్శకులను ఆకట్టుకున్నాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే తనకు బంగారం అంటే ఎంతో ఇష్టం అని, 2020 నుంచి ఆభరణాలు వేసుకోవడం మొదలు పెట్టానని తెలిపాడు.



షోరూం ప్రారంభిస్తున్న మంత్రి రవీంద్ర, చిత్రంలో సంస్థ నిర్వాహకులు

జోయలుక్కాస్ పునఃప్రారంభం

» ప్రారంభించిన మంత్రి రవీంద్ర

లబ్బీపేట, మే 23 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారుల నమ్మకాన్ని పొందడంతో పాటు సరికొత్త మోడల్స్‌ను అందిస్తున్న జోయలుక్కాస్ షోరూం నిర్వాహకులు అభినందనీయులని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శుక్రవారం విజయవాడ బందర్ రోడ్డులోని షోరూం పునః ప్రారంభంతో పాటు బ్రిలియస్ డైమండ్ జ్యుయలరీ షోరూం ప్రారంభోత్సవానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. షోరూం ప్రారంభం అనంతరం జోయలుక్కాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆంథోని జాస్ మాట్లాడుతూ, తమ సంస్థ అత్యుత్తమ శ్రేణి అద్భుతమైన కలెక్షన్‌ను వినియోగదారులకు అందిస్తుందని, ప్రారంభ సందర్భంగా రూ.లక్షకు పైగా విలువైన డైమండ్ జ్యుయలరీ కొనుగోళ్లపై ఖచ్చితమైన బహుమతితో పాటు, 1గ్రాం గోల్డ్ కాయిన్ అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం షోరూం అవరణలో మోడల్స్ డైమండ్ జ్యూయలరీ ధరించి క్యాట్ వాక్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు, సంస్థ రిటైల్ డీజీఎం రాజేష్ కృష్ణన్, మార్కెటింగ్ డీజీఎం అనీష్, రీజనల్ మేనేజర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆభరణాన్ని ప్రదర్శిస్తున్న మంత్రి రవీంద్ర

వేసవి వారాంతంలో 44 ప్రత్యేక రైళ్లు

రైల్వే స్టేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : వేసవి రద్దీని పురస్కరించుకుని ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలను చేర్చడానికి 44 వేసవి రైళ్లను నడుపుతున్నట్టు సౌత్ సెంట్రల్ రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 08581 విశాఖపట్నం-ఎస్ఎంవిటి బెంగుళూరు జూన్ నెల 1 నుంచి 29 వరకు ఐదు సర్వీసులు నడుస్తాయి. ప్రతి ఆదివారం ఈ రైలు అందుబాటులో ఉంటుంది. 08582 ఎస్ఎంవిటి బెంగుళూరు-విశాఖపట్నం జూన్ 2నుంచి 30వరకు అందుబాటులో ఉంటుంది. ప్రతి సోమవారం నడిచే ఈ రైలు ఐదు సర్వీసులు నడుస్తుంది. 08547 విశాఖపట్నం-తిరుపతి ప్రతి బుధవారం నడుస్తుంది. జూన్ 4 నుంచి 30 వరకు తొమ్మిది సర్వీసులు నిర్వహిస్తుంది. 08548 తిరుపతి - విశాఖపట్నం ప్రతి గురువారం నడుస్తుంది. జూన్ 5 నుంచి 31వ తేదీ వరకు తొమ్మిది సర్వీసులు ఉంటాయి. 08579 విశాఖపట్నం - చర్లపల్లి ప్రతి శుక్రవారం నడుస్తుంది. జూన్ 6 నుంచి 25వ తేదీ వరకు ఎనిమిది సర్వీసులు ఉంటాయి. 08580 చర్లపల్లి - విశాఖపట్నం ప్రతి శనివారం నడుస్తుంది. జూన్ 7 నుంచి 26వ తేదీ వరకు ఎనిమిది ట్రిప్పులను వేస్తుంది.

సింహపురిలో స్వల్ప మార్పు..

ట్రైన్ నెంబరు 12710 సికింద్రాబాద్-గూడూరు సింహపురి ఎక్స్‌ప్రెస్ సమయాలను స్వల్పంగా మార్చారు. ఈనెల 24న నడిచే ఈ రైలు సమయాన్ని సవరించారు. ఈనెల 24న సికింద్రాబాద్‌లో 1.05 గంటలకు ఈ రైలు బయలుదేరుతుంది.

అక్రమాలు అనేకం

(5వ పేజీ తరువాయి)

అనుచరుడు అడుసుమిల్లి రామ్మోహన్‌దాస్.. జోగి రాజీవ్, జోగి వెంకటేశ్వరరావుకు చెరో 1,086 చదరపు గజాల చొప్పున విక్రయించినట్టు సృష్టించారు. రామ్మోహన్‌దాస్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. ఆయనకు ఓ కంపెనీ ఉన్నట్టు సృష్టించారు. మహాలక్ష్మి ప్రాపర్టీస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ సంస్థను సృష్టించి, ఆ సంస్థ తమకు భూములు విక్రయించినట్టుగా చూపారు. ఆ స్థలాన్ని ఎవరి దగ్గర నుంచీ కొనలేదు. భూములు తమవని చెప్పుకొంటున్న మహాలక్ష్మి ఇన్వెస్ట్‌మెంట్స్‌కు ఆ భూములు సంక్రమించటానికి ఎలాంటి ఆస్కారం లేదు. పోలవరపు మురళీమోహన్ దగ్గర కొన్నట్టుగా ఆ సంస్థ చెబుతోంది. ఈ భూమి పోలవరపు మురళీమోహన్‌దే. ఆయన తన భూమిని అప్పటి వీజీటీఎం-ఉడా నుంచి ప్లాన్ పొంది, ప్లాట్లుగా చేసి విక్రయించేశారు. ఆ ప్లాట్ల విక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల వివరాలు కూడా రిజిస్ట్రేషన్ శాఖ దగ్గర ఉన్నాయి.

సర్వే నెంబర్ 87లో ఇలా..

మహాలక్ష్మి ప్రాపర్టీస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు సంబంధించిన భూమిని కొనుగోలు చేశాక జోగి రమేశ్, ఆయన అనుచరులు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలోని తమ వారితో సమావేశమయ్యారు. భూములు అక్రమంగా తీసుకుంది సర్వే నెంబర్ 88లో అయితే, సర్వే నెంబర్ 87లోని అగ్రిగోల్డ్ భూములకు సవరణ రిజిస్ట్రేషన్స్ చేసుకోవటానికి వీలుగా ఈ సమావేశంలోనే నిర్ణయం తీసుకున్నారు. అవి అగ్రిగోల్డ్ భూములని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు తెలుసు. పైగా సీఐడీ అటాచ్‌లో ఉండటం వల్ల ఎవరికీ రిజిస్ట్రేషన్ చేయకూడదని కూడా తెలుసు. వీటిని రిజిస్ట్రేషన్ చేయాలంటే ఆ భూములకు హక్కు కల్పించేలా ఏదైనా ధ్రువీకరణ చూపించాలి. ఇందులో భాగంగానే ఆ భూమికి హక్కుదారులుగా చెప్పుకోవటానికి నకిలీ ఎఫ్‌లైన్ కాపీని రూపొందించారు. ఇందులో నాటి మండల సర్వేయర్, వీఆర్వో పాత్ర ఉన్నాయి. అప్పటి డిప్యూటీ తహసీల్దార్ కూడా సహకరించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ వివాదంలో వీరిపై అప్పటి కలెక్టర్ దిల్లీరావు సస్పెన్షన్ వేటు వేశారు. ఎఫ్‌లైన్ కాపీని తయారు చేశాక.. మిగిలిన పనిని అప్పటి విజయవాడ రూరల్ సబ్ రిజిస్ట్రార్ పూర్తి చేశారు.

పెడన కేడీసీసీ బ్యాంకు వివాదం సంగతేంటి?

పెడనలోని కృష్ణాజిల్లా సహకార బ్యాంకు పరిధిలో రుణాల కుంభకోణంలోనూ జోగి రమేశ్‌కు ఉచ్చు బిగుస్తోంది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే కేడీసీసీ బ్యాంకు డీజీఎం ప్రభాకర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మచిలీపట్నం కేడీసీసీ బ్యాంకు ఏజీఎం కాగిత రామకృష్ణ, పెడన కేడీసీసీ బ్యాంకు మేనేజర్ ఎం.ఆంజనేయులు, పెడన బ్యాంకు బ్రాంచి సూపర్‌వైజర్ కె.సుధీర్‌తో పాటు మరో ఇద్దరిపై ఈ ఫిర్యాదు అందింది. అప్పట్లో తప్పులకు పాల్పడిన వారిని కాపాడే బాధ్యతను జోగి తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తప్పులు చేసిన వారంతా జోగి రమేశ్‌కు సన్నిహితులు కావటంతో ఆయన జోక్యం చేసుకున్నట్టు తెలుస్తోంది. ఈ కేసును మాఫీ చేసేందుకు మంత్రిగా ఉండగానే.. అధికారుల సహాయంతో బాధ్యులకు సంబంధించిన భూమిని జప్తు చేసుకునే స్కెచ్ వేశారు. రూ.4 కోట్ల విలువ చేసే భూమికి ఎక్కువ మార్కెట్ విలువ సర్టిఫికెట్ తీసుకుని జమ చేసుకునేలా చక్రం తిప్పినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారం కూడా సీబీసీఐడీ దర్యాప్తులో ఉంది.

ఏపీ పౌర సరఫరాల భవనం టీజీఎస్సీఎస్సీఎల్‌కు అద్దెకు

» రెండు రాష్ట్రాల మంత్రుల సమక్షంలో ఒప్పందం

అమరావతి, మే 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విభజన ఒప్పందాల్లో భాగంగా హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని పౌర సరఫరాల సంస్థ భవనాన్ని ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌కు కేటాయించగా.. దానిని ఏపీ ప్రభుత్వం ఇప్పుడు తెలంగాణ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌కు అద్దెకు ఇచ్చింది. ఈ మేరకు శుక్రవారం రెండు రాష్ట్రాల పౌరసరఫరాల శాఖల మంత్రులు నాదెండ్ల మనోహర్, ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ, రెండు రాష్ట్రాల పరస్పర సహకారంతో పౌర సరఫరాల వ్యవస్థలను మరింత సమర్థంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేస్తామని చెప్పారు. విభజన తర్వాత ఉమ్మడి పౌర సరఫరాల సంస్థ విభజన, పరస్పర సహకారం తదితర అంశాలపై చర్చించినట్టు తెలిపారు.

బాబోయ్.. భరించలేకున్నాం!

(జి.కొండూరు, ఆంధ్రజ్యోతి)

కొండపల్లి పారిశ్రామికవాడ (ఐడీఏ)లోని ఔషధ (ఫార్మా), ఇతర కంపెనీల వ్యర్థాలు కట్టుబడిపాలెం వద్ద తొమ్మండ్రువాగులో కలుస్తుండటంతో వాగులో నీరు కలుషితమై తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. వర్షాల సమయంలో వ్యర్థాలను నేరుగా కంపెనీల యాజమాన్యాలు వాగులోకి వదిలేస్తుండటంతో నీరు నల్లని రంగులోకి మారుతోంది. వాగు కట్టుబడిపాలెం, కవులూరు గ్రామాల మీదుగా ప్రవహించి తారకరామా ఎత్తిపోతల పథకం గడ్డె కాలువలో కలుస్తుంది. ఈ వాగు ప్రవాహం ఉన్నంత వరకు భరించలేని దుర్గంధంతో కట్టుబడిపాలెం వాసులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. కట్టుబడిపాలెం-కవులూరు, కవులూరు-శాంతినగర్ రోడ్లపై నడవాలంటే ముక్కు మూసుకోవాల్సిందేనని స్థానికులు వాపోతున్నారు. కలుషిత నీటి వల్ల పంటలు నాశనమవడమే కాక పశువులు అనారోగ్యాల బారిన పడుతున్నాయని, దశాబ్దాలుగా సమస్య వేధిస్తున్నా పట్టించుకునేవారు లేరని గ్రామాల ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ సమస్యపై అనేక మంది ధర్నాలు, నిరసన దీక్షలు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, జిల్లా అధికారులు స్పందించి తొమ్మండ్రువాగులో ఐడీఏ కంపెనీల వ్యర్థాలు కలవకుండా చూడాలని కోరుతున్నారు.

» కలుషిత నీటితో తీవ్ర దుర్గంధం!
» తొమ్మండ్రువాగులోకి ఐడీఏ ఔషధ వ్యర్థాలు
» పంటలు, పశువులకు హానికరం
» పట్టించుకోని పాలకులు, అధికారులు



తొమ్మండ్రువాగులో ప్రవహిస్తున్న కలుషిత నీరు

పంటలు నాశనమవుతున్నాయి

- బొర్రా రమేష్ (రైతు)



తొమ్మండ్రువాగు తీవ్ర దుర్వాసన వస్తున్నది. ఆ నీరే పంటలకు పారుతున్నది. కలుషిత నీటిని వాడటం వల్ల భూములు చౌడు బారిపోతున్నాయి. పంటలు దిగుబడి రావడం లేదు. స్వచ్ఛంగా ఉండే వాగు నీరు నల్లగా మరగలు కమ్ముతూ చెడు వాసన వస్తోంది. అధికారులు స్పందించాలి.

కలుషిత నీటితో కష్టాలు

- పాల రాజు



తొమ్మండువాగు పూర్తిగా కలుషితమైంది. వాగునీరు పశువులకు, చేలకు చేటు చేస్తున్నది. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడు లేడు. నీరు తాగిన పశువుల సూడి నిలవడం లేదు. పంటలు పాడవుతున్నాయి. వాగు పక్కన పొలాల్లో దుర్వాసనకు కనీసం కూర్చోలేకపోతున్నాం. పాలకులు స్పందించాలి.

ఆర్టీసీ ఉద్యోగుల సంబరాలు

బస్‌స్టేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో 1/2019 సర్క్యులర్‌ను ప్రభుత్వం పునరుద్ధరించటంతో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిపోల్లో సంబరాలు జరుపుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా గవర్నరుపేట 1, 2 డిపో గేట్‌లవద్ద మీటింగ్‌లు ఏర్పాటు చేసి స్వీట్లు పంచారు. ఎన్ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.ఎ.వి.శ్రీనివాసరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఈ సర్క్యులర్ జారీ చేయటం ద్వారా ఉద్యోగులందరూ భరోసాతో ఉద్యోగం చేసుకునే అవకాశం కలిగిందన్నారు. కొన్ని సంవత్సరాలుగా ఈ సర్క్యులర్ అమలును నిలిపివేశారు. జోనల్ కార్యదర్శి ఎ.వి.రామారావు, జిల్లా కార్యదర్శి సి.హెచ్.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



దర్శిపేట ఐదురోడ్ల జంక్షన్‌లో, దర్శిపేట ఇళ్ల మధ్య ఓపెన్ డ్రెయినేజీ, అంబేడ్కర్ నగర్‌లో బందరు కాల్వలో కలుస్తున్న ఓపెన్ డ్రెయినేజీ, పూజిత అపార్ట్‌మెంట్ వద్ద నిర్మాణంలో ఉన్న డ్రెయినేజీ

ముక్కు మూసుకోవాల్సిందే..

- దర్శిపేట, అంబేడ్కర్‌నగర్ మీదుగా ఓపెన్ డ్రెయినేజీ
- దోమల స్వైరవిహారం
- దుర్గంధంతో స్థానికుల వెతలు

పటమట, ఆంధ్రజ్యోతి: గత కొన్నేళ్లుగా ఓపెన్ డ్రెయినేజీతో దర్శిపేట, అంబేడ్కర్‌నగర్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్టీఆర్ సర్కిల్, పంట కాల్వ రోడ్డు, నిర్మలా హైస్కూల్ నుంచి వచ్చే మురుగు నీరు దర్శిపేట ఐదు రోడ్ల జంక్షన్, దర్శిపేట ఇళ్ల మధ్య నుంచి ఓపెన్ డ్రెయిన్‌గా దుర్గంధం వెదజల్లుతూ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వెనుక ఎస్ఎస్ఎం స్కూల్ మీదుగా అంబేడ్కర్ నగర్ నుంచి ప్రవహిస్తూ కమ్యూనిటీ హాల్ వద్ద బందరు కాల్వలో కలుస్తోంది. ఏళ్ల తరబడి అంబేడ్కర్‌నగర్, దర్శిపేట ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

కొందరు డ్రెయినేజీ మీద ఇళ్ల ముందు ర్యాంపులు నిర్మించుకోవడంతో వర్షాకాలంలో పూడిపోయి అక్కడ పూడిక తీయలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. మలేరియా, డెంగీ లాంటి వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని సమస్యను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన చొరవతో పూజిత అపార్ట్‌మెంట్ నుంచి పడవల రేవు వంతెన వరకు కొత్తగా డ్రెయినేజీ నిర్మాణం చేపట్టారు. ఈ డ్రెయినేజీ పూర్తయితే దర్శిపేట, అంబేడ్కర్‌నగర్‌వాసుల ఇక్కట్లు తప్పినట్లే. త్వరితగతిన డ్రెయినేజీని పూర్తి చేసి సమస్యను తీర్చాలని 14వ డివిజన్ వాసులు కోరుతున్నారు.

ఆటోనగర్ చెత్త ప్రత్యేక వాహనంలో తరలింపు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లోని చెత్తను తరలించేందుకు జిందాల్ సంస్థతో ఒప్పందం జరిగిందని, నేటి నుంచి ఈ ప్రాంతంలోని చెత్తను ప్రత్యేక వాహనంలో తరలిస్తారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. ఆటోనగర్‌లోని చెత్త సమస్య పరిష్కారానికి వెటర్నరీ కాలనీలోని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యాలయంలో చైర్మన్ పట్టాభితో ఎమ్మెల్యే గద్దెరామ్మోహన్, ఐలా జోనల్ మేనేజర్ కంచి బాజ్జీ శుక్రవారం సమావేశం అయ్యారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే గద్దెరామ్మోహన్ మాట్లాడుతూ విజయవాడ నగర పాలక సంస్థలో ఉత్పత్తి అయ్యే చెత్తను తరలించేందుకు జిందాల్ సంస్థతో ఒప్పందం ఉందని అన్నారు. ఆటోనగర్ ఏరియా స్వయం ప్రతిపత్తి ఉండడంతో ఇక్కడ ఉత్పత్తి అయ్యే చెత్తను ఐలానే తరలించుకోవాలన్నారు. ఐలాకు ప్రత్యేకంగా డంపింగ్‌యార్డు లేకపోవడంతో ఆటోనగర్‌లో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడిందన్నారు. రానురాను సమస్య పేరిగిపోవడంతో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభితో సమావేశం నిర్వహించామని అన్నారు. ఇక్కడ ఉప్పత్తి అయే చెత్త మొత్తాన్ని జిందాల్ సంస్థ తరలించేలా ఒప్పందం జరిగిందని అన్నారు. నేటి నుంచి ఆటోనగర్ ప్రాంతంలోని చెత్తను ప్రత్యేక వాహనంలో తరలిస్తారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐలా అధికారులు, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె, ఐలా అధికారి



బ్రాంజ్ మెడల్ సాధించిన కబడ్డీ జట్టు క్రీడాకారులు

బీచ్ కబడ్డీలో ఆంధ్ర జట్టుకు రజితం

విజయవాడ స్పోర్ట్స్, మే 23 (ఆంధ్రజ్యోతి): మొదటి ఖేలో ఇండియా బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ బీచ్ కబడ్డీ జట్టు బ్రాంజ్ మెడల్ సాధించింది. ఈనెల 19 నుంచి 24వరకు గుజరాత్‌లో ఈ పోటీలు జరగ్గా మెరుగైన ప్రతిభతో ఆంధ్రప్రదేశ్ పురుషుల జట్టు ఈ ఘనత సాధించింది. ఈ సందర్భంగా జట్టు క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.వి.ప్రభావతి, జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్‌లు అభినందనలు తెలిపారు.

ఏరోబిక్స్, హిప్ హాప్‌కు వీపీఎస్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న సిద్ధార్థ అకాడమీ సభ్యులు

విజయవాడ స్పోర్ట్స్, మే 23 (ఆంధ్రజ్యోతి): యుఏఈ, దుబాయ్‌లో ఈనెల 29నుంచి జూన్ ఒకటి వరకు జరిగే 3వ ఏషియన్ ఏరోబిక్స్ హిప్ హాప్ చాంపియన్ షిప్‌కు వీపీఎస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఇండియన్ స్పోర్ట్స్ ఏరోబిక్, ఫిట్‌నెస్ ఫెడరేషన్ తెలిపింది. జాతీయ స్థాయిలో ఈ విద్యార్థులు చూపిన ప్రతిభ ఆధారంగా, అండర్ -18 విభాగానికి కె.సరయు, ఎం.హిమేష్, వి.మౌనికలు ఎంపిక అయ్యారని ఫెడరేషన్ తెలిపింది. వీరికి సిద్ధార్థ అకాడమీ ఆర్థిక సహాయం అందజేయగా, విద్యార్థులను అకాడమీ సెక్రటరీ లక్ష్మణరావు, వైస్ ప్రెసిడెంట్ చనుమోలు కృష్ణారావు, కోశాధికారి సురెడ్డి వెంకటేశ్వరరావు, స్కూల్ ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య, కోచ్ రామ్మోహన్ తదితరులు అభినందించారు.

సాయం చేయడాన్ని అలవరచుకోవాలి

రాయల్ క్లబ్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ

మొగల్రాజపురం, మే 23(ఆంధ్రజ్యోతి): యువతకు అసలైన స్థిర ఆస్తి విద్య ఒక్కటే అని విద్య ఉంటే ఉన్నత స్థితికి చేరుకోవడం ఖాయమని రాయల్‌క్లబ్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ తెలిపారు. రాయల్‌క్లబ్ ఆఫ్ విజయవాడ అమరావతి రాయల్ క్లబ్ నారీశక్తి ప్రారంభోత్సవ కార్యక్రమం సున్నపుబట్టీల సెంటర్లోని ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ)హాల్‌లో శుక్రవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సత్యనారాయణ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సాయం చేసే గుణాన్ని యువత అలవర్చుకోవాలని చెప్పారు. విద్యాభ్యాసానికి పేదరికం అడ్డుకారాదన్నారు. ఆ దిశగా ఆలోచన చేసిన తాము క్లబ్ ఆధ్వర్యంలో ఏటా పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. సివిల్స్ గ్రూప్స్‌కు వెళ్లాలనుకునే వారికి ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు స్టడీ సెంటర్‌ను సైతం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుంకర కృష్ణ, రామిశెట్టి కొండలరావు, సీతలం రాంబాబు, పేటేటి పుల్లయ్య, రంగినీడి వెంకట సుబ్బారావు, నూతక్కి సత్యనారాయణ, కలిగినీడి చిదంబరం, కోటి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చినమిల్లి సత్యనారాయణ

వార్డు స్పెషల్ ఆఫీసర్లూ.. సమస్యల పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలి

- నగర కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : వార్డు స్పెషల్ ఆఫీసర్లు వార్డులోని ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయంలోని నూతన మీటింగ్ హాలులో శుక్రవారం వార్డు స్పెషల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంలో కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ వార్డు స్పెషల్ ఆఫీసర్లు సచివాలయం సిబ్బందితో ఆ వార్డులో ఉన్న సమస్యలన్నీ తెలుసుకుని తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. శాఖల మధ్య సమన్వయంతో ఉండి స్పెషల్ ఆఫీసర్లు సచివాలయంలో ఉన్న సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ నిలిపి త్వరితగతిన ఆ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషినల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకారం వేతనం పంపిణీ

భారతీనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా కళాశాలలో గత 16 సంవత్సరాల నుంచి హెల్ప్‌ది బ్లైండ్ ఫౌండేషన్ (హెచ్‌టీబీఈ) ఆధ్వర్యంలో దృష్టి(శారీరక వికలాంగులు)లోపం ఉన్న విద్యార్థులకు చదువు నిమిత్తం అందజేసే ఉపకారం వేతనాలను కళాశాలలోని ఇంటర్మీడియంట్ విద్యార్థులకు కరస్పాండెంట్ ఫాదర్ సగయరాజు శుక్రవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఫౌండేషన్ ద్వారా ప్రతి సంవత్సం దృష్టి లోపం ఉన్న హాస్టల్ విద్యార్థులకు రూ. 30 వేలు, ఏటా డే స్కాలర్లకు రూ. 12వేలు అందచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కర్త జి. సహాయభాస్కర్, కళాశాల అధ్యాపకులు, ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గాంధీనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఫైర్‌సేఫ్టీ ఎక్విప్‌మెంట్ సప్లయర్స్ అండ్ ఇంటిగ్రేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వి.రామాంజనేయలు, వైవీ. దుర్గారావు, ఎన్నికయ్యారు. నగరంలోని ఓ ప్రముఖ హోటల్‌లో వార్షిక కార్యవర్గ సమావేశం శుక్రవారం జరిగింది. ఉపాధ్యక్షుడిగా షేక్ పడుషా, కోశాధికారిగా ఎస్కే.నాగుల్‌మీరా, జాయింట్ సెక్రటరీగా ప్రశాంత్ అగర్వాల్ ఎన్నికయ్యారు. అసోసి యేషన్‌ను అభివృద్ధి చేయడంతో పాటు సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. మాజీ అధ్యక్ష, కార్యదర్శులు కాంతారావు, మార్కండేయులు, కార్యవర్గ సభ్యులు తదిరులు పాల్గొన్నారు.

కాల్వల మరమ్మతులకు నిధులు కేటాయించండి

గాంధీనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా డ్రెయిన్లు, చెరువుల గండ్లు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల మరమ్మతులకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1000కు పైగా ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ల్లో 540 మూతపడ్డాయన్నారు. దీర్ఘకాలిక ప్రాజెక్టుల మోజులో పడి తక్షణం పంటలు పండించడానికి ఉపయోగపడే నీటి వనరులను నిర్లక్ష్యం చేయకూడదని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన హితవు పలికారు.

ఉద్యోగుల సేవలను మెరుగుపరచాలి

దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ్ కటి



దక్షిణ మధ్యరైల్వే పీసీపీఓ సిద్ధార్థ్ కటికి సత్కారం

రైల్వేస్టేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగులకు సేవలను మెరుగు పరచాలని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ (పీసీపీఓ) సిద్ధార్థ్ కటి అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. సిద్ధార్థ్ కటి శుక్రవారం విజయవాడ డివిజన్‌ను అధికారికంగా సందర్శించారు. దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ జిల్లాకు చెందిన పర్సనల్ బ్రాంచ్ స్టాఫ్, స్కౌట్స్, గైడ్స్, సీనియర్ డీపీవో ప్రేమ్‌కుమార్ లకావత్, సిబ్బంది తదితరులు సిద్ధార్థ్ కటికి హృదయపూర్వక స్వాగతం పలికారు. ఆయన విజయవాడలోని సిబ్బంది విభాగాన్ని తనిఖీ చేశారు. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్‌తో సంభాషించారు. వారి ఫిర్యాదులను పరిశీలించారు. సిబ్బంది, సంక్షేమ సమస్యలపై ట్రేడ్ యూనియన్ల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. పరిపాలన విభాగం నుంచి పూర్తి మద్దతు ఇస్తూ, సిబ్బంది సమస్యలను సత్వర పరిష్కారానికి హామీ ఇచ్చారు. విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ నరేంద్ర ఎ పాటిల్, డివిజన్‌లోని మానవ వనరుల సంబంధిత విషయాలను చర్చించారు. అనంతరం విజయవాడ డివిజన్‌లో పర్సనల్ బ్రాంచ్ పనితీరు పై సిద్ధార్థ్ కటి సమీక్ష నిర్వహించారు.



కుట్టుమిషన్‌లు అందుకున్న మహిళలతో దాసరి శ్రీలక్ష్మి, రశ్మి తదితరులు

కుటుంబ పోషణకు మహిళల కృషి

- జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ దాసరి శ్రీలక్ష్మి

బెంజిసర్కిల్, మే 23 (ఆంధ్రజ్యోతి): మగవారికి ధీటుగా మహిళలు కుటుంబ పోషణకు తమ వంతుగా కృషిచేస్తున్నారని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ దాసరి శ్రీలక్ష్మి తెలిపారు. బెంజిసర్కిల్ నాస్తిక్ కేంద్రంలోని వాసవ్య మహిళా మండలి కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం మహిళా మండలి ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ పొందిన 13 మంది మహిళలకు దాసరి శ్రీలక్ష్మి కుట్టుమిషన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి వాసవ్య మహిళా మండలి నిర్విరామంగా చేస్తున్న కృషిని అభినందించారు. వాసవ్య మహిళా మండలి కార్యదర్శి జి. రశ్మి మాట్లాడుతూ టైలరింగ్‌లో శిక్షణ పొందినవారు ఉన్నత శిఖరాలకు చేరుకొని ఇతర మహిళలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో కె. విజయ, కోమలి, వరలక్ష్మి, హాసిని, చైతన్య పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో శ్మశానం

- చెత్త, చెట్లతో అడవిని తలపిస్తున్న వైనం
- అధికారుల నిర్లక్ష్య వైఖరితో మిగిలిన స్థలం కూడా మాయమయ్యే పరిస్థితి



రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి: ఆక్రమణకు కాదేది అనర్హం అనేటట్టు ఉంది కబ్జాదారుల తీరు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్కడ తమ పేరుతో బోర్డో, కంచె ఉండాల్సిందే.. అది గుడైనా, బడైనా, చివరికి శ్మశానమైనా. ఇదే కోవలోకి చేరింది పటమట అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన శ్మశానవాటిక. శ్మశానవాటిక చెత్త, చెట్లతో దట్టమైన అడవిని తలపిస్తోంది. దీంతో కబ్జాదారుల కన్ను శ్మశానవాటికపై పడింది. ఇప్పటికే శ్మశానంలో కొంత భాగం ఆక్రమణకు గురైంది. శ్మశానవాటిక నిర్వహణ గాలికొదిలేయడంతో చెత్త, చెట్లతో నిండి విష ప్రాణులు సంచరిస్తుండడంతో బిక్కుబిక్కుమంటూ అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తోందంటున్నారు. ఇప్పటికే శ్మశానంలో చాలా భాగం ఆక్రమణకు గురవ్వడంతో సమాధులపైనే సమాధులు నిర్మించే పరిస్థితి. శ్మశానంలో కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి శ్మశానవాటిక సంరక్షణకు నిర్వహణ చేపట్టకపోతే ఉన్న కాస్త స్థలం కూడా కబ్జాదారుల చెరలోకి వెళ్లే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మొక్కలు వాడిపోతున్నాయి

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: లయోలా కళాశాల రోడ్డులో వెటర్నరీ కాలనీ సెంటర్ నుంచి దంతవైద్యశాల సెంటర్ వరకు రోడ్డు వెంబడి మొక్కలు నాటారు. వీటి గురించి పట్టించుకోకపోవడంతో ఎన్టీఆర్ కాలనీ సమీపంలో కొన్ని మొక్కలు వాడిపోయి ఎండిపోతున్నాయి. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కృష్ణాజిల్లా పారిశ్రామికాభివృద్ధి, టీడీపీ విజయం కోసం కలిసికట్టుగా పనిచేద్దాం!



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో హాజరైన పార్టీ శ్రేణులు

- కష్టపడిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తాం
- మచిలీపట్నంలో రెండెకరాల్లో పార్టీ జిల్లా కార్యాలయం
- జిల్లా మినీ మహానాడులో మంత్రి కొల్లు రవీంద్ర
- అధికారముందని జిల్లాకు చెందిన కొందరు కంచర గాడిదలు ఇష్టానుసారం ప్రవర్తించారు
- ఇప్పుడు వారి పరిస్థితిని కళ్లారా చూస్తున్నాం: జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణాజిల్లా పారిశ్రామికాభివృద్ధి, 2029 ఎన్నికల్లో మళ్లీ టీడీపీ విజయం సాధించేందుకు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని నాయకులు, కార్యకర్తలకు మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. మచిలీపట్నంలోని ఓ ఫంక్షన్ హాలులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన జిల్లా మినీ మహానాడులో ఆయన మాట్లాడారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అక్రమ కేసులు, వేధింపులను తట్టుకుని టీడీపీ కార్యకర్తలు పార్టీని గెలిపించారని మంత్రి రవీంద్ర అన్నారు. వారి త్యాగాలకు వెలకట్టలేమన్నారు. కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పార్టీ సముచితస్థానం కల్పిస్తుందని హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటి చెబితే, ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుగువారి కీర్తి, ప్రతిష్ఠలను మరింత పెంచేలా పరిపాలన కొనసాగిస్తున్నారని అన్నారు. టీడీపీలో గతంలో పనిచేసిన ఇద్దరు నాయకులు తెలంగాణకు ముఖ్యమంత్రులయ్యారంటే అది పార్టీ గొప్పతనమని అన్నారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలోని 216 జాతీయ రహదారి వెంబడి రెండెకరాల విస్తీర్ణంలో టీడీపీ జిల్లా కార్యాలయాన్ని ఏడాదిలోగా నిర్మిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. వచ్చే ఏడాది మినీమహానాడును నూతన కార్యాలయంలో జరుపుతామని తెలిపారు. మచిలీపట్నం నియోజకవర్గంనుంచి టీడీపీ కార్యాలయానికి రూ.కోటి ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా మొత్తాన్ని సీఆర్డీఏ పరిధిలోకి తెచ్చి, మచిలీపట్నం పోర్టును గేట్‌వే ఆఫ్ అమరావతిగా తీర్చి దిద్దుతామన్నారు. 8 వేల బస్తాల బియ్యం బొక్కేసిన పేర్ని నాని నీతిసూత్రాలు చెబుతున్నాడని, మహిళలపట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వల్లభనేని వంశీకి రంగు దిగిందని, మరొకరు అనారోగ్య కారణాలు చూపి విదేశాలకు పారిపోయే ప్రయత్నాల్లో ఉన్నారని మంత్రి కొల్లు విమర్శించారు.

టీడీపీ స్థాపనకు ముందు ఢిల్లీలో శాసిస్తే..ఏపీలో పాలన సాగేది

గతంలో ఢిల్లీలో శాసిస్తే, ఆంధ్రప్రదేశ్‌లో పాలన కొనసాగేదని, ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన తరువాత తెలుగువారి ఆత్మగౌరవం వెల్లివిరిసిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. తండ్రి మరణాన్ని సాకుగా చూపి పార్టీని స్థాపించిన వైఎస్ జగన్ ఒక్క చాన్స్ ఇమ్మని ప్రజలను కోరి ఐదేళ్లపాటు చెత్తపాలన కొనసాగించారని ఆయన అన్నారు. జిల్లాకు చెందిన కొందరు కంచర గాడిదలు గతంలో అధికారంలో ఉన్నపుడు ఇష్టానుసారం ప్రవర్తించారని, ప్రజలు పక్కన పెట్టడంతో, నేడు వారి పరిస్థితి ఎలా ఉందో కళ్లారా చూస్తున్నామని ఆయన అన్నారు. రానున్న రోజులలో కృష్ణాజిల్లాను అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు భరోసా ఇచ్చారు. కార్యకర్తల కష్టాలను పాదయాత్రలో లోకేశ్ చూశారని, వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బందులపాలైన కార్యకర్తలందరినీ ఆదుకుంటున్నారని, రెడ్‌బుక్‌లోపేర్లు నమోదైన వైసీపీ నాయకులపై చట్టపరమైన చర్యలు తప్పనిసరిగా ఉంటాయని ఆయన స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్‌రాజా, వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావ్, బోడె ప్రసాద్, గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు కొనకళ్ల బుల్లయ్య, ఆళ్ల గోపాలకృష్ణ, కనపర్తి శ్రీనివాసరావు ప్రసంగించారు. జిల్లా నలుమూలల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేర్ని నానీ జైలుకెళ్లడం ఖాయం: వర్ల రామయ్య

పందికొక్కు మాదిరిగా పేదల బియ్యం బొక్కేసిన మాజీ మంత్రి పేర్ని నాని అక్రమాలు చాలా ఉన్నాయని, వాటన్నింటికి వెలికి తీస్తున్నామని, అతని నుంచి అవినీతి సొమ్మును కక్కించడంతోపాటు, జైలుకు పంపడం ఖాయమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య హెచ్చరించారు. వైసీపీ ప్రభుత్వంలో విర్రవీగి, టీడీపీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బందిపెట్టిన ఒక నాయకుడు జైలుపాలు కాగా, మరొకరు దేశాన్ని విడిచిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, మరొకరు జైలుకెళ్లడం ఖాయమని అన్నారు. జగన్‌ను నమ్ముకుని తప్పులు చేసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నేడు జైలుపాలై నేలమీద పడుకుంటున్నారని ఆయన అన్నారు.

పార్టీ కార్యాలయం నిర్మాణానికి విరాళాలు

మచిలీపట్నంలో నిర్మించనున్న టీడీపీ జిల్లా కార్యాలయానికి మచిలీపట్నం నియోజకవర్గం నుంచి మంత్రి కొల్లు రవీంద్ర కోటి రూపాయలను ప్రకటించారు. దండమూడి చిన్నా రూ.3,77,077, యార్లగడ్డ సుచిత్ర రూ.లక్ష విరాళంగా ప్రకటించారు.

తీర్మానాలు..

'మచిలీపట్నం పోర్టు పనులను త్వరితగతిన పూర్తిచేసి, పోర్టు అనుబంధ పరిశ్రమలను స్థాపించి, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి. అసైన్డ్ భూముల ఇబ్బందులకు తొలగించాలి. మచిలీపట్నం-రేపల్లె రైలుమార్గం నిర్మించాలి. మచిలీపట్నంలో రైల్వే కోచ్ తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలి. రోల్డ్‌గోల్డ్, ఆక్వా పరిశ్రమలకు చేయూతనిచ్చేలా ఆర్థికతోడ్పాటును అందించాలి. రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్పు చేయాలి. మచిలీ పట్నం-విజయవాడ జాతీయరహదారి 65ను ఆరులేన్లుగా అభివృద్ధి చేయాలి. కత్తిపూడి-ఒంగోలు జాతీయరహదారి 216ఏను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయాలి' అని జిల్లా మహానాడులో తీర్మానించారు.

చరిత్రలో మిగిలిపోయేలా కడప మహానాడు

- తరలిరావాలని పార్టీ శ్రేణులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపు

మచిలీపట్నం టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి సొంత జిల్లా కడపలో నిర్వహించే మహానాడు చరిత్రలో సువర్ణాక్షరాలతో మిగిలిపోతుందని, జగన్‌రెడ్డి చేసిన ఆకృత్యాలను బయటపెడతామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం ఆయన మినీ మహానాడు ప్రాంగణం వద్ద మీడియాతో మాట్లాడారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. జగన్‌రెడ్డి గాడ్‌ఫాదర్ కాదని, అవినీతికి పాల్పడే గాడిదలకు ఫాదర్ అని తీవ్రంగా ధ్వజమెత్తారు. బూతుల మంత్రి గతి ఏమైందో అందరికీ తెలిసిందన్నారు. జగన్‌రెడ్డి లిక్కర్ స్కాంలో రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారన్నారు. రూ. 450 కోట్లు జిల్లా అభివృద్ధికి నిధులు విడుదల చేశామన్నారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు సౌలభ్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్టీ రామారావుకు భారతరత్న ఇవ్వాలన్న డిమాండ్‌ను కడప మహానాడులో ప్రవేశపెడతామన్నారు.



ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సమక్షంలో రైతులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

ల్యాండ్ పూలింగ్ వల్ల రైతులకు నష్టం ఉండదు

- ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ భరోసా

ఇబ్రహీంపట్నం, మే 23(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీకి ల్యాండ్ పూలింగ్ విధానంలో భూములివ్వడం వల్ల రైతులకు ఎలాంటి నష్టం జరగదని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ భరోసా ఇచ్చారు. విజయవాడ కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం కలెక్టర్ జి.లక్ష్మీశ, సీఆర్డీయే అధికారులతో కలిసి ఆయన ఇబ్రహీంపట్నం మండలంలో స్పోర్ట్స్ సిటీకి ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించనున్న నాలుగు గ్రామాల రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు అయితే ఇబ్రహీంపట్నం ప్రాంతం పూర్తిగా అభివృద్ధి చెందుతుందన్నారు. మండలంలోని గ్రామాల రూపురేఖలు మారిపోతాయన్నారు. ఇప్పటికే అధికారులు గ్రామసభలు నిర్వహించారని, రైతులు చాలా మంది భూములు ఇచ్చేందుకు ఆసక్తి చూపారని తెలిపారు. ల్యాండ్ పూలింగ్ కింద భూములిస్తే రిటర్నబుల్ ప్లాట్లు పొందడంతో పాటు రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుపై కొందరు హర్షం వ్యక్తం చేశారు.

లాడ్జిలో పిస్టల్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న పిస్టల్‌ను చూపుతున్న సీఐ గిరిబాబు, ఎస్సై సత్యనారాయణ

తిరువూరు, మే 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్ జంక్షన్ సమీపంలోని ఎట్‌హోం లాడ్జిలో ఒక వ్యక్తి పిస్టల్‌తో ఉన్నట్లు శుక్రవారం మధ్యాహ్నం సమాచారం రావడంతో సీఐ గిరిబాబు, ఎస్సై కేవీజీవీ సత్యనారాయణ సోదాలు జరిపారు. ఆ వ్యక్తి నుంచి పిస్టల్ స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..లాడ్జిలో పూర్తి స్థాయిలో సోదాలు నిర్వహించామని, పిస్టల్‌తో ఉన్న వ్యక్తి మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన కొల్లి అశోక్‌గా గుర్తించామని తెలిపారు. పిస్టల్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని, అశోక్‌ను అదుపులోకి తీసుకున్నామని, పిస్టల్‌ను పరిశీలన నిమిత్తం పంపామని తెలిపారు.



వేసవి శిబిరంలో పాల్గొన్న చిన్నారులతో కలెక్టర్ లక్ష్మీశ

వేసవి శిబిరాలతో చిన్నారుల్లో మేధో వికాసం

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 23(ఆంధ్రజ్యోతి): వేసవి శిబిరాల నిర్వహణతో చిన్నారుల్లో మేధో వికాసం కలుగుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. శుక్రవారం న్యూ ఆర్టీసీ కాలనీ, మదర్‌థెరిస్సా మున్సిపల్ పార్కులో చిన్నారులకు ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిబిరాన్ని ఆయన సందర్శించారు. పేరాల అంకినీడు స్మృత్యర్థం లయన్స్‌క్లబ్ శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రోజూ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరవకు వివిధ క్రీడలతో పాటు క్విజ్, స్టోరీ టెల్లింగ్, చిత్రలేఖనం, క్రాఫ్ట్ తదితర అంశాల్లో చిన్నారులకు శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ పోటీల్లో ప్రతిభకనబరిచిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఉచిత వేసవి శిబిరం నిర్వాహకుడు సీఎంవో అధికారి డి.శ్రీనివాసన్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిపార్ట్‌మెంట్ జాయింట్ ఐజీ టి.సరోజ, వలంటీర్లు పాల్గొన్నారు.

యోగాంధ్రలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపుదాం

- ప్రజలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పిలుపు

కలెక్టరేట్, మే 23(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర మాసోత్సవాలను ఈనెల 21న రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని ఎన్టీఆర్ జిల్లాను యోగాంధ్ర కార్యక్రమంలో ప్రథమ స్థానంలో నిలుపుదామని ప్రజలకు కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాలులో అధికారులతో కలిసి థీమ్ ఆధారిత యోగాంధ్ర మాసోత్సవాలపై శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. జిల్లాలో 10 లక్షల నుంచి 15 లక్షల మందికి యోగాను నేర్పేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఇందుకోసం దాదాపు 2,500 మంది యోగా ట్రైనర్ల సేవలను ఉపయోగించుకుంటామన్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో ఏడుగురు అందుబాటులో ఉంటారని, ట్రైనర్ ఒక సెషన్‌కు 50 మందితో యోగాభ్యాసనం చేయిస్తారని తెలిపారు.

థీమ్ ఆధారిత యోగా కార్యక్రమాలు

ఈనెల 24న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో కార్యక్రమం, 25న జేఏసీ నేతలు, ప్రభుత్వ ఉద్యోగులు, 26న పోలీసు-హోంగార్డ్స్, 27న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, 28న ఆటో, లారీ డ్రైవర్లు, 29న క్రీడాకారులు, 30న కళాకారులు, 31న రైతులు, జూన్ 1న విద్యార్థులు, 2న పారిశుద్ధ్య కార్మికులు, 3న కార్మికులు, 4న మాజీ సైనికులు, 5న విభిన్న ప్రతిభావంతులు, 6న న్యాయవాదులు, 7న స్వయం సహాయక సంఘాల సభ్యులు, 8న నర్సింగ్ సిబ్బంది, 9న ఉపాధ్యాయులు, 10న ఉపాధి హామీ శ్రామికులు, 11న అంగన్‌వాడీ, హెల్త్ వర్కర్లు, 12న వైద్యులు, 13న మహిళా పారిశ్రామికవేత్తలు, 14న ఆటో టెక్నీషియన్లు, 15న మత్స్యకారులు, 16న కాలేజీ విద్యార్థులు, 17న సీనియర్ సిటిజన్స్, స్వాతంత్ర్య సమరయోధులు, 18న దేవాలయ ఉద్యోగులు, 19న ప్రభుత్వ ఆస్పత్రి ఉద్యోగులు, 20న సెలబ్రిటీలతో థీమ్ ఆధారిత 45 నిమిషాల కామన్ యోగా ప్రొటోకాల్‌తో యోగాభ్యాస కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. విజయవాడలో బీఆర్టీఎస్ రోడ్డుతో పాటు గ్రామ, మండల, డివిజన్, మున్సిపల్, జిల్లాస్థాయిలో రోజూ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గాంధీహిల్, భవానీద్వీపం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం, కొండపల్లి ఖిల్లా ప్రాంతాల్లోనూ యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మాసోత్సవాలను పురస్కరించుకుని గ్రామ, వార్డుస్థాయిలో యోగా ఫర్ ఆల్, మండల స్థాయిలో యునిటీ త్రో యోగా, జిల్లా స్థాయిలో యోగా అండ్ యూత్ ఇతివృత్తాలతో పోటీలు నిర్వహిస్తామని, జిల్లా విజేతలు రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని, విజేతలకు అవార్డులు అందజేస్తామని తెలిపారు. జిల్లా యోగాంధ్ర నోడల్ అధికారులు డాక్టర్ ఎం.సుహాసిని, డాక్టర్ జె.సుమన్ పాల్గొన్నారు.



జీజీహెచ్‌లో టాయిలెట్ల పక్కన బెడ్లపై చికిత్స పొందుతున్న రోగులు

పాపం..పేషెంట్లు!

- జీజీహెచ్ ఎముకల వార్డులో టాయిలెట్ల పక్కనే బెడ్లు
- ముక్కు మూసుకుని వైద్యం చేయించుకుంటున్న రోగులు
- సిబ్బంది నిర్వాకంపై రోగులు, బంధువుల ఆగ్రహం



(ఆంధ్రజ్యోతి-ప్రభుత్వాసుపత్రి): పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందిస్తున్న ప్రభుత్వానికి కొందరు అధికారులు, సిబ్బంది తీరు వల్ల చెడ్డ పేరు వస్తోంది. ప్రభుత్వ సర్వజనాసుపత్రిలోని ఎముకల వార్డులో రోగులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఇక్కడ అనేక సమస్యలతో రోగులు అల్లాడిపోతున్నారు. ఇక్కడున్న టాయిలెట్ల పక్కనే రోగులకు బెడ్లు వేసి వైద్యం చేస్తున్నారు. దీంతో రోగులు దుర్వాసన భరించలేకపోతున్నారు. ముక్కు మూసుకొని వైద్యం చేయించుకుంటున్నారు. వార్డు శ్లాబ్ సైతం పెచ్చులూడి మీద పడుతోంది. పట్టించుకునే నాథుడు లేడని, రోగులు, వారి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి ఉన్నతాధికారులు స్పందించి ఎముకల వార్డులో రోగులకు అవస్థలు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



రోగుల మంచం వద్ద పెచ్చులూడుతున్న శ్లాబు

నా భర్తను ఉరేసి చంపేశారు!

- న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తా
- మృతుడు నాగరాజు భార్య కనకదుర్గాభవాని
- బంధువులతో కలిసి గుడివాడలో రాస్తారోకో



ఏరియా ప్రభుత్వాస్పత్రి వద్ద రాస్తారోకో చేస్తున్న కనకదుర్గాభవాని, బంధువులు

గుడివాడ, మే 23 (ఆంధ్రజ్యోతి) : తన భర్త కుంభా నాగరాజును ఉరివేసి హత్య చేశారని, తనకు, తన పిల్లలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని మృతుడి భార్య కనకదుర్గభవాని ఆరోపించింది. కుంభా నాగరాజు, కనకదుర్గాభవాని పామర్రు కొబ్బరితోటలో నాగరాజు తల్లి ఇంట్లో నివాసముంటున్నారు. ఇటీవల నాగరాజు తన తల్లి వ్యవహార శైలి నచ్చక, పలుమార్లు మందలించాడని, 15రోజుల క్రితం తల్లి, మరో ఐదుగురు కలిసి నాగరాజుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని దుర్గాభవాని తెలిపింది. గుడివాడ ఏరియా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందాడని, గాయాలతోనే పామర్రు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆమె ఆరోపించింది. గొడవ అనంతరం నాగరాజు, తాను గుడివాడలోని తన పుట్టింట్లో ఉంటున్నామని తెలిపింది. రెండు రోజుల క్రితం కేసు పని మీద నాగరాజు పామర్రు వెళ్లాడని, శుక్రవారం ఉదయం శవమయ్యాడని, తన అత్త, అంజి, కల్యాణి, మరో ముగ్గురు కలిసి తన భర్తకు ఉరివేసి హత్య చేశారని భవాని ఆరోపిస్తోంది. పామర్రు పోలీసులు నాగరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ భవాని, ఆమె బంధువులు నెహ్రూచౌక్‌లో రాస్తారోకోకు దిగారు. భవాని, ఆమె బంధువులతో టూటౌన్ సీఐ చల్లా నాగప్రసాద్ మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు. అక్కడ నుంచి వారు బయలుదేరి ఏరియా ప్రభుత్వాస్పత్రి ఎదుట మరోసారి రాస్తారోకోకు దిగారు. టూటౌన్ సీఐ నాగప్రసాద్, పామర్రు ఎస్సై రాజేంద్రప్రసాద్‌లు కేసు నమోదు చేయడంతో రాస్తారోకో విరమించారు.

కబ్జాకు గురైన కార్పొరేషన్ స్థలానికి కొలతలు



కొలతలు వేస్తున్న కార్పొరేషన్, రెవెన్యూ సిబ్బంది

కృష్ణలంక, మే 23(ఆంధ్రజ్యోతి): 'రూ.3.50 కోట్ల విలువైన కార్పొరేషన్ స్థలం హాంఫట్' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన వార్తకు స్పందన వచ్చింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు నగరపాలక సంస్థకు చెందిన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది వచ్చి కబ్జాకు గురైన స్థలం ముందు కొలతలు తీసుకొన్నారు. అనంతరం ఆక్రమణదారుల వద్ద ఉన్న ఆధారాలను శనివారం తమకు సమర్పించాలని అన్నట్లు తెలిసింది.

కోహినూర్ వజ్రంలా జగన్ బిల్డప్!

- ఆయనొక గులకరాయి
- వైసీపీ హయాంలో అతిపెద్ద మద్యం స్కాం
- బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ

కడప మారుతీనగర్, మే 23(ఆంధ్రజ్యోతి): తానో కోహినూర్ వజ్రం అనే రీతిలో మాజీ సీఎం జగన్ బిల్డప్ ఇస్తున్నారని, కానీ ఆయన ఒక గులకరాయి వంటి వ్యక్తి అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కడపలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ హయాంలో సాగిన మద్యం మాఫియా దేశంలో మరెక్కడా జరిగి ఉండదని పేర్కొన్నారు. ఎక్కడా లేని బ్రాండ్లు తీసుకొచ్చి ప్రజల ఆరోగ్యాలను నాశనం చేశారని విమర్శించారు. డిజిటల్ పేమెంట్లు లేకుండా నేరుగా డబ్బులు దండుకున్నారని అన్నారు. వైసీపీ అనుయాయులను మద్యం దుకాణాల్లో నియమించి, విచ్చలవిడిగా వ్యాపారం చేసి, బెల్టుషాపులను ప్రోత్సహించి.. మంచినీరు దొరకని చోట కూడా మందు దొరికే విధంగా పాలన సాగించిన జగన్ ఇప్పుడు చెబుతున్న మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని మండిపడ్డారు. మద్యం స్కాంలో అరెస్టవుతున్న వాళ్లు మంచి వాళ్లని, అమాయకులని కితాబివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అమరావతి పునర్నిర్మాణాన్ని జీర్ణించుకోలేని జగన్.. అసత్యాలు వల్లె వేస్తున్నారని ఆదినారాయణరెడ్డి విమర్శించారు. వైసీపీ పాలనలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఏపీని తిరిగి గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. జగన్, కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి జైలుకెళ్లడం తథ్యమన్నారు.



గ్రీవెన్స్ డేలో అర్జీలు స్వీకరిస్తున్న సీఆర్డీయే అదనపు కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్‌చంద్

అర్జీలు సత్వరమే పరిష్కరించండి

- 'గ్రీవెన్స్ డే'లో అధికారులకు సీఆర్డీయే అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆదేశం

కలెక్టరేట్, మే 23(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని రాజధాని అమరావతి రైతులు, రైతు కూలీలు ఇచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఏపీ సీఆర్డీయే అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఆదేశించారు. తుళ్లూరులోని సీఆర్డీయే కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో నెగోషియేటెడ్ సెటిల్మెంట్ పాలసీ సంబంధిత అంశాలు, లంక భూములు, అసైన్డ్ భూముల సమస్యలపై పలువురు రైతుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. లంక, అసైన్డ్ భూముల ఫిర్యాదులపై ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా చర్యలు తీసుకుంటామని అదనపు కమిషనర్ తెలియజేశారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జి.రవీందర్, ఎం.శేషిరెడ్డి, కె.ఎస్.భాగ్యరేఖ, జి.భీమారావు, కె.స్వర్ణమేరీ, జీఆర్ఎం నోడల్ అధికారి పి.జయశ్రీ, సీఆర్డీయే డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

గ్రూపు 1 కేసు కస్టడీపై నేడు తీర్పు

విజయవాడ, మే 23 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసులో నిందితులు పీఎస్ఆర్ ఆంజనేయులు, పమిడికాల్వ మధుసూదన్‌ను కస్టడీకి ఇవ్వాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు తీర్పును శనివారానికి వాయిదా వేసింది. ఈ కేసులో ఇద్దరు నిందితులను వారం రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై వాదనలు ముగియడంతో న్యాయాధికారి దేవిక తీర్పును శనివారానికి వాయిదా వేశారు.

ఇరువర్గాల ఘర్షణ.. పది మందిపై కేసు నమోదు

పాయకాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): స్వల్ప విషయమై పరస్పరం తీవ్రస్థాయిలో దాడులకు పాల్పడిన ఇరువర్గాలపై నున్న రూరల్ పోలీసులు శుక్రవారం కేసులు నమోదు చేశారు. కూతాడి రాజేష్ రాధానగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఓ యువతి విషయమై రాజేష్‌కు సాలా మణికంఠకు ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో రాజేష్ మరో నలుగురు, సాలా మణికంఠ తరపున మరో నలుగురు మొత్తం పది మంది రెండు రోజుల క్రితం పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఇరువర్గాలకు చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పరస్పరం నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. ఇరువర్గాలకు చెందిన పది మందిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భోజన కుతూహలం

దగ్గు మందు.. కసింద

ప్రకృతి మనకు అందించిన ఔషధ సంపదలో కసింద కూడా ఒకటి. దీనినే కసివింద అని కూడా పిలుస్తారు. ఇది సాధారణంగా మనకు రోడ్ల పక్కన.. పొలాల గట్ల మీద కనిపిస్తుంది. దీనికి సంస్కృతంలో కాసమర్ద అనే పేరు కూడా ఉంది. ఈ పేరు ప్రకారం చూస్తే.. కాస అంటే దగ్గు.. మర్ద అంటే దానిని తగ్గించేది అని అర్థం. అంటే ఇది దగ్గుకు మందు. ఈ మొక్క ఆకులు కొద్దిగా చేదు, తీపి రుచులు కలిగి ఉంటాయి. ఇవి వేడి చేస్తాయి. కానీ పైత్యాన్ని తగ్గిస్తాయి. కఫం, వాతం లాంటి దోషాలను తగ్గించడంతో పాటు అజీర్తిని నరిచేస్తాయి. ముఖ్యంగా గొంతుకు ఉపశమనం ఇస్తాయి. దగ్గు, ఆయాసం లాంటి సమస్యల్ని ఉపశమింపజేస్తాయి. కసింద వేరు, ఆకుల్ని ఎండించి పొడి తయారు చేసి వెన్నతో కలిపి తామర, ఎగ్జిమా, నల్ల మచ్చలపై రాస్తే ఉపశమనం కలుగుతుంది. గాయాలు త్వరగా మానతాయి. ఈ కసింద మొక్కతో కొన్ని ప్రాంతాల్లో రకరకాల వంటలు చేస్తారు. అవేమిటో ఇప్పుడు చూద్దాం.

కసింద ఆకుల పప్పు

లేత కసింద ఆకులను తీసుకొని బాగా కడగాలి. వీటిని పెసరపప్పు లేదా కందిపప్పు, కొద్దిగా బియ్యపు పిండి వేసి ఉడికించాలి. ఈ మిశ్రమంలో నెయ్యి, వినియాల పొడితో తాలింపు పెట్టాలి. తగినంత ఉప్పు కలుపుకోవాలి. కొందరు రుచి కోసం ఆవాలు, జీలకర్ర, ఎండు మిరపకాయలతో కూడా తాలింపు పెట్టుకుంటారు.

కసింద కూర...

లేత ఆకులను 8 గంటల పాటు మజ్జిగలో నానబెట్టాలి. దీని వల్ల ఈ ఆకుల్లో ఉండే చేదు పోతుంది. ఈ ఆకులను బాగా కడిగి వాటిలో పాలు పోసి ఉడికించాలి. కూర దగ్గర పడిన తర్వాత నెయ్యి, ఇంగువ వేసి తాలింపు పెట్టాలి. కొందరు దీనిలో దోరగా వేయించిన ఉల్లిపాయలు కూడా కలుపుతారు.

కసింద తంబూళీ (చారు)

కొంకణి ప్రజలు లేత ఆకులతో చారును తయారుచేస్తారు. మామూలు పద్ధతిలోనే చారును తయారుచేసి దానిలో కసింద ఆకులను వేస్తారు. ఇది జలుబు, ఎలర్జీ, నోటిపూత, రక్తస్రావం లాంటి సమస్యల్ని తగ్గిస్తుంది. పుండ్లు, ఆపరేషన్ గాయాలు మానేందుకు ఇది ఉపయుక్తం.

కసింద- తేనె

కసింద ఆకులను తేనెలో నానబెట్టి.. వాటిని క్రమం తప్పకుండా తింటే అనేక ప్రయోజనాలు ఉంటాయి. వస్తుగుణదీపిక అనే గ్రంథంలో దీనిని "కసిందపు లవ" అని పేర్కొన్నారు.

• గంగరాజు అరుణాదేవి



రంగురంగుల స్పాంజ్‌లను ఇలా వాడాలి

మనం సాధారణంగా వంట పాత్రలు, భోజనం చేసిన కంచాలు, గ్లాసులు, ఇతర పింగాణీ వస్తువులను తోమడానికి స్పాంజ్‌లు వాడుతూ ఉంటాం. ఇవి పలు రంగుల్లో లభ్యమవుతూ ఉంటాయి. కొన్ని గరుకుగా ఉంటే మరికొన్ని మాత్రం మృదువుగా ఉంటాయి. ఏ రంగు స్పాంజ్‌తో ఎలాంటి పాత్రలను శుభ్రం చేయాలో తెలుసుకుందాం...

- మాంసాహార వంటల కోసం ఉపయోగించిన పాత్రలు, చాకులు, కటింగ్ బోర్డు తదితరాలను శుభ్రం చేయడానికి ఎరుపు లేదా గులాబీ రంగు స్పాంజ్‌ను వాడాలి. ఇవి కొద్దిగా గరుకుగా ఉంటాయి. స్పాంజ్ మీద కొద్దిగా డిష్ వాషింగ్ లిక్విడ్ వేసి తోమితే పాత్రలకు పట్టిన ఘాటైన వాసనలు తొలగిపోతాయి.
- సీసాలు, గాజు పాత్రలు, గాజు గ్లాసులను శుభ్రం చేయడానికి నీలి రంగు స్పాంజ్‌ను ఉపయోగించాలి. ఇది గట్టిగా ఉంటుంది కానీ గరుకుగా ఉండదు. దీనితో రుద్ది కడిగితే గాజు సామాన్ల మీద గీతలు పడవు.
- నాన్‌స్టిక్ పాత్రలు, పెనాలను తోమడానికి లేత పసుపు, తెలుపు రంగు స్పాంజ్‌లను వాడాలి. ఇవి మెత్తగా ఉంటాయి. వీటితో గట్టిగా తోమినప్పటికీ నాన్‌స్టిక్ వస్తువుల మీద ఉండే కోటింగ్ పోదు. గీతలు పడవు. పింగాణీతో తయారైన కప్పులు, సాసర్లు, గిన్నెలను కూడా ఈ స్పాంజ్‌లతోనే శుభ్రం చేయాలి.
- ఆకుపచ్చ, ముదురు గోధుమ రంగుల స్పాంజ్‌లు గరుకుగా గట్టిగా ఉంటాయి. వీటితో ఇత్తడి, స్టీల్, రాతెండి, అల్యూమినియం పాత్రలు, పళ్లాలను తోమవచ్చు. అడుగు మాడిన పాత్రలు, పాలు కాచిన గిన్నెలను కూడా శుభ్రం చేసుకోవచ్చు.





ప్రాణాంతకమైన గుండె సమస్యతో పుట్టిన చిన్నారులకు, వారికి చికిత్సలు చేయించే ఆర్థిక స్థోమత లేక తల్లడిల్లే తల్లిదండ్రులకు మేమున్నామంటూ భరోసా ఇస్తోంది తెలంగాణలోని కొండపాక 'ఆనందనిలయం' ఆవరణలో ఉన్న 'శ్రీ సత్యసాయి సంజీవని' ఆసుపత్రి. అన్ని సేవలూ ఉచితంగా అందిస్తున్న ఈ ఆసుపత్రి ఇప్పటివరకూ 108 మంది పిల్లలకు శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించింది.

పసి హృదయాలకు సంజీవని

నక్షత్ర... తెలంగాణలోని నారాయణపేట జిల్లా కొల్లంపల్లికి చెందిన బలికి శివకుమార్ కుమార్తె. నక్షత్రకు గుండెకు రంధ్రం ఉన్నట్టు.. ఆమె పుట్టిన 15 రోజులకే వైద్యులు నిర్ధారించారు. నాలుగేళ్ల వయసు వచ్చినా ఆమెలో ఎదుగుదల లేదు. పైగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో సతమతమయ్యేది. శస్త్రచికిత్స చేస్తే అన్నీ సర్దుకుంటాయని వైద్యులు చెప్పారు. దానికి కనీసం రూ. 5 లక్షలు కావాలి. ఆర్థిక స్థోమత లేకపోవడంతో దాని గురించి కనీసం ఆలోచించలేని దుస్థితి ఆ కుటుంబానిది. కన్నబిడ్డ పడుతున్న నరకయాతన చూడలేక, శస్త్రచికిత్స చేయించే దారి లేక వేదనలో ఉన్న ఆ కుటుంబం ముందు కాంతిరేఖలా ఆవిష్కృతమయ్యింది... 'శ్రీ సత్యసాయి సంజీవని' ఆసుపత్రి. అక్కడ ఈ నెల 13న నక్షత్ర గుండెకు సర్జరీ జరిగింది. జీవితాంతం ఆమె గుండెకు ఎలాంటి ముప్పు రాకుండా... నిపుణులైన వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. ఇప్పుడు ఆ ఆసుపత్రిలోనే నక్షత్ర కోలుకుంటోంది. ఆమెకు మాత్రమే కాదు... 45 రోజుల వయసున్న పసికందుల నుంచి పదేళ్ల పిల్లల వరకూ... వారి గుండె సమస్యలకు 'శ్రీ సత్యసాయి సంజీవని' ఆసుపత్రి పరిష్కారం చూపుతోంది.

అన్నీ ఉచితమే...

దేశంలో ఏటా 2.48 లక్షల మంది పిల్లలు పుట్టుకతోనే గుండె సమస్యలకు గురవుతున్నారని అంచనా. వారిలో 60 వేల మందికి శస్త్రచికిత్సలు అవసరం. కానీ 10 వేల మందికి మాత్రమే సర్జరీ చేసే అవకాశం ఉంది. గుండె సమస్యలతో బాధపడుతున్న ఎంతోమంది చిన్నారులు సరైన చికిత్స లేక మృతిచెందుతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించడం కోసం పలు ప్రాంతాల్లో చైల్డ్ హార్ట్‌కేర్ ఆసుపత్రులను శ్రీ సత్యసాయి సేవా సంస్థలు ప్రారంభించాయి. హరియాణా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తరువాత... 4వ 'శ్రీ సత్యసాయి సంజీవని హృదయ ఆసుపత్రి'ని సిద్దిపేట జిల్లా కొండపాక



మండల కేంద్రం శివారులోని ఆనంద నిలయం ఆవరణలో ఏర్పాటు చేశారు. లక్షల రూపాయల విలువైన శస్త్రచికిత్సలను సైతం ఈ ఆసుపత్రిలో ఉచితంగానే చేస్తారు. వైద్యపరీక్షల్లో గుండె సమస్యలు బయటపడిన చిన్నారులెవరైనా ఇక్కడకు రావచ్చు. దేశంలో ఎక్కడివారికైనా ఇక్కడ సర్జరీ చేయించుకునే అవకాశం ఉంది. ప్రాంతాలతో సంబంధం లేదు. పైరవీలు, పలుకుబడిలతో పని లేదు. ఎంతటి తీవ్రమైన గుండె సమస్యకైనా అత్యాధునిక వైద్యపరికరాల ద్వారా పరిష్కారం చూపిస్తున్నారు. పిల్లల వెంట వచ్చిన తల్లిదండ్రులు, సంరక్షకులకు ఉచితంగా భోజన, వసతి ఏర్పాట్లు కూడా ఉన్నాయి. శస్త్రచికిత్స జరిగిన పిల్లలు పూర్తిగా కోలుకునే వరకు ఇక్కడే ఉండేలా వసతులు కల్పించారు. మందులు కూడా పూర్తిగా ఉచితం. ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్, క్యాథ్‌ల్యాబ్, ఎకో పరికరాలతో ఓపీడీ భవనం, వంద పడకల భవనంతోపాటు క్రిటికల్ కేర్ యూనిట్, సర్జికల్ టీమ్ ఉన్నాయి.

వారి కృషి ఎనలేనిది...

ఈ ఆసుపత్రిని ఆనంద నిలయం ఆవరణలో నిర్మించడం వెనుక రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, టీటీడీ మాజీ ఈవో రమణాచారి ఎనలేని పాత్ర పోషించారు. ఆయన చైర్మన్‌గా వ్యవహరిస్తున్న 'ఆనంద నిలయం ట్రస్టు'కు చెందిన 100 ఎకరాల్లో ఒక చోట ఈ ఆసుపత్రిని నిర్మించాలని, ఈ ప్రాంతంలో ఆసుపత్రి ఏర్పాటు చేస్తే తెలుగు రాష్ట్రాల్లోని చిన్నారులకు ప్రయోజనం కలుగుతుందని యోచించారు. అనుకున్నదే తడవుగా 5 ఎకరాలు కేటాయించారు. పరిశోధన కేంద్రం కోసం మరో 5 ఎకరాలు ఇచ్చారు. దీనికి అప్పటి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కూడా సహకరించారు. ఈ సదుద్దేశానికి మద్దతుగా 'ఆనందనిలయం ట్రస్టు' సభ్యులు సైతం ముందుకొచ్చారు. దాంతో ఆసుపత్రి నిర్మాణాన్ని 'శ్రీ సత్యసాయి సంజీవని ట్రస్టు' చైర్మన్ శ్రీనివాస్, సభ్యులు తక్షణమే చేపట్టారు. అద్భుతంగా భవనాలు నిర్మించారు. అత్యాధునిక వైద్య పరికరాలను తెప్పించారు. పిల్లల గుండెలకు జీవం పోసే సత్కార్యానికి శ్రీకారం చుట్టారు. 2024 నవంబర్‌లో ఈ ఆసుపత్రి ప్రారంభమైంది. ఆ నెలలో 28 మందికి, ఫిబ్రవరిలో 32 మందికి, మార్చిలో 23 మందికి, ఆ తరువాత 25 మందికి... మొత్తం ఇప్పటివరకూ 108 మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేశారు.

• పైడిపల్లి అరుణ్, సిద్దిపేట
ఫొటోలు: బాబు



మానవసేవే మాధవసేవ

సత్యసాయిబాబా ఆశయాలను ఆచరిస్తూ పసి హృదయాలకు చికిత్సలు అందించే సంకల్పంతో ముందుకెళ్తున్నాం. ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది ఒక బృందంగా ఏకాగ్రతతో పని చేస్తున్నారు. హరియాణాలోని పల్వల్, ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్, ముంబయి లాంటి నగరాల్లోనే ఇప్పటివరకు 'సంజీవని హార్ట్‌కేర్ ఆస్పత్రుల'ను ఏర్పాటు చేశాం. మొదటిసారిగా గ్రామీణ ప్రాంత పిల్లల కోసం సిద్దిపేట జిల్లా కొండపాక మండల కేంద్రంలోని ఆనందనిలయాన్ని ఎంచుకున్నాం. దాన్ని అంతర్జాతీయ స్థాయి ఆసుపత్రిగా తీర్చిదిద్దాం. 'మానవసేవనే మాధవసేవ' అని సత్యసాయి అందించిన స్ఫూర్తితో సేవలు అందిస్తున్నాం.

- శ్రీనివాస్, చైర్మన్, శ్రీ సత్యసాయి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు



ఇదొక దేవాలయం

మా అబ్బాయి జగదీశ్‌ప్రసాద్‌కు పుట్టుకతోనే గుండె సమస్య ఉంది. సూర్యాపేట, ఖమ్మం, హైదరాబాద్‌లలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చూపిస్తే ఆపరేషన్ చేయించాలన్నారు. అందుకు రూ.3 నుంచి 5 లక్షల ఖర్చవుతుందని చెప్పారు. దిక్కుతోచని స్థితిలో ఉండగా... ఇక్కడ ఆస్పత్రి ఉందని తెలిసి వచ్చాం. వెంటనే అడ్మిట్ చేసుకొని ఉచితంగా సర్జరీ చేశారు. మా బాబుతో పాటు మాకు కూడా వసతి, భోజనం కల్పిస్తున్నారు. వారి రుణం తీర్చుకోలేనిది. అందుకే ఇది కేవలం ఆసుపత్రి కాదు, ఇదొక దేవాలయం.

- సుజాత, భీమ్లాతండా, సూర్యాపేటజిల్లా



మూడో బిడ్డను దక్కించుకోగలిగాం

గతంలో మా ఇద్దరు పిల్లలు అనారోగ్య సమస్యలతో చనిపోయారు. మూడో అబ్బాయి జహంగీర్‌కు ఇప్పుడు మూడు సంవత్సరాలు. పుట్టిన కొద్దిరోజులకే తనకు గుండెకు సంబంధించిన వ్యాధి ఉందని తేలింది. ఆపరేషన్ చేయించాలంటేనే భయం వేసింది. ఒకరోజు సినీనటుడు సుమన్‌కు తాత్కాలికంగా కారు డ్రైవర్‌గా వెళ్లాను. ఆ సమయంలో సుమన్ ఈ ఆసుపత్రి వారితో ఫోన్లో మాట్లాడడం గమనించి, నా మా అబ్బాయి సమస్య గురించి చెప్పాను. వెంటనే ఆయన ఆసుపత్రి నిర్వాహకుడు జగన్నాథశర్మతో మాట్లాడారు. మా అబ్బాయిని తీసుకువెళ్లగానే... సర్జరీ చేసి బ్రతికించారు. సుమన్‌కు, శ్రీసత్యసాయి సంజీవని వైద్యులకు కృతజ్ఞతలు.

- షరీఫ్, చాంద్రాయణగుట్ట

నోరూరించే మామిడి రుచులు



మామిడి పండును గానీ కాయను గానీ చూడగానే నోరూరని వారుండరు. తియ్యటి మామిడి పండ్లతో జ్యూస్, మిల్క్‌షేక్, ఐస్‌క్రీమ్ లాంటివి తయారుచేస్తూ ఉంటాం. అలాగే పుల్లటి మామిడి కాయలతో ఆవకాయ, మాగాయ లాంటి ఊరగాయలతోపాటు రకరకాల పచ్చళ్లు పెట్టేస్తూ ఉంటాం. ఇవికాక మామిడితో తయారు చేసే విభిన్న వంటకాలు మీ కోసం...



మామిడిపండు సలాడ్

కావాల్సిన పదార్థాలు

- మామిడి పండు- ఒకటి, ఉల్లిపాయ- ఒకటి, పాలకూర- ఒక కట్ట, ఎర్రటి క్యాప్సికమ్- ఒకటి, కొత్తిమీర- ఒక కట్ట, కీరా- ఒకటి, ఉప్పు- చిటికెడు, సలాడ్ ఆయిల్- రెండు చెంచాలు, నిమ్మకాయ- ఒకటి, మిరియాల పొడి- చిటికెడు

తయారీ విధానం

- మామిడి పండును శుభ్రంగా కడిగి తొక్క తీసి పెద్ద ముక్కలుగా కోయాలి. ఉలిపాయ, పాలకూర, కొత్తిమీరలను నీళ్లతో శుభ్రం చేసి సన్నగా తరగాలి. కీరా, క్యాప్సికమ్‌లను కూడా కడిగి ముక్కలుగా కోయాలి.
- ఒక వెడల్పాటి గిన్నె తీసుకుని అందులో మామిడి పండు, కీరా, క్యాప్సికమ్, ఉల్లిపాయల ముక్కలు; పాలకూర, కొత్తిమీరల తరుగు; ఉప్పు, మిరియాల పొడి; నిమ్మరసం, సలాడ్ ఆయిల్ వేసి బాగా కలపాలి. పైన కొద్దిగా కొత్తిమీర తరుగు చల్లి సర్వ్ చేయాలి.

జాగ్రత్తలు

- మరీ పండిన మామిడి పండు కాకుండా కొద్దిగా గట్టిగా ఉన్నదాన్ని ఎంచుకుంటే సలాడ్ తినడానికి బాగుంటుంది.
- మామిడి, కీరా, క్యాప్సికమ్, ఉల్లిపాయలను పొడవాటి ముక్కలుగా కోసుకుంటే సలాడ్ రుచి పెరుగుతుంది.
- ఈ సలాడ్‌లో ఒక చెంచా నువ్వులు కలుపుకోవచ్చు

మామిడికాయ మాంసం

కావాల్సిన పదార్థాలు

- పుల్లటి మామిడికాయ- ఒకటి, మటన్- అర కిలో, ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, టమాటాలు- రెండు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, మిరియాల పొడి- అర చెంచా, గరం మసాలా పొడి- ఒక చెంచా, కారం- ఒక చెంచా, ఉప్పు- తగినంత, జీలకర్ర పొడి- పావు చెంచా, ధనియాల పొడి- అర చెంచా, నూనె- నాలుగు చెంచాలు, పుదీనా ఆకులు- అయిదు

జాగ్రత్తలు

- మటన్ ముక్కలను కుక్కర్‌లోనే మెత్తగా ఉడికించాలి.
- కూర ఉడుకుతున్నప్పుడు.... కొద్దిగా కార్న్‌ఫ్లోర్ లేదా బియ్యప్పిండి కలిపిన నీళ్లు పోస్తే గ్రేవీ చిక్కగా వస్తుంది.
- మామిడికాయ పులుపును అనుసరించి ఉప్పు, కారం సరి చేసుకోవాలి.

తయారీ విధానం

- మటన్ ముక్కలను శుభ్రం చేసి కుక్కర్‌లో వేయాలి. ఒక గ్లాసు నీళ్లు పోసి ఆరు విజిల్స్ వచ్చే వరకూ ఉడికించాలి. టమాటాలను కడిగి ముక్కలుగా కోసి మిక్సీలో వేసి పేస్టు చేయాలి. మామిడికాయను కడిగి తొక్క తీసి ముక్కలు కోయాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి కలిపి రెండు నిమిషాలు వేగనివ్వాలి. తరవాత టమాటా పేస్టు, మిరియాల పొడి, గరం మసాలా పొడి, కారం, ఉప్పు, జీలకర్ర పొడి, ధనియాల పొడి వేసి బాగా కలపాలి. ఇవి అయిదు నిమిషాలు మగ్గిన తరవాత మామిడికాయ ముక్కలు వేసి కలిపి మూతపెట్టి నాలుగు నిమిషాలు ఉడికించాలి. తరవాత మూత తీసి ముందుగా ఉడికించుకున్న మటన్ ముక్కలు వేసి కలిపి చిన్న మంటమీద పది నిమిషాలు మగ్గించాలి. కూర దగ్గరకు వచ్చిన తరవాత స్టవ్ మీద నుంచి దించి పుదీనా ఆకులు చల్లి సర్వ్ చేయాలి.



మామిడి పండు పాయసం

కావాల్సిన పదార్థాలు

- మామిడి పండ్లు- నాలుగు, సగ్గుబియ్యం- ఒక కప్పు, పంచదార- రెండు కప్పులు, పాలు- అయిదు కప్పులు, కోవా- అర కప్పు, పిస్తా పలుకులు- రెండు చెంచాలు, బాదం పలుకులు- రెండు చెంచాలు, నెయ్యి- రెండు చెంచాలు

తయారీ విధానం

- మామిడి పండ్లను కడిగి తొక్క తీయాలి. ఒక పండును చిన్న ముక్కలుగా కోసి పక్కన పెట్టాలి. మిగిలిన పండ్లను కూడా ముక్కలుగా కోసి మిక్సీలో వేసి గుజ్జులా చేయాలి. సగ్గుబియ్యాన్ని రెండు గంటలపాటు నీళ్లలో నానబెట్టాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నెయ్యి వేసి వేడిచేయాలి. తరవాత పాలు పోసి పంచదార, కోవా, నానబెట్టిన సగ్గుబియ్యం వేసి బాగా కలపాలి. సగ్గుబియ్యం మెత్తగా ఉడికేవరకూ గరిటెతో తిప్పుతూనే ఉండాలి. తరవాత మామిడిపండ్ల గుజ్జు వేసి కలపాలి. ఒక నిమిషం తరవాత స్టవ్ మీద నుంచి దించి పైన మామిడిపండు ముక్కలు, పిస్తా పలుకులు, బాదం పలుకులు చల్లి సర్వ్ చేయాలి.

జాగ్రత్తలు

- సగ్గుబియ్యాన్ని ముందుగా ఉడికించి మరుగుతున్న పాలలో కలిపితే సమయం కలిసి వస్తుంది.
- కోవా దొరకని పక్షంలో నాలుగు చెంచాల మిల్క్‌మెయిడ్ కలుపుకోవచ్చు. కానీ పంచదార కొద్దిగా తగ్గించి వేసుకోవాల్సి ఉంటుంది.



వంటిల్లు



వెంకట్ యాదవ్
చెఫ్, గోల్కొండ హోటల్, హైదరాబాద్.

మేకప్

చర్మం పొడిబారిపోకుండా తేమను నిలిపి ఉంచే మేకప్ ఉత్పత్తులను ఎంచుకోవాలి. మరీ ముఖ్యంగా పొడి వాతావరణంలో తాజాగా కనిపించడం కోసం ప్రత్యేకమైన జాగ్రత్తలు పాటించాలి.

తేమతో... తాజాగా...

ఫేస్‌వాష్: చర్మంలో మిగిలి ఉన్న తేమను వదిలించే సబ్బులకు బదులుగా విటమిన్‌సిని కలిగి ఉండే ఫేస్‌వాష్ ఎంచుకోవాలి. దీంతో చర్మంలోని మలినాలు తొలగడంతో పాటు చర్మపు తేమ భద్రంగా ఉంటుంది. ఫేస్‌వాష్‌తో ముఖం శుభ్రం చేసుకున్న తర్వాత, అదనపు తేమ కోసం హైడ్రేటింగ్ సీరమ్‌ను పూసుకోవాలి. తర్వాత ప్రైమర్‌ను ముఖానికి అద్దుకుని, ఆ తర్వాతే మేకప్ వేసుకోవడం మొదలుపెట్టాలి.

ఫౌండేషన్: తేమను కలిగి ఉండే ఫౌండేషన్‌ను ఎంచుకుంటే, ముఖం మరింత పొడిబారకుండా ఉంటుంది. అలాగే దీన్ని ముఖానికి పూసుకోవడం కోసం తడిపి పిండిన స్పాంజి వాడుకోవాలి. ఫౌండేషన్‌లో కొద్దిగా ఫేసియల్ నూనెను కలిపి ముఖం మీద సమంగా అద్దుకోవాలి.



ఉత్పత్తులు: పౌడర్ ఆధారిత ఉత్పత్తులకు బదులుగా క్రీమ్ ఆధారిత ఉత్పత్తులకే ప్రాధాన్యం ఇవ్వాలి. ఇవైతే చర్మంలో చక్కగా ఇంకిపోయి, చక్కని మెరుపునూ, మృదుత్వాన్నీ ఇస్తాయి.

ఐ మేకప్: కళ్ల చుట్టూ ముడతలు, వలయాలను కనిపించకుండా చేయడం కోసం, వీలైనంత తక్కువ ఫౌండేషన్ అద్దుకోవాలి. దీన్లో కాస్త ముదురు రంగు బ్లష్‌ను కలిపి కనురెప్పల దిగువన అద్దుకుంటే కళ్ల కింద నలుపు చర్మంలో కలిసిపోతుంది. కనురెప్పల పైన వేసుకునే ఐషాడో కూడా లేత రంగులో క్రీమ్ ఆధారితమైనదై ఉండేలా చూసుకోవాలి.

లిప్‌స్టిక్: లిప్‌స్టిక్ వేసుకునే ముందు పెదవుల మీద మృతకణాలను తొలగించి, తేమ కోసం అదనపు ఉత్పత్తులు వాడుకోవాలి. ఇలా పెదవులను మృదువుగా మార్చుకున్న తర్వాత లిప్‌స్టిక్ వేసుకుంటే, పెదవులు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. పెదవుల పగుళ్లు కూడా దూరమవుతాయి.

సెట్టింగ్ పౌడర్: మేకప్ పూర్తయిన తర్వాత, ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉండడం కోసం సెట్టింగ్ పౌడర్‌ను అద్దుకోవాలి.

హెయిర్ స్ప్రే: గాలులకు తలకట్టు చెదిరిపోకుండా ఉండడం కోసం, సెట్టింగ్ స్ప్రే వాడుకోవచ్చు. అయితే తలకు నాలుగు అంగుళాల దూరం నుంచే స్ప్రే చేసుకుని, వెంట్రుకలను సెట్ చేసుకోవాలి.

రూ.2.69 లక్షల కోట్ల డివిడెండ్

- ప్రభుత్వానికి ఆర్‌బీఐ భారీ నజరానా
- రికార్డు స్థాయిలో చెల్లింపులు
- 2024-25లో 27.4% పెరిగిన డివిడెండ్
- కలిసొచ్చిన ఫారెక్స్ లావాదేవీలు



ముంబై: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కేంద్ర ప్రభుత్వానికి భారీ నజరానా ప్రకటించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రికార్డు స్థాయిలో రూ.2,68,590.07 కోట్ల భారీ డివిడెండ్ ప్రకటించింది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ (సీబీడీ) ఈ మేరకు సిఫారసు చేసింది. ఈ నెల 15న జరిగిన సీబీడీలో ఆమోదించిన ఎకనామిక్ క్యాపిటల్ ఫ్రేమ్‌వర్క్ (ఈసీఎఫ్) ఆధారంగా ఆర్‌బీఐ ఈ మొత్తాన్ని నిర్ణయించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) చెల్లించిన రూ.2.1 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 27.4 శాతం ఎక్కువ. అయితే మార్కెట్ వర్గాలు అంచనా వేసిన రూ.3 లక్షల కోట్ల కంటే ఇది తక్కువే. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆర్‌బీఐ, ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) డివిడెండ్ రూపంలో రూ.2.56 లక్షల కోట్లు సమకూరే అవకాశం ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. అయితే ఆర్‌బీఐ ఒక్కటే ఇందులో రూ.2,68,590 కోట్లు సమకూర్చడం విశేషం. దీంతో డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో ఎదురవుతున్న ఆర్థిక అనిశ్చితిని, భారత-పాక్ ఘర్షణలతో పెరగనున్న రక్షణ బడ్జెట్ కేటాయింపుల భారాన్ని కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొంటుందని భావిస్తున్నారు. అయితే ప్రస్తుత ఆర్థిక అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని కంటిజెంట్ రిస్క్ బఫర్ (సీఆర్‌బీ) లెవల్‌గా పిలిచే ఈక్విటీ మూలధనాన్ని.. ఆర్‌బీఐ తన ఆస్తి-అప్పుల పట్టిక (బ్యాలెన్స్ షీట్)లో 6.5 శాతం నుంచి 7.5 శాతానికి పెంచింది.

ఆదాయం ఇలా

దేశ, విదేశీ రుణ పత్రాల పెట్టుబడులపై లభించే వడ్డీ, తన సేవలపై వసూలు చేసే రుసుములు, కమీషన్లు, విదేశీ మారక ద్రవ్య లావాదేవీల (ఫారెక్స్)పై వచ్చే లాభం, అనుబంధ సంస్థల నుంచి లభించే ప్రతిఫలం రూపంలో ఆర్‌బీఐకి ఏటా ఆదాయం వస్తుంది. ఇందులోంచి కరెన్సీ నోట్ల ముద్రణ, డిపాజిట్లు, రుణాలపై వడ్డీ చెల్లింపులు, ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్లు, నిర్వహణ ఖర్చులు, తరుగుదల కేటాయింపులతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక వ్యవస్థను ఆదుకునేందుకు కంటిజెంట్ రిస్క్ బఫర్ (సీఆర్‌బీ) లెవల్ రూపంలో కొంత మొత్తాన్ని ఉంచుకుని మిగిలిన మొత్తాన్ని ఏటా డివిడెండ్ రూపంలో కేంద్ర ప్రభుత్వానికి చెల్లిస్తుంది. గత ఆర్థిక సంవత్సరం ఆర్‌బీఐ ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌ను రూ.83-84 మధ్య కొని రూ.84-87 మధ్య విక్రయించడం లాభాలను బాగా పెంచింది.



జలాన్ ఫార్ములాలో సవరణ

ఖర్చులు పోను తన మిగులు ఆదాయంలో ఎంత మొత్తాన్ని ఆర్‌బీఐ డివిడెండ్ రూపంలో ప్రభుత్వానికి బదిలీ చేయాలనే దానిపై మాజీ గవర్నర్ బిమల్ జలాన్ నేతృత్వంలోని కమిటీ 2019లో చేసిన సిఫారసులను ఆర్‌బీఐ ఇప్పటికీ అనుసరిస్తోంది. ఈ సిఫారసులు ఇప్పటికీ వర్తిస్తాయని ఆర్‌బీఐ వర్గాలు చెప్పాయి. అయితే అవసరాన్ని బట్టి కంటిజెన్సీ రిస్క్ బఫర్ (సీఆర్‌బీ) శాతంలో కొద్దిపాటి మార్పులు చేర్పులు తప్పవని స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఇప్పటి వరకు 6.5 శాతంగా ఉన్న సీఆర్‌బీని 7.5 శాతానికి పెంచుతూ ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ నిర్ణయం తీసుకుంది.

పీఆర్‌బీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

దేశంలో చెల్లింపుల వ్యవస్థను క్రమబద్ధీకరించేందుకు ఆర్‌బీఐ సిద్ధమైంది. ఇందు కోసం ఆరుగురు సభ్యులతో పేమెంట్స్ రెగ్యులేటరీ బోర్డు (పీఆర్‌బీ) ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న బోర్డు ఫర్ రెగ్యులేషన్ అండ్ సూపర్‌విజన్ ఆఫ్ పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్ (బీపీఎస్ఎస్) స్థానంలో ఈ బోర్డు ఏర్పాటు కానుంది. ఈ బోర్డుకు ఆర్‌బీఐ గవర్నర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఆర్‌బీఐ నుంచి గవర్నర్‌తో సహా ముగ్గురు, కేంద్ర ప్రభుత్వం నామినేషన్ చేసే ముగ్గురు సభ్యులు ఈ బోర్డులో సభ్యులుగా ఉంటారు. ఈ బోర్డు ఏడాదికి కనీసం రెండు సార్లు భేటీ అవుతుందని ఆ నోటిఫికేషన్‌లో తెలిపారు. దేశంలో చెల్లింపుల వ్యవస్థ పనితీరును పర్యవేక్షించడంతో పాటు ఈ బోర్డు అవసరమైతే నియంత్రిస్తుంది.

పెరిగిన జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ నష్టాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ (జీఏఎల్).. గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.253 కోట్ల నికర నష్టాలను ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నష్టం రూ.168 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం మాత్రం రూ.2,570 కోట్ల నుంచి రూ.2,977 కోట్లకు పెరిగింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ నికర నష్టం రూ.829 కోట్ల నుంచి రూ.817 కోట్లకు తగ్గింది. ఢిల్లీ, హైదరాబాద్, మోపా (గోవా) విమానాశ్రయాలతో పాటు ఇండోనేషియాలో మేడన్ విమానాశ్రయాన్ని జీఏఎల్ నిర్వహిస్తోంది.

ఎంటార్ లాభం రూ.14 కోట్లు

ఎంటార్ టెక్నాలజీస్ (ఎంటీఏఆర్) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.183.10 కోట్ల ఆదాయంపై రూ.13.7 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.4.9 కోట్లు) తో పోల్చితే లాభం ఏకంగా 182.7 శాతం వృద్ధి చెందింది. మార్చితో ముగిసిన పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను రూ.676 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.52.9 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసినట్లు ఎంటార్ తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	530
వరంగల్	502	గోదావరి	517
చిత్తూరు	603	విశాఖపట్నం	545

దజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	119
వరంగల్	120	గుంటూరు	122
కరీంనగర్	120	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	111
కర్నూలు	120	నెల్లూరు	116
విశాఖపట్నం	116	అనంతపురం	116
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,530 ▼	89,400 ▼	1,11,000 ▼
విజయవాడ	99,000 ▲	93,000 ▲	99,900 ▲
విశాఖపట్నం	99,600 ▲	89,400 ▼	1,11,000 ▼
రాజమండ్రి	97,530 ▼	89,400 ▼	1,01,000 ▼
ప్రొద్దుటూరు	96,200 ▼	88,500 ▼	99,200 ▼
ముంబై	95,471 ▼	87,451 ▼	96,909 ▲

మళ్లీ లాభాల్లోకి

సెన్సెక్స్ 770 పాయింట్లు అప్

ముంబై: అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో భారీ ఊగిసలాట ధోరణిలో ట్రేడవుతున్న ఈక్విటీ మార్కెట్ శుక్రవారం లాభాల బాట పట్టింది. మార్కెట్ ఫ్లాట్‌గానే ప్రారంభమైనా రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ వంటి బ్లూచిప్ షేర్లలో జరిగిన భారీ కొనుగోళ్ల ఈక్విటీ సూచీలను పరుగులు తీయించాయి. అమెరికన్ బాండ్లపై వడ్డీ రేట్లు తగ్గడంతో పాటు ప్రభుత్వానికి ఆర్‌బీఐ రికార్డు డివిడెండ్ అందిస్తోందన్న వార్తలు సెంటిమెంట్ బలపడడానికి దోహదపడ్డాయి. సానుకూల వార్తల ప్రభావంతో సెన్సెక్స్ ఒక దశలో 953.18 పాయింట్ల లాభంతో 81,905.17 పాయింట్ల ఇంట్రాడే గరిష్ఠ స్థాయిని తాకింది. తదుపరి క్రమంలో కొంతమేరకు దిగజారినా చివరికి 769.09 పాయింట్ల లాభంతో 81,721.08 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 243.45 పాయింట్లు లాభపడి 24,853.15 వద్ద ముగిసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 609.51 పాయింట్లు, నిఫ్టీ 166.65 పాయింట్లు నష్టపోయాయి.

స్కోడా ట్యూబ్స్ ఇష్యూ ధర రూ.130-140: స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యూబ్స్ తయారీ సంస్థ స్కోడా ట్యూబ్స్ ఐపీఓ ఈనెల 28 ప్రారంభమై 30న ముగియనుంది. షేరు ధరల శ్రేణిని రూ.130-140గా ప్రకటించింది. కాగా ఐపీఓ ద్వారా నిధుల సమీకరణకు అనుమతి కోరుతూ కనోడియా సిమెంట్ సెబీకి దరఖాస్తు చేసింది

వచ్చే రెండేళ్లలో రూ.130 కోట్ల పెట్టుబడులు

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వచ్చే రెండు, మూడేళ్ల కాలంలో రూ.130 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ (ఎస్‌జీఎల్‌టీఎల్) ప్రకటించింది. ప్రతిపాదిత పెట్టుబడులతో అధిక విలువ కలిగిన అవకాశాలను దక్కించుకోవటంతో పాటు ప్రొడక్ట్ ఇన్నోవేషన్ సహా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆటోమేటెడ్, మెకనైజ్డ్ ఫ్యాబ్రికేషన్ లైన్స్‌ను అప్‌గ్రేడ్ చేయనున్నట్లు తెలిపింది. అలాగే ప్రస్తుతమున్న 60 టన్నుల క్రేన్, 60 ఎంఎం థిక్‌నెస్ ఫ్యాబ్రికేషన్‌ను 100 టన్నుల క్రేన్, 100 ఎంఎం ఫ్యాబ్రికేషన్‌కు విస్తరించనున్నట్లు వెల్లడించింది.

క్యూ4 లాభం రూ.16 కోట్లు: మార్చితో ముగిసిన చివరి త్రైమాసికాని (క్యూ4) గాను కంపెనీ నికర లాభం 3 శాతం వృద్ధి చెంది రూ.16 కోట్లుగా నమోదైంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం కూడా 19.7 శాతం వృద్ధితో రూ.171 కోట్లకు చేరుకుందని తెలిపింది. మార్చి త్రైమాసికంలో విదేశీ కస్టమర్ల నుంచి ఎగుమతి లైసెన్స్ సహా తుది అనుమతులు అందుకోవటంలో జాప్యం ఎదురుకావటంతో ఆర్డర్ నిలిచిపోయిందని, అయితే ఈ ఆర్డర్‌ను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పూర్తి చేయవచ్చని అంచనా వేస్తున్నట్లు ఎస్‌జీఎల్‌టీఎల్ పేర్కొంది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను రూ.626 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.69 కోట్ల నికర లాభాన్ని కంపెనీ నమోదు చేసింది.



సుజుకీ తొలి ఈవీ 'ఈ-యాక్సెస్'

ముంబై: సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా.. తొలి ఎలక్ట్రిక్ స్కూటర్ 'ఈ-యాక్సెస్' ఉత్పత్తిని ప్రారంభించినట్లు ప్రకటించింది. గురుగ్రామ్ ప్లాంట్‌లో ఈ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను కంపెనీ ఉత్పత్తి చేస్తోంది. ఈ స్కూటర్‌ను కంపెనీ ఇటీవల ఢిల్లీలో జరిగిన భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో-2025లో ప్రదర్శించింది. లిథియం-అయాన్-ఫాస్ఫేట్ బ్యాటరీ, రీజెనరేటివ్ బ్రేకింగ్ సిస్టమ్, మెయింటెనెన్స్- ఫ్రీ బెల్ట్ డ్రైవ్ సిస్టమ్ సహా రివర్స్ మోడ్ వంటి ఇతర అత్యాధునిక ఫీచర్లతో ఈ స్కూటర్‌ను తీసుకువచ్చింది.

అమెరికా సుంకాల పోటుతో తిప్పలే

విప్రో

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు, వలస విధానాలపై దేశీయ ఐటీ దిగ్గజం విప్రో ఆందోళన వ్యక్తం చేసింది. ఇవి అమల్లోకి వస్తే ఐటీ కంపెనీల ఆదాయాలు, వ్యాపారాలకు ముప్పు తప్పదని హెచ్చరించింది. తన తాజా వార్షిక నివేదికలో కంపెనీ ఈ విషయం పేర్కొంది. అమెరికాతో పాటు యూరప్‌లోనూ వాణిజ్య రక్షణ విధానాలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేసింది. విప్రో ఆదాయంలో 62.3 శాతం అమెరికా నుంచి 27 శాతం యూరప్ నుంచి వస్తోంది. దీంతో ఈ రెండు మార్కెట్లలో ఎలాంటి అపశృతులు ఏర్పడినా తమ ఆదాయాలు, లాభాలపై ప్రభావం తప్పదని స్పష్టం చేసింది. వీసాల జారీని ట్రంప్ సర్కారు కఠినం చేయడంతో ఆ దేశంలోని తమ యూనిట్లలో స్థానికుల నియామకాలు పెంచినట్టు తెలిపింది.

రెట్టింపైన ఛైర్మన్ జీతం : మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో విప్రో ఛైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ జీతం రెట్టింపైంది. 2023-24లో రూ.6.4 కోట్లుగా ఉన్న ఆయన జీతం 2024-25లో రూ.13.7 కోట్లకు చేరింది. కంపెనీ తాజా వార్షిక నివేదిక ఈ విషయం వెల్లడించింది. అయితే ఇది విప్రో సీఈఓ, ఎండీ శ్రీనివాస్ పలియా జీతం రూ.53.64 కోట్ల కంటే తక్కువే.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్

	వేదిక
పంజాబ్ x ఢిల్లీ	జైపూర్, రా.7.30 నుంచి




షమికి చోటు కష్టమే

గిల్‌కే కెప్టెన్సీ.. పంత్‌నకు డిప్యూటీ

నేడు టీమిండియా టెస్టు జట్టు ప్రకటన

న్యూఢిల్లీ: స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లేకుండా భారత టెస్టు జట్టు ప్రయాణం మొదలుకానుంది. ఈ ఇద్దరు అనుభవజ్ఞుల రిటైర్మెంట్ తర్వాత తొలిసారి భారత సెలెక్టర్లు జట్టును ప్రకటించనున్నారు. ఇంగ్లండ్‌తో జూన్ 20 నుంచి జరుగనున్న ఐదు టెస్టుల సిరీస్ కోసం శనివారం ఆటగాళ్ల జాబితాను వెల్లడించనున్నారు. ప్రస్తుత సంధి దశను అధిగమించేందుకు జట్టు కూర్పు ఎలా ఉండబోతున్నదేది ఆసక్తికరంగా మారింది. అయితే కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ వైపే మొగ్గుచూపే అవకాశం ఉంది. అతడికి పోటీగా ఉన్న రిషభ్ పంత్‌ను వైస్‌కెప్టెన్‌గా నియమించవచ్చు. వాస్తవానికి ఇన్నాళ్లు రోహిత్‌కు డిప్యూటీగా ఉన్న బుమ్రాను సారథిగా నియమించాలనుకున్నా అతడి ఫిట్‌నెస్, పనిభారం కారణంగా సెలెక్టర్లు యువ ఆటగాడి వైపు మొగ్గు చూపాలనుకుంటున్నారు. ఇక సీనియర్ పేసర్ మహ్మద్ షమి ఈ టూర్‌కు వెళ్లడం సందేహంగా మారింది. టెస్టుల్లో తనకు సుదీర్ఘ స్పెల్స్ వేసే ఫిట్‌నెస్ లేదని బీసీసీఐ వైద్య బృందం చెప్పినట్టు సమాచారం. ఒకవేళ షమీని పక్కనబెడితే అతడి స్థానంలో అర్ష్‌దీప్ సింగ్‌కు చాన్స్ ఉంటుంది. అలాగే బుమ్రా కూడా అన్ని టెస్టులు ఆడే అవకాశం కనిపించడం లేదు. బ్యాటింగ్‌లో కరుణ్ నాయర్, సాయి సుదర్శన్‌లకు చోటు దక్కవచ్చని సమాచారం. అయితే శ్రేయాస్ అయ్యర్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది వేచిచూడాల్సిందే.



వావ్.. శ్రీకాంత్

'మలేసియా మాస్టర్స్'లో సెమీస్‌కు

కౌలాలంపూర్: కొన్నాళ్లుగా ఫామ్‌లేమితో సతమతమవుతున్న సీనియర్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ ఎట్టకేలకు గాడిలో పడ్డాడు. దాదాపు ఏడాదికాలం తర్వాత తొలిసారిగా ఓ టోర్నీలో సెమీఫైనల్ చేరాడు. మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ క్వార్టర్‌ఫైనల్లో శ్రీకాంత్ 24-22, 17-21, 22-20తో తనకంటే ఎన్నోరెట్లు మెరుగైన ప్రపంచ 18వ ర్యాంకర్ తోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్)పై పోరాడి గెలుపొందాడు. గంటా 14 నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో తొలిగేమ్ నెగ్గి, రెండో గేమ్ ఓడిన శ్రీకాంత్.. నిర్ణాయక గేమ్‌లో మాత్రం అద్భుత ప్రదర్శనతో పైచేయి సాధించాడు. ఈ బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఈవెంట్‌లో క్వాలిఫయర్స్ ద్వారా అడుగుపెట్టిన శ్రీకాంత్ వరుసగా ఐదు మ్యాచ్‌లు గెలిచి టైటిల్‌కు చేరువవడం విశేషం. ఫైనల్ బెర్త్ కోసం జపాన్ షట్లర్ యుషి తనకతో శ్రీకాంత్ అమీతుమీ తేల్చుకోనున్నాడు. ఇక, మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడీ ధ్రువ్ కపిల/తనీషా క్రాస్టో పోరాటం ముగిసింది. క్వార్టర్‌ఫైనల్లో ధ్రువ్ ద్వయం 22-24, 13-21తో చైనాకు చెందిన టాప్‌సీడ్ జియాంగ్ జెన్ బాంగ్/వీ యా గ్జిన్ చేతిలో పరాజయం పాలైంది.

నీరజ్‌కు రెండోస్థానం



హాజో (పోలెండ్): ఇటీవల దోహా డైమండ్ లీగ్‌లో 90 మీటర్ల దూరాన్ని అధిగమించి చిరకాల స్వప్నాన్ని సాకారం చేసుకున్న భారత జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా.. తన తదుపరి ఈవెంట్‌లోనూ సత్తా చాటాడు. ఓర్లెన్ జానుజ్ కుసోసిన్స్కీ మెమోరియల్ అథ్లెటిక్స్ మీట్‌లో భాగంగా శుక్రవారం ఇక్కడ జరిగిన పోటీలో నీరజ్ రెండోస్థానంలో నిలిచాడు. నీరజ్ జావెలిన్‌ను 84.14 మీటర్ల దూరం విసిరాడు. మొదటి ప్రయత్నంలో ఫౌల్ చేసిన చోప్రా, రెండో ప్రయత్నంలో 81.28 మీటర్లు విసిరాడు. తర్వాత రెండు ఫౌల్స్ చేసిన నీరజ్ ఐదో యత్నంలో 81.80 మీటర్లు, ఆ తర్వాత చివరగా 84.14 మీటర్లతో సరిపెట్టుకున్నాడు. దోహా డైమండ్ లీగ్‌లో అగ్రస్థానంలో నిలిచిన జర్మనీ స్టార్ జులియన్ వెబర్ ఇక్కడా అదేజోరు చూపి ప్రథమస్థానం దక్కించుకున్నాడు. 86.12 మీటర్లతో వెబర్ టాప్‌లో నిలవగా.. పీటర్స్ అండర్సన్ (గ్రెనెడా) 83.24 మీటర్లతో మూడోస్థానానికి పరిమితమయ్యాడు.

ఆ ఇద్దరి స్థానాల భర్తీ కష్టమే



న్యూఢిల్లీ: రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల టెస్టు రిటైర్మెంట్‌పై కోచ్ గంభీర్ స్పందించాడు. ఆ ఇద్దరి స్థానాలను భర్తీ చేయడం కష్టమేనని అంగీకరించాడు. కానీ యువ ఆటగాళ్లకు ఇదో చక్కటి అవకాశంగా పేర్కొన్నాడు. 'టీమిండియాకు ఇప్పుడు ఇద్దరు సీనియర్లు లేకుండా ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రిటైర్మెంట్ అనేది ఆటగాళ్ల వ్యక్తిగత నిర్ణయం. అయినా రోహిత్, విరాట్ లేకుండా ఆడడం కాస్త కష్టమే. అయితే ఇతర ఆటగాళ్లకు తమ సత్తా నిరూపించుకునే చాన్స్ దక్కుతుంది. చాంపియన్స్ ట్రోఫీ సమయంలో పేసర్ బుమ్రా అందుబాటులో లేడు. అప్పుడు కూడా నేనిదే విషయం చెప్పాను. ఎవరైనా లేకపోతే మరొకరు జాతీయ జట్టులో చోటు దక్కించుకుని నిరూపించుకుంటారు. అలాంటి అవకాశం కోసం చాలామంది ఎదురుచూస్తుంటారు కూడా' అని గంభీర్ చెప్పుకొచ్చాడు.

ఇషాన్ షో



చెలరేగిన సన్‌రైజర్స్ బౌలర్లు

- బెంగళూరుకు ఝలక్
- పోరాడిన సాల్ట్, విరాట్

48 బంతుల్లో 94 నాటౌట్

లఖ్‌నవూ: టాప్-2 స్థానాల కోసం పోటీ పడుతున్న గుజరాత్, బెంగళూరు జట్లకు ప్లేఆఫ్స్ నుంచి నిష్క్రమించిన టీమ్స్ ఝలక్ ఇస్తున్నాయి. గిల్ సేన లఖ్‌నవూ చేతిలో ఓడినట్టుగానే.. తాజాగా సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ స్థాయికి తగ్గ ఆటతీరుతో అదరగొట్టింది. ఇషాన్ కిషన్ (48 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సర్లతో 94 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా.. భారీ ఛేదనను దీటుగా ఆరంభించిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు చివర్లో బౌలర్లు చెక్ పెట్టారు. దీంతో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో రైజర్స్ 42 రన్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఆర్‌సీబీ గెలిస్తే టాప్‌లోకి వెళ్లేది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 231 పరుగులు చేసింది. అభిషేక్ (17 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 34) రాణించారు. షెఫర్డ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో బెంగళూరు 19.4 ఓవర్లలో పరుగులు చేసింది. సాల్ట్ (32 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 62), విరాట్ (25 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 43) మాత్రమే ఆకట్టుకున్నారు. కమిన్స్‌కు మూడు, ఎషాన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఇషాన్ నిలిచాడు.

16 పరుగులు..7 వికెట్లు: భారీ ఛేదనను ఆర్‌సీబీ ఆత్మవిశ్వాసంతో మొదలెట్టి పేలవంగా ముగించింది. ఓపెనర్లు విరాట్, సాల్ట్.. రైజర్స్ బౌలర్లను ఆరంభం నుంచే దీటుగా ఎదుర్కొన్నారు. ఈ జోడీ చక్కటి వేదికను ఏర్పరిచినా ఆఖరి ఐదు ఓవర్లలో 16 పరుగులకే 7 వికెట్లను కోల్పోయిన జట్టు మ్యాచ్‌ను కూడా చేజార్చుకుంది. విరాట్ వరుస బౌండరీలతో ముందు జోరు చూపాడు. ఆరో ఓవర్‌లో విరాట్ 6 సాల్ట్ 4,6తో 17 రన్స్ రాగా పవర్‌ప్లేను 72 రన్స్‌తో ముగించింది. అయితే చక్కగా కుదురుకున్న విరాట్‌ను హర్ష్ దూబే అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 80 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ ఆ తర్వాత సాల్ట్ ఎడాపెడా షాట్లతో విజృంభించాడు. దీంతో 27 బంతుల్లోనే అతడి ఫిఫ్టీ పూర్తయింది. ఈ దశలో వరుస ఓవర్లలో మయాంక్ (11), సాల్ట్ వికెట్లను కోల్పోవడం దెబ్బతీసింది. జితేశ్-పటీదార్ (18) కాసేపు నిలదొక్కుకుని నాలుగో వికెట్‌కు 44 పరుగులు జోడించారు. ఇక డెత్ ఓవర్లలో రైజర్స్ బౌలర్లు అదరగొట్టారు. 16వ ఓవర్‌లో పటీదార్ రనౌట్‌తో పాటు షెఫర్డ్ డకౌట్ కాగా తర్వాతి ఓవర్‌లోనే జితేశ్‌ను కోల్పోవడంతో ఆర్‌సీబీకి ఆశల్లేకుండా పోయాయి.

ఇషాన్ దూకుడు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ ఓ పక్క వికెట్లు కోల్పోయినా.. పరుగుల వేట మాత్రం ఆపలేదు. ఇషాన్ కిషన్ కీలక ఇన్నింగ్స్‌తో మెరవగా.. నితీశ్ (6) మినహా కీజులోకి వచ్చిన ప్రతీ బ్యాటర్ అతడికి తమ వంతుగా సహకరించారు. దీంతో ఆరంభం నుంచే స్కోరుబోర్డు 11 పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళ్లింది. మధ్యలో కాస్త నెమ్మదించినా, చివరి మూడు ఓవర్లలో 43 రన్స్‌తో భారీ స్కోరందుకుంది. ఓపెనర్లు అభిషేక్, హెడ్ (17)ల ధాటికి 3.3 ఓవర్లలోనే 50 పరుగులు సాధించింది. పవర్‌ప్లేలోనే ఈ జోడీ వెనుదిరిగినా అప్పటికే 71/2 స్కోరుతో పటిష్ఠంగా నిలిచింది. ఆ తర్వాత ఇషాన్ బాధ్యత తీసుకుని క్లాసెన్ (24)తో మూడో వికెట్‌కు 48 పరుగులు జోడించాడు. తొమ్మిదో ఓవర్‌లో ఇషాన్ రెండు ఫోర్లు, క్లాసెన్ ఓ ఫోర్‌తో స్కోరు వందకి చేరింది. అయితే అదే ఓవర్‌లో క్లాసెన్‌ను స్పిన్నర్ సుయాష్ అవుట్ చేశాడు. అనికేత్ (26) 11వ ఓవర్‌లో 6,4,6తో 19 రన్స్ రాబట్టాడు. తర్వాతి ఓవర్‌లోనూ అతడు సిక్సర్ బాదినా క్రునాల్‌కు చిక్కాడు. అటు పది ఇన్నింగ్స్ తర్వాత ఇషాన్ 28 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. నితీశ్ నిరాశపర్చినా అభినవ్ (12), కమిన్స్ (13)తో కలిసి ఇషాన్ చివర్లో జోరు చూపాడు. ఇక ఆఖరి ఓవర్‌లో 6,4 బాదిన ఇషాన్ తన సెంచరీకి ఆరు పరుగుల దూరంలో నిలవాల్సి వచ్చింది. ఏడో వికెట్‌కు ఇషాన్-కమిన్స్ అజేయంగా 43 పరుగులు జోడించారు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	13	9	4	0	18	0.602
పంజాబ్	12	8	3	1	17	0.389
బెంగళూరు	13	8	4	1	17	0.255
ముంబై	13	8	5	0	16	1.292
ఢిల్లీ	13	6	6	1	13	-0.019
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.337
కోల్‌కతా	13	5	6	2	12	0.193
హైదరాబాద్	13	5	7	1	11	-0.737
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: అభిషేక్ శర్మ (సి) సాల్ట్ (బి) ఎంగిడి 34, హెడ్ (సి) షెఫర్డ్ (బి) భువనేశ్వర్ 17, ఇషాన్ (నాటౌట్) 94, క్లాసెన్ (సి) షెఫర్డ్ (బి) సుయాశ్ 24, అనికేత్ (సి) భువనేశ్వర్ (బి) క్రునాల్ 26, నితీశ్ (సి) క్రునాల్ (బి) షెఫర్డ్ 4, అభినవ్ (సి) సాల్ట్ (బి) షెఫర్డ్ 12, కమిన్స్ (నాటౌట్) 13, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 231/6; వికెట్ల పతనం:** 1-54, 2-54, 3-102, 4-145, 5-164, 6-188; **బౌలింగ్:** యశ్ దయాల్ 3-0-36-0, భువనేశ్వర్ 4-0-43-1, ఎంగిడి 4-0-51-1, సుయాశ్ 3-0-45-1, క్రునాల్ 4-0-38-1, షెఫర్డ్ 2-0-14-2.

బెంగళూరు: సాల్ట్ (సి) హర్షల్ (బి) కమిన్స్ 62, కోహ్లీ (సి) అభిషేక్ (బి) దూబే 43, మయాంక్ (సి) ఇషాన్ (బి) నితీశ్ 11, పటీదార్ (రనౌట్) 18, జితేశ్ (సి) అభినవ్ (బి) ఉనాద్కట్ 24, షెఫర్డ్ (సి అండ్ బి) మలింగ 0, క్రునాల్ (హిట్‌వికెట్) (బి) కమిన్స్ 8, డేవిడ్ (సి) క్లాసెన్ (బి) మలింగ 1, భువనేశ్వర్ (బి) కమిన్స్ 3, యశ్ దయాల్ (సి) అనికేత్ (బి) హర్షల్ 3, ఎంగిడి (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 19.5 ఓవర్లలో 189 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-80, 2-120, 3-129, 4-173, 5-174, 6-174, 7-179, 8-186, 9-187, 10-189; **బౌలింగ్:** కమిన్స్ 4-0-28-3, ఉనాద్కట్ 4-0-41-1, హర్షల్ 3.5-0-39-1, మలింగ 4-0-37-2, హర్ష్ దూబే 2-0-20-1, నితీశ్ 2-0-13-1.



టెస్టులకు మాథ్యూస్ వీడ్కోలు

బంగ్లాతో తొలి టెస్టే ఆఖరిది

కొలంబో: శ్రీలంక వెటరన్ ఆల్‌రౌండర్ ఏంజెలో మాథ్యూస్ టెస్టులకు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నాడు. బంగ్లాదేశ్‌తో గాలె వేదికగా వచ్చే నెల 17 నుంచి జరిగే తొలి టెస్టే తన కెరీర్‌లో ఆఖరిదని తేల్చాడు. ఇక పరిమిత ఓవర్లలో జట్టు కోరుకుంటే అందుబాటులో ఉంటానని ప్రకటించాడు. 2009లో గాలె మైదానంలోనే 37 ఏళ్ల మాథ్యూస్ టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. 17 ఏళ్లుగా శ్రీలంకకు ఆడడాన్ని గౌరవంగా భావిస్తున్నట్టు తెలిపాడు. మాథ్యూస్ 118 టెస్టుల్లో 16 శతకాలు, 8,167 పరుగులతో పాటు 33 వికెట్లు తీశాడు. 34 టెస్టుల్లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. సంగక్కర, జయవర్ధనె తర్వాత ఈ ఫార్మాట్‌లో ఎక్కువ పరుగులు సాధించిన లంక బ్యాటర్‌గా మాథ్యూస్ కొనసాగుతున్నాడు.

అడ్రియన్ కంచు మోత

జూనియర్ షూటింగ్ ప్రపంచకప్

న్యూఢిల్లీ: జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత క్రీడాకారుల జోరు కొనసాగుతోంది. జర్మనీలోని సుల్‌లో శుక్రవారం జరిగిన 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్‌లో అడ్రియన్ కర్మాకర్ కాంస్యం సాధించాడు. రొమైన్ (ఫ్రాన్స్)కు స్వర్ణం, ఓస్టిల్ (నార్వే)కు రజతం దక్కాయి.

మావోయిస్టు దళపతి ఎలా చిక్కారు?

▸ కేశవరావు ఎన్‌కౌంటర్‌పై ప్రజాసంఘాల అనుమానాలు



హైదరాబాద్, మే 23(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌పై ప్రజాసంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ అడవుల్లో ఈ నెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేశవరావుతో పాటు మరో 26 మంది మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఎన్‌కౌంటర్‌పై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. నారాయణపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్ జరిగిందని చెబుతున్న ఛత్తీస్‌గఢ్ పోలీసులు.. ఏ ప్రాంతంలో జరిగిందనేది చెప్పడం చేయలేదు. అలాగే మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించకపోవడం అనుమానాలకు తావిస్తోందని ప్రజా సంఘాల నాయకులు అంటున్నారు. కేశవరావుకు రక్షణగా కనీసం 50మంది సాయుధ మావోయిస్టులు కాపలా ఉంటారని, ఎన్‌కౌంటర్‌లో 26 మందినే చూపించడం అనుమానాస్పదంగా ఉందని చెబుతున్నారు. పోలీసులు విడుదల చేసిన కేశవరావు ఫొటోను చూస్తే అనేక అనుమానాలు కలుగుతున్నాయంటున్నారు. ఆయన గడ్డం చేసుకోవడంతో పాటు తలపై జుట్టుకు రంగు వేసుకున్నట్లు కనిపించడం, తల కింద ఎర్రదస్తీ ఉండడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొంటున్నారు. ఆయన ఎప్పుడు దస్తీ అలా వాడరని, అది కొత్తగా పెట్టినట్లు కనిపిస్తోందని గతంలో కేశవరావుతో కలిసి పనిచేసిన వారు చెబుతున్నారు. ఇక, ఆయన్ను పడుకోబెట్టిన ప్రదేశంలోని ఆకులను గమనిస్తుంటే ఎన్‌కౌంటర్ జరిగిన స్థలంలాగా లేదని అంటున్నారు. ఆయనతో పాటు మరణించిన మావోయిస్టుల ఫొటోలను చూస్తుంటే చాలామందిని అత్యంత సమీపం నుంచి కాల్చివేసినట్లు ఉందని, వారి ముఖాలపై తుపాకీ బాయ్‌నెట్‌తో కొట్టిన గుర్తులు కనిపిస్తున్నాయని పేర్కొంటున్నారు. కేశవరావుతో పాటు మధు తప్పనిసరిగా ఉంటాడని, ఇద్దరికీ రక్షణగా ఉండాల్సిన వారి విషయంలోనే అనుమానాలు కలుగుతున్నాయని చెబుతున్నారు. కేశవరావు అనారోగ్యంతో బాధ పడుతున్నారని, చికిత్స తీసుకుంటుండగా పట్టుకొచ్చి, కాల్చి చంపారన్న ఆరోపణలు ఉన్నాయి. కేశవరావు పదేళ్లుగా అబూజ్‌మడ్ అడవుల్లోని ఒకే ప్రాంతంలో ఉంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఐదు నెలలుగా ప్రణాళికలు సిద్ధం చేసుకొని, 21న ఆయన క్యాంప్‌పై విరుచుకుపడినట్లు చర్చ జరుగుతోంది. కేశవరావు అతి విశ్వాసమే ఎన్‌కౌంటర్‌కు దారితీసిందన్న వాదన ఉంది.

పొదుపు పుస్తకాల కొనుగోళ్లలో అయోమయం!

▸ ఇప్పటికే కొన్నవి చెల్లవంటూ ఓ అధికారి ఆదేశాలు

▸ పుస్తకాలు ఎవరికి వారు కొనుక్కోవచ్చని సెర్ప్ ఐబీ వెల్లడి

ఒంగోలు, కార్పొరేషన్, మే 23(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా పొదుపు సంఘాల తీర్మానాల పుస్తకాల కొనుగోళ్లలో గందరగోళ పరిస్థితి నెలకొంది. విజయవాడ కేంద్రంగా నడిచే సెర్ప్ విభాగంలోని ఓ సంస్థాగత నిర్మాణ(ఐబీ) అధికారి ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రవ్యాప్తంగా పొదుపు సంఘాల్లో అయోమయానికి కారణమయ్యాయి. మ్యాక్స్ యాక్ట్ 95 ప్రకారం పొదుపు పుస్తకాలు, తీర్మానంలో చర్చించిన అంశాల నమోదు పుస్తకాలు ఇతరత్రా కొనుగోళ్లపై సంఘాలకు పూర్తి స్వేచ్ఛ ఉంది. అయితే ఓ అధికారి నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన ఆదేశాలతో డ్వాక్రా సంఘాలు, జిల్లా, మండల, గ్రామ సమాఖ్యలపై అదనపు భారం పడే పరిస్థితి ఏర్పడింది. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత కొత్త సంవత్సరంలో పుస్తకాలు కొనుగోలు చేయాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 73 లక్షలకుపైగా పొదుపు సంఘాలు ఉన్నాయి. సగానికిపైగా సంఘాలు ఇప్పటికే పుస్తకాలు కొనేసాయి. అయితే ఆ పుస్తకాలు చెల్లవని, రాష్ట్రవ్యాప్తంగా ఒకే నమూనాతో తామే పుస్తకాలు అందిస్తామని, ఇప్పటికే కొనుగోలు చేసినవి తీసివేయాలని ఇటీవల విజయవాడలోని సెర్ప్ విభాగ ఐబీ అధికారి ఆదేశించినట్లు సమాచారం. ఆయా జిల్లాలలో డీఆర్‌డీఏలో పనిచేసే ఐబీలు సంఘాలపై ఒత్తిడి తీసుకురావడంతో వాటి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అయితే, డ్వాకా సంఘాలు సమావేశ తీర్మానం పుస్తకాలు ఎవరికి వారు కొనుగోలు చేసుకోవచ్చని సెర్ప్ ఐబీ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. అయితే త్వరలోనే మొబైల్ యాప్ ద్వారా ఈ-కీపింగ్ పుస్తకాలను అందుబాటులోకి తీసుకురావాలన్నదే సెర్ప్ ఉద్దేశమని, విశాఖపట్నం నుంచి పుస్తకాల సరఫరాపై నకిలీ ఆర్డరు కాపీ వచ్చిందని, దానికీ, సెర్ప్‌కి ఎలాంటి సంబంధమూ లేదని శ్రీనివాసరావు వెల్లడించారు.



సీఎం చంద్రబాబును కలిసిన మేజర్ రాంగోపాల్‌నాయుడు

దేశరక్షణలో అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించి, కీర్తిచక్ర పురస్కారం పొందిన సిక్కోలుకు చెందిన ఆర్మీ మేజర్ రాంగోపాల్ నాయుడును సీఎం చంద్రబాబు అభినందించారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతో కలిసి మేజర్ శుక్రవారం ఢిల్లీలో సీఎంను కలిశారు. మేజర్ రాంగోపాల్ నాయుడు తెలుగు ప్రజలు గర్వించేలా దేశరక్షణలో కృషి చేశారని, సిక్కోలు వాసిగా ఇది గర్వపడే సందర్భమని రామ్మోహన్‌నాయుడు ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

'భోగాపురాని'కే ఆ 500 ఎకరాలు!



▸ అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం కోసం తిరిగి అప్పగించిన సర్కారు

▸ జగన్ హయాంలో వెనక్కి లాక్కున్న వైనం

▸ తాజాగా ఆ భూమి జీవీఐఏఎల్‌కు అప్పగింత

▸ ఉత్తర్వులు జారీ చేసిన సెక్రటరీ యువరాజ్

అమరావతి, మే 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి మణిహారం కానున్న భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు లిమిటెడ్(జీవీఐఏఎల్) నిర్మాణం కోసం జీఎంఆర్ సంస్థకు కేటాయించిన భూమిలో గత జగన్ ప్రభుత్వం 500 ఎకరాలను వెనక్కి తీసుకుంది. దీంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. దీనిని ఇటీవల సమీక్షించిన ప్రభుత్వం.. తాజాగా ఆ 500 ఎకరాలను తిరిగి భోగాపురం విమానాశ్రయ నిర్మాణానికే కేటాయించింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర మౌలిక సదుపాయల కల్పనా శాఖ కార్యదర్శి యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. గత టీడీపీ హయాంలోనే భోగాపురం ఇంటర్నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు 2,703.32 ఎకరాలను కేటాయించారు. అయితే.. 2019లో గద్దెనెక్కిన జగన్... మార్గదర్శకాలకు విరుద్ధంగా దీనిలో 500 ఎకరాలను 2022లో వెనక్కి తీసుకున్నారు. ఇలా భూమిని వెనక్కులాక్కోవడాన్ని అప్పట్లో ఆయన చాలా ఘనమైన వ్యూహంగా ప్రకటించుకున్నారు. అయితే, ఇలా భూములు లాక్కోవడం వల్ల తొలిదశలో 60 లక్షల మంది, రెండో దశలో 1.2 కోట్ల మంది ప్రయాణికులకు మౌలిక సదుపాయాలను కల్పించలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్నే జీఎంఆర్ సంస్థ పలు దఫాలుగా నాటి సీఎం జగన్‌కు వివరించింది. కానీ, ఎయిర్‌పోర్టు నిర్మాణ బాధ్యతల నుంచి జీఎంఆర్‌ను తప్పించాలన్న ఉద్దేశంతో ఉన్న జగన్.. ఆ 500 ఎకరాలను గుంజుకున్నారు. దీంతో పనులు నిలిచిపోయాయి. ఇక, 2024లో కూటమి అధికారంలోకి వచ్చాక విమానాశ్రయ నిర్మాణం కోసం కేటాయించిన 2,703.32 ఎకరాల్లో కోత కోసిన 500 ఎకరాలను మళ్లీ కేటాయించాలని జీఎంఆర్ ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించింది. అదేవిధంగా విమనాశ్రయం నిర్మాణ వ్యయం రెట్టింపై రూ.4,600కోట్లకు చేరిందని పేర్కొంది. జీవీఐఏఎల్ చేసిన విజ్ఞప్తిని పరిశీలించేందుకు చంద్రబాబు మంత్రుల కమిటీని నియమించారు. దీనిపై అధ్యయనం చేసిన కమిటీ నివేదిక సమర్పించింది. దీనిని తాజా మంత్రివర్గ సమావేశంలో ఆమోదించారు. దీంతో.. జీవీఐఏఎల్‌కు గతంలో కోత కోసిన 500 ఎకరాలను తిరిగి అప్పగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వు జారీ చేసింది. ఇదిలావుంటే, ఆనాడు జగన్ విధ్వంసానికి పూనుకోకపోతే.. ఈ పాటికే భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు పనులు పూర్తయి, విమాన సర్వీసులు కూడా అందుబాటులోకి వచ్చేవని అధికారులు చెబుతున్నారు.

ఆది నుంచి అదే విషం!

భోగాపురం ఇంటర్నేషల్ గ్రీన్‌ఫీల్ ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) పలు మార్గదర్శకాలు రూపొందించింది. అదేవిధంగా టెక్నో ఎకనమిక్ ఫీజిబిలిటీ రిపోర్టు(టీఈఎఫ్ఆర్) కూడా నివేదిక ఇచ్చింది. దీని ప్రకారం విమానాశ్రయ నిర్మాణానికి 2,703.32 ఎకరాలు అవసరమని తేల్చారు. కానీ, భోగాపురం ఎయిర్‌పోర్టుపై వైసీపీ ప్రభుత్వం ఆది నుంచి విద్వేష విధానమే అవలంబించింది. విమానాశ్రయం కోసం భూములు కోల్పోయిన వారికి సకాలంలో పరిహారం చెల్లించకుండా నానా అగచాట్లకు గురిచేసింది. ఎయిర్‌పోర్టుకు కేటాయించి భూములు చాలా ఎక్కువగా ఉన్నాయని, జీఎంఆర్‌తో చంద్రబాబు కుమ్మక్కై రియల్ ఎస్టేట్ చేసేందుకు కుట్ర పన్నారని జగన్ ఆరోపించారు. నిర్మాణ బాధ్యల నుంచి జీఎంఆర్‌ను తప్పించేందుకు ప్రయత్నించారు. దీనిలో భాగంగానే 500 ఎకరాలను వెనక్కి తీసుకున్నారు.

ఒలింపిక్ స్వర్ణానికి 7 కోట్లు

▸ రజతానికి 5 కోట్లు, కాంస్యానికి 3 కోట్లు

▸ క్రీడాకారులకిచ్చే ప్రోత్సాహంపై ఉత్తర్వులు

అమరావతి, మే 23 (ఆంధ్రజ్యోతి): ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించే క్రీడాకారులకు రూ.7 కోట్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రజతానికి రూ.5 కోట్లు, కాంస్యానికి రూ.3 కోట్లు ఇవ్వనుంది. స్పోర్ట్స్ పాలసీ 2024-29లో పొందుపరిచిన విధంగా ప్రోత్సాహం అందించాలని నిర్ణయించింది. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో పతకాలు సాధించే క్రీడాకారులకు ఇచ్చే నగదు ప్రోత్సాహకాలపై క్రీడాశాఖ సెక్రటరీ వి.వినయ్ చంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆటగాళ్లతో పాటు కోచ్‌లు, క్రీడా సంఘాలకు కూడా నగదు ప్రోత్సాహాలు ఇవ్వనున్నారు. మొత్తం క్రీడలను రెండు కేటగిరీలుగా విభజించారు. ఏ విభాగంలో 36 క్రీడలు, బీ విభాగంలో క్రికెట్ సహా 29 క్రీడలను పొందుపరిచారు. ఆంధ్రప్రదేశ్ తరఫున ఆడిన ఆటగాళ్లకు మాత్రమే క్యాష్ ఇన్సెంటివ్స్ అందిస్తారు. దీనికోసం క్రీడాకారులు క్రీడా యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఒలింపిక్‌లో గోల్డ్ సాధిస్తే రూ.7 కోట్లు, రజతానికి రూ.5 కోట్లు, కాంస్యానికి రూ.3 కోట్లు అందిస్తారు. పతకం రాకపోయినా ఒలింపిక్స్‌లో పాల్గొన్నవారికి కూడా రూ.15 లక్షలు అందించాలని నిర్ణయించారు. పారాలింపిక్స్‌లో పాల్గొన్న క్రీడాకారులకు కూడా ఇదే ప్రోత్సాహం అందిస్తారు. ఇక ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకానికి రూ.4 కోట్లు, రజతానికి రూ.2కోట్లు, కాంస్యం నెగ్గితే రూ.కోటి ఇస్తారు. ఆసియా క్రీడల్లో పాల్గొన్న వారికి రూ.10 లక్షలు అందజేస్తారు. కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణానికి రూ.50 లక్షలు, రజతానికి రూ.35 లక్షలు, కాంస్యానికి రూ.25 లక్షలు ఇస్తారు. పాల్గొన్న వారికి రూ.5 లక్షలు అందిస్తారు. ఇలా అన్ని రకాల క్రీడలకు ఎంత మొత్తంలో ప్రోత్సాహం అందించాలో ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

3 నుంచి బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం సమావేశాలు

▸ చర్చల్లో పాల్గొననున్న టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి

న్యూఢిల్లీ, మే 23(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నేతృత్వంలోని భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందం జూన్ 3నుంచి 5 వరకూ బ్రెజిల్‌లో జరగనున్న 11వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం సమావేశంలో పాల్గొననుంది. ఈ బృందంలో స్పీకర్‌తో పాటు రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్, లోక్‌సభ ఎంపీలు బైరెడ్డి శబరి, విజయ్ బాఘేల్, వివేక్ ఠాకూర్ ఉన్నారు. ఇక్కడ నిర్వహించే చర్చల్లో టీడీపీ ఎంపీ శబరి పాల్గొంటారు.

తెలంగాణ జీవనశైలిలో 'బ్యూటీ విత్ పర్పస్'!

మహిళల భద్రత, సాధికారతకు ఆదర్శం

అభివృద్ధి, ఆత్మీయత, ఆత్మగౌరవానికి రాష్ట్రం ప్రతీక

హైదరాబాద్.. సురక్షిత నగరం

తెలంగాణపై మిస్ వరల్డ్ పోటీదారుల ప్రశంసలు

విజేతలుగా వేల్స్, టర్కీ, ట్రినిడాడ్ టొబాగో, జాంబియా భామలు

హైదరాబాద్, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరి పోటీదారులు తెలంగాణపై ప్రశంసలు కురిపించారు. ఇక్కడి సంస్కృతీ సంప్రదాయాలను కొనియాడారు. 'బ్యూటీ విత్ పర్పస్' భావన ఇక్కడి ప్రజల జీవనశైలిలో కనిపించిందని తెలిపారు. హైదరాబాద్ నగర వీధుల్లో మహిళలు రాత్రి వేళల్లో సైతం భయపడకుండా స్వేచ్ఛగా తిరగగలగడం ఆశ్చర్యాన్ని కలిగించిందని చెప్పారు. ఇది ఒక సురక్షిత నగరానికి ప్రతీకగా అభివర్ణించారు. రాష్ట్ర అభివృద్ధి, మహిళల సాధికారత, భద్రతకు సంబంధించి అందాల భామలు చేసిన వ్యాఖ్యలు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 72వ మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న పలు దేశాల అందగత్తెలు హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర ప్రాభవాన్ని ప్రశంసించారు. శుక్రవారం హోటల్ ట్రైడెంట్‌లో నిర్వహించిన 'హెడ్ టు హెడ్ చాలెంజ్' ఫైనల్ జరిగింది. యూరప్, ఆఫ్రికా, ఆసియా-ఓషియానా, అమెరికా-కరేబియన్‌ల నుంచి ఐదుగురు చొప్పున పాల్గొన్న పోటీదారులు సామాజిక కోణంపై తమదైన శైలిలో జడ్జిలకు సమాధానాలు ఇచ్చారు. ఇందులో మిస్ వేల్స్, మిస్ టర్కీ, మిస్ ట్రినిడాడ్ టొబాగో, మిస్ జాంబియా విజేతలుగా నిలిచారు. ఈ పోటీకి ఎంపికైన 20 మందిలో మిస్ ఇండియా నందితా గుప్తా పేరు లేదు. తెలంగాణ సంస్కృతి, అభివృద్ధి, మహిళల సాధికారత, భద్రతకు సంబంధించి న్యాయనిర్ణేతలు అడిగిన ప్రశ్నలకు అందగత్తెలు ఉత్సాహంగా చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షించాయి.

చిత్రజ్యోతి

SINCE 1965

సెట్‌లోకి చిరు



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం (మెగా 157-వర్కింగ్ టైటిల్) రెగ్యులర్ షూటింగ్ శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. చిరంజీవితో పాటు ఇతర నటీనటులు షూటింగ్‌లో పాల్గొనగా కీలక సన్నివేశాలను అనిల్ రావిపూడి తెరకెక్కించారు. తనదైన శైలిలో సాగే విభిన్న కథాంశంతో ఈ సినిమాను ఆయన తెరకెక్కిస్తున్నారు. ఇందులో చిరంజీవి పాత్ర వినోదభరితంగా ఉండనుంది. ఈ చిత్రంలో నయనతార చిరంజీవికి జోడీగా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బేనర్‌పై సాహూ గారపాటి, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సినిమాటోగ్రఫీ: సమీర్‌రెడ్డి.

అలరించే ప్రేమగీతం



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ కథానాయకులుగా తెరకెక్కిన చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మించారు. అదితి శంకర్, ఆనంది, దివ్యపిళ్లై కథానాయికలు. డాక్టర్ జయంతిలాల్ గడ సమర్పిస్తున్నారు. ఈనెల 30న విడుదలవుతోంది. 'గిచ్చమాకే' అంటూ సాగే గీతాన్ని చిత్రబృందం శుక్రవారం విడుదల చేసింది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అదితి శంకర్‌పై చిత్రీకరించిన ఈ డ్యూయెట్‌కు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా, శ్రీ చరణ్ పాకాల స్వరపరిచారు. ధనుంజయ్ సీపాన, సౌజన్య ఆలపించారు. ప్రథమార్థం అంతా వినోదాత్మకంగా, ఉల్లాసంగా నడుస్తుంది. ద్వితీయార్థంలో పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: హరి కే వేదాంతం, ఎడిటర్: ఛోటా కే ప్రసాద్.

హరిహర వీరమల్లుపై ఆ నలుగురి కుట్ర

● తేల్చాలంటూ హోం శాఖకు ఏపీ మంత్రి కందుల దుర్గేష్ ఫిర్యాదు





పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటించిన 'హరిహర వీరమల్లు' సినిమా విడుదలకు ముందే థియేటర్లు మూసివేయాలంటూ నలుగురు పెద్ద నిర్మాతలు ఒత్తిడి చేశారని, వారి సంగతి తేల్చాలంటూ ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ హోం శాఖకు ఫిర్యాదు చేశారు. జూన్ 12న 'హరిహర వీరమల్లు' సినిమా విడుదల కానున్న నేపథ్యంలో జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు మూసి వేయాలనే ఒత్తిడి వెనుక దాగున్న కుట్రను వెలికి తీయాలంటూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్‌కు మంత్రి కందుల దుర్గేష్ ఫిర్యాదు చేశారు. తెలుగులో పెద్ద నిర్మాతలుగా పేరున్న ఆ నలుగురు ఇటీవల ఒక చోట సమావేశం అయ్యారని, వారు పన్నిన కుట్రలో భాగమే థియేటర్ల మూసివేత అని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన హోంశాఖ ముఖ్య కార్యదర్శి నిష్పక్షపాత దర్యాప్తునకు ఆదేశిస్తామంటూ మాటిచ్చినట్లు సినిమాటోగ్రఫీ వర్గాలు తెలిపాయి. ఆ నలుగురు నిర్మాతల్లో ఒకరు పవన్ కల్యాణ్ సమీప బంధువు కాగా మరొకరు విశాఖపట్నంలో భారీ స్టూడియో నిర్మించిన ప్రొడ్యూసర్, ఇంకొకరు తెలంగాణలో డిస్ట్రిబ్యూటర్ నుంచి పెద్ద సినిమాలు నిర్మించే స్థాయికి ఎదిగిన నిర్మాతగా సినీ పరిశ్రమలో ప్రచారం జరుగుతోంది. నాలుగో నిర్మాత ఎవరన్నది తేలాల్సి ఉంది.

అమరావతి (ఆంధ్రజ్యోతి)



మిత్రబృందం స్నేహగీతం

గ్రామీణ నేపథ్యంలో ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం 'బద్మాషులు'. మహేశ్, విద్యాసాగర్, మురళీధర్ గౌడ్ ప్రధాన తారాగణం. శంకర్ చేగూరి దర్శకత్వంలో బి. బాలకృష్ణ, సి. రామశంకర్ నిర్మిస్తున్నారు. జూన్ 6న ఈ చిత్రం విడుదలవుతోంది. తాజాగా చిత్రబృందం 'జిందగీ బిలాలే' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. మిత్రబృందంపై చిత్రీకరించిన ఈ గీతాన్ని హీరో ప్రియదర్శి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ చిత్రానికి తేజ కూకునూరు సంగీతం అందించారు. చరణ్, అర్జున్, విహ ఆలపించారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే అంశాలతో 'బద్మాషులు' చిత్రాన్ని రూపొందించామని దర్శకుడు తెలిపారు.

ప్రేక్షకుల ముందుకు గ్యాంబ్లర్స్



సంగీత్ శోభన్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'గ్యాంబ్లర్స్'. ప్రశాంతి చారులింగ కథానాయిక. కేఎస్‌కే చైతన్య దర్శకుడు. సునీత, రాజ్‌కుమార్ బృందావనం నిర్మాతలు. చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. జూన్ 6న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు పేర్కొంది. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో సంగీత్ శోభన్ సీరియస్ లుక్‌లో కనిపించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఈ చిత్రంలో ఉండే థ్రిల్లింగ్ అంశాలు, మలుపులు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. సంగీత్ శోభన్ మేనరిజమ్స్, శారీరక భాషను అర్థం చేసుకొని పాత్రలోకి పరకాయ ప్రవేశం చేశారు' అని చెప్పారు. కొత్త కాన్సెప్ట్‌తో థ్రిల్లింగ్ అంశాలతో రూపొందిన గ్యాంబ్లర్స్ ప్రేక్షకులను అలరిస్తుందని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: శశాంక్ తిరుపతి.

యూత్ టీమ్‌తో 'థాంక్యూ డియర్'



ధనుష్ రఘుముద్రి నటించిన 'థాంక్యూ డియర్' చిత్రం ఫస్ట్ లుక్‌ను సీనియర్ దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేశారు. ఈ సినిమా చేస్తున్న యువ బృందానికి ఆశీస్సులు అందజేసి సినిమా విజయం సాధించాలని భరద్వాజ కోరారు. హీరో ధనుష్ రఘుముద్రి మాట్లాడుతూ 'ఇది నా రెండో సినిమా. నా కెరీర్‌కు కీలకమైంది. ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది' అన్నారు. హెబ్బా పటేల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని తోట శ్రీకాంతకుమార్ దర్శకత్వంలో పప్పు బాలాజీ రెడ్డి నిర్మిస్తున్నారు. లైన్ ప్రొడ్యూసర్ పునీత్ రెడ్డి.

యదార్థ సంఘటన ఆధారంగా



కౌసల్యా కృష్ణమూర్తి, అథర్వ చిత్రాలతో నటుడిగా ప్రేక్షకులను ఆకట్టుకున్నారు కార్తీక్‌రాజు. ఆయన కథానాయకుడిగా కొత్త చిత్రం ప్రారంభమైంది. శుక్రవారం పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభించారు. తొలి షాట్‌కు సురేశ్‌బాబు క్లాప్ ఇచ్చారు. హీరో చైతన్య కెమెరా స్విచ్చాన్ చేశారు. భీమనేని శ్రీనివాసరావు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి 'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. రాజా దుస్సా దర్శకత్వంలో గాలి కృష్ణ నిర్మిస్తున్నారు. కాజల్ చౌదరి కథానాయిక. 1980ల్లో వరంగల్‌లో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని దర్శకుడు తెలిపారు.

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

సర్వ దర్శనానికి 16 గంటల సమయం


నారాయణగిరి ఉద్యానవనంలోని క్యూలో వేచి ఉన్న భక్తులు

తిరుమల, మే 23(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. వేసవి సెలవులు ముగింపునకు రావడంతో పాటు వారాంతం కావడంతో శుక్రవారం ఉదయం నుంచి తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి ఉద్యానవనంలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ నుంచి రింగు రోడ్డులోని శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి 16 గంటల దర్శన సమయం పడుతోంది. ఇక, టైంస్లాట్ టికెట్లు, టోకెన్లు ఉన్న భక్తులకూ మూడు నుంచి నాలుగు గంటల తర్వాత దర్శనం లభిస్తోంది. భక్తుల రద్దీ పెరిగిన క్రమంలో శ్రీవారి ఆలయం ప్రాంతం, మాడవీధులు, గదులు కేటాయించే కార్యాలయాలు, సీఆర్వో, ఆర్టీసీ బస్టాండ్, అన్నప్రసాద కేంద్రం, అఖిలాండం, లడ్డూ కాంప్లెక్స్, లేపాక్షి, రాంభగీచ కూడళ్లు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. గదులు లభించని భక్తులు కార్యాలయం ముందు, యాత్రికుల వసతి సముదాయాలు, చెట్ల కింద, ఫుట్‌పాత్‌లపైనే సేదతీరుతున్నారు. ఇక, తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు కూడా రద్దీగా మారాయి. తిరుమలలో సందర్శనీయ ప్రదేశాలైన శ్రీవారి పాదాలు, పాప వినాశనం కూడా భక్తులతో కిక్కిరిసిపోయాయి. శని, ఆదివారాలు కూడా ఇదే తరహాలో రద్దీ కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మెగా డీఎస్సీకి లైన్ క్లియర్

- షెడ్యూల్ ప్రకారమే పరీక్ష
- వాయిదా వేయాలన్న పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మే 23(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నిర్వహణకు మార్గం సుగమమైంది. షెడ్యూల్ ప్రకారమే పరీక్ష జరగనుంది. ఈ మేరకు సుప్రీంకోర్టు స్పష్టతనిచ్చింది. డీఎస్సీని వాయిదా వేయాలని కోరుతూ దేవిరెడ్డి దుర్గా శ్రీను, పి.హేమంత్, షరీఫ్, మాదాసు శివకుమార్, ఎన్.లోకేశ్, ఎం.రేణుక రిట్ పిటిషన్ వేశారు. ప్రతిఏటా రెండుసార్లు నిర్వహించాల్సిన టెట్‌ను గతేడాది అక్టోబర్‌లో నిర్వహించారని అభ్యర్థులు పేర్కొన్నారు. ఆరు నెలల వ్యవధిలో మరోసారి ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహించాలని, కానీ రాష్ట్ర ప్రభుత్వం టెట్ పెట్టకుండానే డీఎస్సీ షెడ్యూల్ ఇచ్చిందని తెలిపారు. ఏపీలో 2017లో ఉపాధ్యాయుల నియామకం జరిగిందని, మళ్లీ ఎప్పుడు జరుగుతుందో తెలియదని, దీనివల్ల లక్షలాది మంది నష్టపోయే ప్రమాదముందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇది జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. డీఎస్సీ ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని ధర్మాసనం అభిప్రాయపడింది. పరీక్ష వాయిదాకు లేవనెత్తిన అంశాల్లో సరైన కారణాలు లేవని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్టు తెలిపింది. ఇలాంటి అంశాలపై హైకోర్టులోనే పిటిషన్లు దాఖలు చేసుకోవాలని సూచించింది. 16,347 పోస్టుల భర్తీకి ఏప్రిల్ 20న ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. జూన్ 6 నుంచి పరీక్షలు జరగనున్నాయి.

రాజమహేంద్రవరంలో తెలుగు వర్సిటీ

- ఏలూరు కేంద్రంగా ఓపెన్ యూనివర్సిటీ
- ఉత్తర్వులు జారీ చేసిన ఉన్నత విద్యాశాఖ

అమరావతి, మే 23(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఉమ్మడిగా కొనసాగుతున్న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ రాష్ట్రానికి రానున్నాయి. వీటిని రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ఇటీవల కేబినెట్ ఆమోదం తెలపగా అందుకు అనుగుణంగా వాటి ప్రధాన కార్యాలయాలను ఏపీకి మారుస్తూ ఉన్నత విద్యాశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు సమీపంలో ఓపెన్ యూనివర్సిటీ, రాజమహేంద్రవరంలో తెలుగు యూనివర్సిటీ ఏర్పాటు కానున్నాయని తెలిపింది. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఈ రెండు వర్సిటీల్లో అడ్మిషన్లు ప్రారంభిస్తారు. బీఆర్‌ఏవోయూ కింద రాష్ట్రవ్యాప్తంగా 76 స్టడీ సెంటర్లు, తెలుగు వర్సిటీ కింద శ్రీశైలం, రాజమహేంద్రవరం, కూచిపూడిల్లో క్యాంపస్‌లు ఉన్నాయి.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లకు అనుమతులు కొనసాగింపు

అమరావతి, మే 23 (ఆంధ్రజ్యోతి): ఏఐసీటీఈ ఆమోదం లభించిన 63 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు చేపట్టేందుకు అనుమతులు కొనసాగిస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో మొత్తం 87 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు ఉండగా 63 పాలిటెక్నిక్‌లకు అనుమతులు లభించాయి. త్వరలోనే మిగిలిన వాటికి కూడా అనుమతులు వస్తాయని ఉత్తర్వుల్లో ప్రభుత్వం తెలిపింది. గతేడాది ఉన్న సీట్లకే ఈ ఏడాది కూడా అనుమతి ఇచ్చింది.

28 మంది శాస్త్రవేత్తలకు షాక్

అక్రమ పదోన్నతులపై సర్కార్ కొరడా.. రంగా వర్సిటీలో 28మంది పదోన్నతులు రద్దు

- యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని నిర్ధారణ
- గత పాలకుల సహకారంతో ఇష్టారాజ్యంగా పదోన్నతులు



అమరావతి, మే 23(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు పొందిన 28 మంది శాస్త్రవేత్తలకు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. వారి పదోన్నతులు రద్దు చేయడంతోపాటు, తద్వారా పొందిన లబ్ధిని రికవరీ చేయాలని నిర్ణయించింది. గత ప్రభుత్వంలో సీనియారిటీని ముందుకు జరిపి, బోగస్ సర్టిఫికెట్లు పెట్టి, రాజకీయ, అధికార పలుకుబడిని ఉపయోగించి 2021-22 మధ్య 34మంది శాస్త్రవేత్తలు/ఆచార్యులు పదోన్నతులు పొందారు. దీనిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఈ వ్యవహారంపై వర్సిటీ నివేదిక సమర్పించింది. ఈ నివేదిక మేరకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 28మంది పదోన్నతులను రద్దు చేసి, దీనిపై విజిలెన్స్ విచారణ జరపాలని ఆదేశించింది. దీంతో రీసెర్చ్ అసోసియేట్(ఆర్ఏ)లో సర్వీస్ వ్యవధిని తగ్గించడం ద్వారా పదోన్నతులతో అదనంగా పొందిన వేతన సొమ్ము రికవరీకి వర్సిటీ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. సాధారణంగా విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరిన 12ఏళ్ల తర్వాత అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి ఇస్తారు. కానీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరడానికి ముందు.. అడ్‌హాక్ ప్రాజెక్టుల్లో చేసిన కాంట్రాక్ట్, టెంపరరీ సర్వీస్ కాలాన్ని కలిపి 34మందికి పదోన్నతి ఇవ్వడం వల్ల వీరి కంటే ముందు చేరినవారు జూనియర్లుగా మారారు.

వైసీపీ పెద్దల అండతో అక్రమాలు

వర్సిటీలో కొంతమంది శాస్త్రవేత్తలు పదోన్నతి కోసం పూర్వపు కాంట్రాక్ట్, టెంపరరీ సేవలను పరిగణలోకి తీసుకోవాలని అభ్యర్థనలు సమర్పిస్తుంటారు. కానీ ఇవి యూజీసీ నిబంధనలకు విరుద్ధమైనందున వర్సిటీ అధికారులు తిరస్కరిస్తుంటారు. గత వైసీపీ పాలనలో 34 మంది శాస్త్రవేత్తలు సంబంధిత అధికారులను ప్రభావితం చేసి పదోన్నతులు పొందారు. దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయకుండా అప్పటి వర్సిటీ పెద్దలు, కీలక అధికారులు బెదిరింపులకు పాల్పడ్డారు. ఫిర్యాదు చేసిన వారిని మారుమూల ప్రాంతాలకు పంపారు. ఈ చట్ట విరుద్ధమైన పదోన్నతుల ప్రభావం వర్సిటీ పరిధిలోని దాదాపు 500మంది శాస్త్రవేత్తల సీనియారిటీపై పడింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత గతంలో ఇచ్చిన పదోన్నతుల ఉత్తర్వులను సమీక్షించాలని కొందరు శాస్త్రవేత్తలు వర్సిటీకి వినతిపత్రం అందజేశారు. దీంతో యూజీసీ నిబంధనలకు అనుగుణంగా పదోన్నతులు ఉన్నాయా.. లేవా? అనే అంశంపై సమీక్ష కోసం వర్సిటీ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 2021-23 మధ్య ఇచ్చిన అన్ని పదోన్నతులపై సమీక్షించి, వర్సిటీకి నివేదిక సమర్పించింది. ఈ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం.. యూజీసీ సవరించిన పే స్కేల్స్‌లో శాస్త్రవేత్తలు, ఆచార్యులకు రీసెర్చ్ అసోసియేట్(ఆర్ఏ)లో పరిగణలోకి తీసుకున్న గత సర్వీస్‌ను, కేరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (సీఏఎస్) ద్వారా పదోన్నతుల్లోని వ్యత్యాసాలను ప్రస్తావిస్తూ, 28మంది శాస్త్రవేత్తలకు చట్టవిరుద్ధంగా ఇచ్చిన పదోన్నతులను వెంటనే ఉపసంహరించాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులు జారీ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ మొత్తం వ్యవహారంపై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తూ, వర్సిటీకి మెమో జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా 28మంది శాస్త్రవేత్తల పదోన్నతులను ఉపసంహరిస్తూ, యూనివర్సిటీ ఉత్తర్వులు ఇచ్చింది. అక్రమంగా పదోన్నతులు పొందిన శాస్త్రవేత్తలు, ఆచార్యులు ఇప్పటికే రూ. 8కోట్ల మేర లబ్ధి పొందారని ప్రభుత్వం గుర్తించింది.

పదోన్నతి కోసం నకిలీ సర్టిఫికెట్!

మరోవైపు గతంలో వైసీపీ నేతలతో అంటకాగిన ఒక ఆచార్యుడు పదోన్నతుల కోసం సమర్పించిన సర్టిఫికెట్ నకిలీదని వర్సిటీ పరిశీలనలో తేలింది. పదోన్నతి కోసం వర్సిటీని తప్పుదారి పట్టించిన అతనికి షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఆ వ్యక్తికి అర్హత లేకున్నా.. గత ప్రభుత్వ పెద్దల వద్ద ఉన్న పలుకుబడితో కీలక పదవి పొందారు. పైగా రెండు వర్సిటీలకు బోర్డు సభ్యుడిగా కూడా వ్యవహరించారు. ప్రభుత్వం మారిన తర్వాత తిరిగి వర్సిటీకి రిపోర్టు చేసి, ఓ వ్యవసాయ కళాశాలలో పోస్టింగ్ పొందారు.

ఇక ప్రభుత్వ కార్యకలాపాలన్నీ ఆన్‌లైన్‌లోనే!

- మాన్యువల్ ఫైలింగ్‌ను నిలిపేయాల్సిందే: సీఎస్

అమరావతి, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖలన్నీ ఇకపై తమ కార్యకలాపాలన్నీ ఆన్‌లైన్‌లో నిర్వహించడాన్ని తప్పనిసరి చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వు జారీ చేశారు. ఇకపై మాన్యువల్ ఫైలింగ్ విధానాన్ని నిలిపివేయాల్సిందేనని, కాగితం లేని పాలనకు నాంది పలకాలని సూచించారు. ఆన్‌లైన్ ఫైలింగ్ వల్ల పారదర్శకత, పనివేగం పెరుగుతుందని, మాన్యువల్ ఫైలింగ్ వల్ల నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యంతో పాటు అలసత్వమూ ఉంటుందని పేర్కొన్నారు. మనమిత్ర-వాట్సాప్ గవర్నెన్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ శాఖల నుంచి ప్రభుత్వశాఖలు, ప్రభుత్వం నుంచి వ్యాపార, వాణిజ్య సంస్థలు, ప్రభుత్వం- ప్రజలకు మధ్య సమాచారమంతా ఆన్‌లైన్‌లోనే ఉంటుందని సీఎస్ వెల్లడించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్) ఈ ఆన్‌లైన్ పాలనా విధానాన్ని సమన్వయం చేస్తుందని సీఎస్ పేర్కొన్నారు.

'మహిళా వ్యాపారవేత్తల' ప్రణాళిక సిద్ధం

- 123 మున్సిపాలిటీల్లో 30 వేల మందికి ప్రోత్సాహం
- మెప్మా వర్క్‌షాప్‌నకు హాజరైన ఎన్జీవోలు, కంపెనీలు

అమరావతి, మే 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలో లక్ష మంది మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు మెప్మా(పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) ప్రణాళిక సిద్ధం చేసింది. తొలిదశలో ప్రముఖ కంపెనీలు, స్వచ్ఛంద సంస్థల (ఎన్‌జీవోలు) భాగస్వామ్యంతో రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో కనీసం 30 వేల మంది మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా వివిధ కంపెనీలు, స్వచ్ఛంద సంస్థల (ఎన్‌జీవోలు) ప్రతినిధులతో శుక్రవారం తాడేపల్లిలోని మెప్మా ప్రధాన కార్యాలయంలో వర్క్‌షాపు నిర్వహించింది. మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్‌షాపులో వివిధ జిల్లాల నుంచి 60 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఆయా జిల్లాల్లో పేరొందిన ఎన్జీఈవోలు, కంపెనీలు, వారికి ఉన్న ఫారిన్ ఫండ్లు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ, ఇప్పటికే ఎన్జీవోలు చేస్తున్న మహిళా సాధికారత, వ్యాపారాభివృద్ధి, జీవనోపాదుల పెంపుదల కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న పట్టణ మహిళలను గుర్తించి, వారిని వ్యాపారవేత్తలుగా ప్రోత్సహించాలని మెప్మా భావిస్తోంది. ఈ దిశగా ముందుకు వచ్చే సంస్థలతో మెప్మా ఒప్పందాలు (ఎంవోయూ) కుదుర్చుకుని, అర్హతగలవాటిని ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

డాడీ చుట్టూ దయ్యాలు

- పార్టీలో నాపై అంతర్గత కుట్రలు, కుతంత్రాలు
- కుట్రలు చేసే ఆ దయ్యాలే నా లేఖను లీక్ చేశాయి: కవిత



శంషాబాద్, మే 23(ఆంధ్రజ్యోతి): "కేసీఆర్ దేవుడు.. కానీ, ఆయన చుట్టూ కొన్ని దయ్యాలు ఉన్నాయి. వాళ్ల వల్ల చాలా నష్టం జరుగుతోంది" అని ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యానించారు. కుట్రలు చేస్తున్న ఆ దయ్యాలే.. తన తండ్రికి తాను రాసిన లేఖను లీక్ చేశాయని.. పార్టీలో తనపై అంతర్గతంగా కుట్రలు జరుగుతున్నాయని ఆమె ఆరోపించారు. అమెరికా నుంచి శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్న ఆమె.. ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడారు. తన కుమారుడి గ్రాడ్యుయేషన్ వేడుకకు హాజరై తిరిగి వచ్చేసరికి.. లేఖ లీక్ అయ్యిందంటూ హంగామా జరుగుతోందని, ఆ లేఖ రెండు వారాల క్రితం కేసీఆర్‌కు తాను రాసిందేనని స్పష్టత ఇచ్చారు. గతంలో కూడా కేసీఆర్‌కు తన అభిప్రాయాలను ఇలా లేఖ ద్వారా చెప్పానని ఆమె పేర్కొన్నారు. వరంగల్ సభ తరువాత లేఖ ద్వారా తన అభిప్రాయాలను పార్టీ అధినేతకు వెల్లడించానని.. కేసీఆర్‌కు లేఖ రాయడంలో తనకు ఎలాంటి వ్యక్తిగత ఎజెండా లేదని ఆమె స్పష్టం చేశారు. పార్టీలో అన్ని స్థాయుల్లో ఉన్న వారూ అనుకునే విషయాలు, దాదాపు సగం తెలంగాణ ప్రజలు అనుకుంటున్న విషయాలను మాత్రమే తాను లేఖలో రాశానని చెప్పారు. "కేసీఆర్ కుమార్తెనైన నేను రాసిన లేఖే బయటికి వచ్చిందంటే.. ఇక సామాన్యుల సంగతేంటి?" అని ప్రశ్నించారు. కేసీఆరే తమ నాయకుడని.. ఆయన నాయకత్వంలోనే తెలంగాణ బాగుపడతది, ముందుకు పోతదని కవిత వ్యాఖ్యానించారు. దీనిపై ఎలాంటి ఆలోచనా లేదని, కుటుంబం పార్టీ కూడా ఐక్యంగానే ఉన్నాయని కవిత స్పష్టం చేశారు. పార్టీలో ఉన్న చిన్న చిన్న లోపాలపై అంతర్గతంగా చర్చించుకుంటూ, సవరించుకుని, కోవర్టులను పక్కకు తప్పించుకుంటూ ముందుకుపోతేనే పార్టీ పదికాలాల పాటు చల్లగా ఉంటుందన్నారు. కాగా.. 'డాడీ చుట్టూ దయ్యాలున్నాయి' అంటూ ఎయిర్‌పోర్టులో ఆమె చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపాయి. విమానాశ్రయంలో కవితకు స్వాగతం చెప్పేందుకు వచ్చినవారు సైతం 'ఆ దయ్యాలెవరు?' అంటూ చర్చించుకోవడం కనిపించింది.

ఉద్యోగ నేతల బదిలీ మినహాయింపుపై ప్రత్యేక దృష్టి

- విభాగాధిపతులు, కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు

అమరావతి, మే 23(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సంఘాల ప్రతినిధుల బదిలీల మినహాయింపు సర్టిఫికెట్ల వాస్తవికతను ధ్రువీకరించేందుకు కొన్ని మార్గదర్శకాలను నిర్దేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం సర్క్యులర్ మెమోను జారీ చేసింది. బదిలీల మినహాయింపును వర్తింప చేసేందుకు ఉద్యోగ సంఘాల నుంచి పొందాల్సిన సర్టిఫికెట్లను నిర్ధారిస్తూ సర్క్యులర్ మెమోను ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్ఎస్ రావత్ జారీ చేశారు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్లకు వర్తింపజేసే సాధారణ బదిలీ మినహాయింపు సౌకర్యాన్ని గతంలో దుర్వినియోగం చేసినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ సాగుతోంది. ఈ నేపథ్యంలో అన్ని శాఖల అధిపతులు, కలెక్టర్లు, జిల్లా మెజిస్ట్రేట్ల అసోసియేషన్ల నుంచి నిర్దిష్ట పత్రాలను పొందాలని ప్రభుత్వం సూచించింది. సాధారణ బదిలీల్లో సర్వీస్ అసోసియేషన్ల ఆఫీస్ బేరర్లకు మినహాయింపు ఇచ్చే ముందు సర్టిఫికెట్ల వాస్తవికతను పూర్తిగా ధ్రువీకరించుకోవాలని ఆదేశించింది. మినహాయింపు కోరుతున్న ఆఫీస్ బేరర్ పదవి, పదవీ కాలం మొదలైనవి అసోసియేషన్ ఉప-చట్టాలల్లో కవర్ చేయబడి ఉన్నాయో లేదో పరిశీలించాలని, వారి పేరు అసోసియేషన్ ఓటర్ల జాబితాలో ఉందో లేదో తదితర అన్ని అంశాలను ధ్రువీకరించుకున్న తదుపరి మాత్రమే సాధారణ బదిలీల నుంచి మినహాయింపు వర్తింప చేయాలని ఆ సర్క్యులర్ మెమోలో స్పష్టం చేశారు. అదే విధంగా ఈ విషయంలో ఎటువంటి ఉల్లంఘనలు గుర్తించినా సరే ఏపీసీఎస్(సర్వీస్ అసోసియేషన్ల గుర్తింపు) నియమాలు-2001 ఏపీ సీఎస్(సీసీఏ) నియమాలు-1991 ప్రకారం చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విభాగాధిపతులు, కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- డ్రోన్లు, యాప్‌లతో దోమల నివారణ
- అధికారుల అలసత్వాన్ని సహించం
- హెచ్చరించిన మంత్రి సత్యకుమార్

అమరావతి, మే 23(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సంక్రమించే వ్యాధుల నివారణకు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో కృషి చేయాలని ఆరోగ్య మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. వర్షాకాలం వ్యాధులు, కొవిడ్ సంక్రమణపై మంత్రి శుక్రవారం ఉన్నతాధికారులతో సమీక్షించారు. అల్లూరి, మన్యం జిల్లాలతో పాటు దోమలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా దోమల నిరోధక రసాయనాలు చల్లాలని ఆదేశించారు. దోమల సాంద్రతను గుర్తించడానికి మస్కిటీర్ యాప్‌ను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అపరిశుభ్రత, నీటి కాలుష్యం, నీటి నిల్వలు, డ్రైనేజీ వ్యవస్థ వైఫల్యం, బహిరంగ మల విసర్జన ద్వారా సంక్రమించే వ్యాధులను అరికట్టడానికి స్థానిక అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ మాత్రలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ముందస్తు చర్యలతో సీజనల్ వ్యాధుల్ని అరికట్టే దిశగా పని చేయాలని, అలసత్వాన్నీ సహించబోమని మంత్రి స్పష్టం చేశారు.

కరోనాపై ఆందోళన వద్దు

విశాఖపట్నంలో కొవిడ్ కేసు నిర్ధారణ నేపథ్యంలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సత్యకుమార్ చర్చించారు. ఆ కుటుంబంలోనే మరొకరితో పాటు, చికిత్స చేసిన ప్రభుత్వ వైద్యుడికి కూడా కరోనా సోకినట్లు వెల్లడించారు. ఏపీలో కరోనా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

జీఏడీ ముఖ్య కార్యదర్శిగా ఎస్.ఎస్.రావత్

అమరావతి, మే 23(ఆంధ్రజ్యోతి): సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ఎస్.ఎస్. రావత్ నియమితులయ్యారు. తీవ్ర అనారోగ్యంతో రావత్ దాదాపు పది నెలల నుంచి సెలవులో ఉన్నారు. ఇటీవల కోలుకున్న ఆయన సీఎస్ వద్ద రిపోర్ట్ చేయడంతో ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ప్రస్తుతం ఎం.వి.శేషగిరి బాబు ఈ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు రావత్ నియామకంతో ఆయన రిలీవ్ అయ్యారు.

ప్రైవేటుకు పర్యాటకం!?

యూనిట్ల అప్పగింతకు ఓ అధికారి అత్యుత్సాహం.. పది నెలలుగా పైసా విదల్చకుండా యూనిట్ల నిర్వీర్యం

- నష్టాల బూచిచూపి ఏపీటీడీసీ అధికారులపై ఒత్తిడి
- సీఎం చంద్రబాబు సూచనలకు విరుద్ధంగా ఆదేశాలు
- అదీ 20 రోజులే డెడ్‌లైన్.. ఏపీటీడీసీలో వ్యతిరేకత



(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

పర్యాటక యూనిట్లను తక్షణం ప్రైవేటు సంస్థల చేతుల్లో పెట్టాలట. దీనికి 20 రోజులే డెడ్‌లైన్. సిబ్బంది గురించి అనవసరం. వచ్చిన వాళ్లు కొనసాగిస్తే ఉంటారు.. లేకపోతే పోతారట! రాష్ట్ర స్థాయిలో ఉన్నత స్థానంలో ఉన్న ఒక కార్యదర్శి నోటి నుంచి వచ్చిన ఆదేశాలు ఇవి! పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆలోచనలను పంచుకోకుండా.. గత పది నెలలుగా పర్యాటక యూనిట్లకు ఎలాంటి ఆర్థిక సహకారం ఇవ్వని ఆ అధికారి.. నష్టాల బూచి చూపి ప్రైవేటుకు అడ్డగోలుగా కట్టబెట్టేందుకు ఏపీటీడీసీ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలకు విరుద్ధంగా, సామాన్యులకు పర్యాటకాన్ని దూరం చేసేలా పర్యాటక యూనిట్లను ప్రైవేటుకు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. దీనిపై ఏపీటీడీసీలో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఈ అధికారి నిర్వాకం కారణంగా యూనిట్లన్నీ ప్రైవేటు కోరల్లో చిక్కుకునే పరిస్థితి నెలకొంది. పర్యాటకం అభివృద్ధి అంటే పర్యాటక యూనిట్లను పూర్తిగా ప్రైవేటు పరం చేయటమా? కనీస మౌలిక వసతుల గురించి పట్టించుకోరా? అన్న విమర్శలు వస్తున్నాయి. పదవీ విరమణ చేస్తున్న దశలో మరికొంత కాలం ఎక్స్‌టెన్షన్ పొందేందుకు ప్రయత్నిస్తున్న ఆ అధికారి తీరుపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రతిపాదనలు బుట్టదాఖలు

విజయవాడ డివిజన్ పరిధిలో కొండపల్లి దగ్గర షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. దీనికి సమీపంలో మరుగుదొడ్లు వంటివి ఏర్పాటు చేస్తే.. ఆ దారిలో వాహనాలలో వెళ్లే వారు కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు ఆగే అవకాశముంది. షాపులను ఏ దుకాణాలకు ఇచ్చినా మంచి వ్యాపారం జరుగుతుంది. మంచి సెంటర్‌గా మారుతుంది. దీని గురించి ప్రతిపాదనలు పంపితే ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. దీని ద్వారా డబ్బులు వచ్చే అవకాశాన్ని వదిలిపెట్టేశారు. కొద్దిగా నిధులు ఖర్చు చేసి దీనిని వినియోగంలోకి తీసుకువస్తే వచ్చే ఆదాయం ద్వారా ఐదారు నెలల్లోనే పెట్టుబడి మొత్తం వచ్చేస్తుంది. ఈ పనులు కూడా చేయకపోతే పర్యాటకాభివృద్ధి సంస్థ ఎందుకో ఆ అధికారే చెప్పాలి.

మౌలిక సదుపాయాలేవీ?

భవానీ ద్వీపం, హరిత బెరం పార్కులు రెండూ కూడా భారీగా లాభాలను తెచ్చిపెడుతున్నాయి. వరదల విధ్వంసం తర్వాత భవానీ ద్వీపాన్ని పునరుద్ధరించటానికి ఒక్క రూపాయి కూడా విదల్చలేదు. ద్వీపం బాగోకున్నా సందర్శకులు వస్తున్నారు. స్థానికంగా అధికారులు, బీఐటీసీ అధికారులు ఇసుక మేటలు తొలగించి, పడిపోయిన చెట్లను తొలగించి, శుభ్రం చేసి సాధారణ స్థితికి తీసుకువచ్చినా.. ఇందులో ఆకర్షణలు, సౌకర్యాలు కల్పించటంపై దృష్టిపెట్టలేదు. కాటేజీలలో రెన్నోవేషన్ పనులను మధ్యలోనే వదిలేశారు. బ్యాంకు రుణంతో చేపట్టే పనులను కూడా ఆపేశారు. కాటేజీలు ఎప్పటికప్పుడు మంచిగా ఉంటేనే పర్యాటకులు బుకింగ్ చేసుకుంటారు. అధ్వానంగా ఉంటే ఎవరూ రారు. గత కొంతకాలంగా కాటేజీల నిర్వహణను పూర్తిగా పట్టించుకోని ఆ అధికారి వీటిని ప్రైవేటుకు ఇస్తారట. వరదలు వస్తే నష్టపోతామని, ఇక్కడ వ్యాపారం చేయలేమని చెబుతూ ప్రైవేటు సంస్థలు వెళ్లిపోతున్నా వదలటం లేదు. రాయితీలు ఇస్తామంటూ వాటిని మభ్య పెడుతున్నారు. వారికి ఇచ్చే రాయితీలలో పావు వంతు ఏపీటీడీసీ కాటేజీలకు ఖర్చు చేసినా కూడా పరిస్థితులు వేరుగా ఉండేవి. భవానీ ద్వీపం, హరిత బెరం పార్కు, సూర్యలంక.. ఇలా అనేక పర్యాటక యూనిట్లలో కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేని పరిస్థితి నెలకొంది. మౌలిక సదుపాయాలు కల్పించకుండా పర్యాటకులను దూరం చేసేలా వ్యవహరించిన ఆ ఉన్నతాధికారి.. నష్టాల్లో ఉన్నాయని చూపుతూ ప్రైవేటు జపం చేస్తున్నారు. ఉన్నతాధికారి వ్యవహారంపై ఏపీటీడీసీలో తీవ్ర చర్చ నడుస్తోంది. పర్యాటక యూనిట్లను కాపాడుకోవటానికి ఎంతవరకైనా వెళతామంటూ ఉద్యోగ సంఘాలు ఆందోళనకు సిద్ధమౌతున్నాయి.

1 నుంచి రేషన్ దుకాణాల్లో సరుకులు

- 15.55 లక్షల మందికి మాత్రమే ఇంటికి సరఫరా

అమరావతి, మే 23(ఆంధ్రజ్యోతి): ఎండీయూ వాహనాలను రద్దు చేసిన ప్రభుత్వం, జూన్ 1వ తేదీ నుంచి చౌక ధరల దుకాణాల ద్వారా కార్డుదారులకు నిత్యావసర సరుకులను పంపిణీని పునఃప్రారంభించాలని ఉత్తర్వులు జారీ చేసింది. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగులు, దృష్టి లోపం ఉన్న 15.55 లక్షల మంది కార్డుదారులకు మాత్రం ఇంటింటికీ సరుకులు అందించాలని పేర్కొంది. 'ఎండీయూ వాహనాల ద్వారా డోర్ డెలివరీ విధానం విఫలమై వీధి డెలివరీగా మారింది. కార్డుదారులు సకాలంలో వెళ్లలేకపోతే సరుకులు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఎండీయూ వాహనాల్లోనే బియ్యం, ఇతర సరుకులను దారి మళ్లించినందుకు రాష్ట్రవ్యాప్తంగా 288 మంది ఎండీయూ ఆపరేటర్లపై కేసులు నమోదయ్యాయి. 570 మంది ఎండీయూ ఆపరేటర్లు రాజీనామాలు చేయడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. కేంద్రం కూడా ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ప్రజాపంపిణీ వ్యవస్థను మెరుగుపరచడానికి, డీలర్ మార్జిన్‌ను పెంచడానికి, ఎఫ్‌పీ షాపుల వ్యవస్థను బలోపేతం చేయడానికి చౌకధరల దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ ఒకటో తేదీ నుంచి నిత్యావసర సరుకుల పంపిణీకి సంబంధించి కార్యాచరణ మార్గదర్శకాలను పౌరసరఫరాల కమిషనర్ జారీ చేస్తారు' అని ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఎస్జీటీలకు కౌన్సెలింగ్ ఎలా..?

- రెండు విధానాలకూ అధికారులు సిద్ధం
- టీచర్లు ఓకే అంటే ఆన్‌లైన్‌లోనే నిర్వహణ

అమరావతి, మే 23(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు కౌన్సెలింగ్ ఎలా జరపాలనే దానిపై స్పష్టత రాలేదు. వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలని తొలుత పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. కానీ మాన్యువల్ కౌన్సెలింగ్ కావాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఆ మేరకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కానీ.. బదిలీల మార్గదర్శకాల్లో మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ ఉంటుందనే విషయం స్పష్టం చేయలేదు. దీనిపై సందిగ్ధత నెలకొన్న నేపథ్యంలో అధికారులు రెండు విధానాలకూ సిద్ధమవుతున్నారు. తొలుత ఉపాధ్యాయ ప్రతినిధులకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ఎలా జరుగుతుందో ఉపయోగాలను వివరించాలని భావిస్తున్నారు. వారు అంగీకరిస్తే ఆన్‌లైన్ విధానం కొనసాగిస్తారు. లేనిపక్షంలో ఓ నిర్ణయం తీసుకుంటారు. అలాగే ప్రస్తుత స్టేషన్‌లో ఎన్నేళ్లు పనిచేసినా గరిష్ఠంగా ఎనిమిదేళ్లకు పాయింట్లు ఇస్తున్నారు. ఎనిమిదేళ్లు దాటిన తర్వాత ఎంతకాలం పని చేస్తే అన్ని పాయింట్లు ఇవ్వాలని టీచర్లు కోరుతున్నారు. అలా ఇస్తే భవిష్యత్తులో ఏవైనా కారణాలు చూపి గరిష్ఠ పరిమితి దాటినా అదే స్టేషన్‌లో కొనసాగేందుకు టీచర్లు పట్టుబట్టే అవకాశం ఉందని అధికార వర్గాలు అంటున్నాయి. అదే ఎన్నేళ్లు ఒకేచోట పనిచేసినా గరిష్ఠంగా ఎనిమిదేళ్లకే పాయింట్లు ఇస్తారనే సంకేతం ఇప్పుడే ఇస్తే.. గరిష్ఠ కాలపరిమితి దాటిన తర్వాత అక్కడే కొనసాగాలని ఎవరూ కోరుకోరని భావిస్తున్నాయి. గతంలో ఎస్జీటీగా పనిచేసి, ఆ తర్వాత వేరే డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం పొందిన వారికి ఎస్జీటీ సర్వీసు పాయింట్లు ఇవ్వడం సాధ్యంకాదని స్పష్టం చేశాయి.

సజ్జల ఎస్టేట్‌లో డ్రోన్ వీడియో చిత్రీకరణ

- భూములు తిరిగి అన్యాక్రాంతం కాకుండా చర్యలు


సజ్జల ఎస్టేట్‌లోని ఆక్రమిత భూములను డ్రోన్‌తో వీడియో చిత్రీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కడప, మే 23(ఆంధ్రజ్యోతి): కడప నగర సమీపంలోని సీకేదిన్నె మండలంలో వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబానికి చెందిన సజ్జల ఎస్టేట్‌లో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న అటవీ, ఇరిగేషన్, అసైన్డ్ భూములను శుక్రవారం డ్రోన్‌తో వీడియో తీశారు. భూములు తిరిగి అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకుగానూ రెవెన్యూ అధికారులు ఈ చర్య చేపట్టారు. ప్రభుత్వం ఇటీవల సర్వే నిర్వహించింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ భూములను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

లోకేశ్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్ చేయాలి

» 'తిరుపతి పార్లమెంటు' మినీ మహానాడులో తీర్మానం

తిరుపతి, మే23(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు అప్పగించాలని తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ మినీ మహానాడులో తీర్మానం చేశారు. ఆ పార్టీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం మినీ మహానాడు జరిగింది. ఈ సందర్భంగా లోకేశ్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చేయాలని శాప్ చైర్మన్ రవి నాయుడు ప్రతిపాదించగా, సభ తీర్మానం చేసింది. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు దీపక్ రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, సుగుణమ్మ, కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్, బొజ్జల సుధీర్, పనబాక లక్ష్మి పాల్గొన్నారు.

ఢిల్లీ స్కామ్ కన్నా ఏపీ లిక్కర్ స్కామ్ పెద్దది

» జలవనరుల శాఖ మంత్రి నిమ్మల



నరసాపురం, మే 23(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం స్కామ్ కన్నా, ఏపీలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం స్కామ్ చాలా పెద్దదని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం సరిపల్లిలో రూ.55 లక్షలతో చేపట్టే మురుగు కాల్వల తవ్వకం పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ మునిగిపోయే నావ అని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ఆరు సీట్లు కూడా రావన్న భయం ఇప్పటి నుంచే నేతల్లో నెలకొందని ఎద్దేవా చేశారు. ప్రజల్ని మభ్యపెట్టడం, మాయ చేయడం జగన్‌కు, సాక్షి మీడియాకే చెల్లిందని విమర్శించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ నాయకర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు ప్రెస్‌మీట్ పెట్టే అర్హత లేదు

» లిక్కర్ స్కామ్‌లో ఆయనా నిందితుడే: మంత్రి సంధ్యారాణి



కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 23(ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్‌లో మాజీ సీఎం వైఎస్ జగన్ కూడా నిందితుడేనని, ఆయనకు ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడే అర్హత లేదని మంత్రి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం కడపకు వచ్చిన ఆమె మీడియాతో మాట్లాడుతూ సొంత బాబాయిని హత్య చేసిన వారు ఎవరనేది జగన్‌కు తెలిసినా, కుటుంబ సభ్యులు చెప్పినా ఎందుకు పట్టించుకోలేదో రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. ఆస్తి కోసం సొంత తల్లిని చెల్లినీ రోడ్డున వేసిన వ్యక్తి జగన్ అన్నారు. ఏది ఏమైనా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో ప్రజలు ప్రశాంతంగా తిరగగలుగుతున్నారని అన్నారు. కనీవినీ ఎరుగనిరీతిలో కడప గడ్డపై మహానాడు సభ జరుగుతుందన్నారు. లోకేశ్‌పై వైసీపీ నేతలు హేళనగా మాట్లాడారని, కానీ ఈ రోజు ఆయన మాట, పనితీరు చూసి తట్టుకోలేనిపరిస్థితికి వచ్చారని వ్యాఖ్యానించారు.

తప్పు చేశారని తేలితే ఎక్కడున్నా లాక్కొస్తారు: గంటా



విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి): తప్పు చేశారని తేలితే విదేశాల్లో దాక్కున్నా లాక్కొస్తారని మాజీ సీఎం జగన్‌ను ఉద్దేశించి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మహానాడులో ఆయన మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వ్యక్తిగత కక్ష సాధింపు రాజకీయాలను పెంచి పోషించిన వ్యక్తి జగన్ అని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో శుక్రవారం వస్తే విశాఖలో ఎవరి భూములకు మూడుతుందోనని భయపడేవారన్నారు. గత ఎన్నికల సమయంలో.. విజయసాయిరెడ్డిని సౌమ్యుడు, మంచివాడు, నిబద్ధత కలిగిన వాడని పొగిడిన జగన్, ఏడాది తిరగక ముందే ఆయన ప్రలోభాలకు అమ్ముడుపోయారని విమర్శించడం విడ్డూరంగా ఉందని ఆక్షేపించారు.











కేంద్రమంత్రులు అశ్వినీ వైష్ణవ్, సీఆర్ పాటిల్, జితేంద్ర సింగ్, రాజ్‌నాథ్‌సింగ్, ప్రహ్లాద్ జోషిలను కలిసిన సీఎం చంద్రబాబు, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని

కేంద్రం అనుమతి రాగానే బనకచర్ల పనులు!

» సముద్రంలో వృథాగా కలిసే నీటినే వాడుకుంటాం: సీఎం

» ఢిల్లీలో నిర్మల, పాటిల్, అమిత్‌షా సహా ఏడుగురు కేంద్ర మంత్రులతో వేర్వేరుగా భేటీ

న్యూఢిల్లీ, మే 23 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో వృథాగా కలిసే గోదావరి జలాలను పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ద్వారా కరువు ప్రాంతాలకు తరలిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు. కేంద్ర ప్రభుత్వ అనుమతి రాగానే దీని పనులు ప్రారంభిస్తామన్నారు. లేపాక్షి- ఓర్వకల్లు ప్రాంతంలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమలు స్థాపిస్తామని, రాష్ట్రానికి ఏరో స్పేస్ ప్రాజెక్టులు కేటాయించాలని కేంద్రాన్ని కోరామని చెప్పారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా శుక్రవారం ఏడుగురు కేంద్ర మంత్రులు.. నిర్మలా సీతారామన్ (ఆర్థిక), అమిత్‌షా (హోం), సీఆర్ పాటిల్(జలశక్తి), రాజ్‌నాథ్ సింగ్ (రక్షణ), జితేంద్రసింగ్ (సైన్స్-టెక్నాలజీ), ప్రహ్లాద్ జోషీ (పునరుత్పాదక ఇంధనం), అశ్వినీ వైష్ణవ్ (రైల్వే, ఐటీ-ఎలక్ట్రానిక్స్)లను కలిసి.. విజ్ఞాపనలు, ఆర్థిక ప్రణాళికలు, ప్రతిపాదనలు సమర్పించారు. సాయంత్రం తన అధికారిక నివాసంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి ఆర్థికసాయంపై కేంద్రం సానుకూలంగా స్పందించిందని చెప్పారు. బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చర్చించానన్నారు. 'ఈ ప్రాజెక్టుకు రూ.80 వేల కోట్లు ఖర్చవుతుంది. దీనిద్వారా 200 టీఎంసీలను మళ్లించవచ్చు. ఈ ప్రాజెక్టుతో ఇతర రాష్ట్రాలకు ఎలాంటి ఇబ్బందీ లేదు. తెలంగాణలో కూడా గోదావరిపై కొన్ని ప్రాజెక్టులు చేస్తున్నారు. అందరితో కలిసి నీటిని వాడుకుంటాం. సముద్రంలోకి పోయే 200 టీఎంసీలను కరువు ప్రాంతాలకు ఉపయోగించాలని నిర్ణయించాం. గోదావరి వరద జలాలను రాష్ట్రంలోని దక్షిణ, మధ్య ప్రాంతాల్లోని నీటి ఎద్దడి ప్రాంతాలకు మళ్లించడమే ఈ స్కీం లక్ష్యం' అని తెలిపారు. జల్‌జీవన్, బ్లూ రివల్యూషన్, మేకిన్ ఇండియా వంటి జాతీయ మిషన్ల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదం చేస్తుందని తెలిపారు. కరువు పీడిత ప్రాంతాల్లోని కోట్లాది మందికి ప్రయోజనం లభిస్తుందని, నదుల అనుసంధానానికి దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందని వివరించారు. 'జూన్‌లోపు ప్రాజెక్టు డీపీఆర్‌ను రూపొందించి సమర్పిస్తాం. పనులను త్వరగా ముందుకు తీసుకెళ్లడానికి తక్షణ అనుమతులు మంజూరు చేయాలని అభ్యర్థించా' అని చెప్పారు. ఆర్థిక మంత్రితో భేటీలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరించానన్నారు. పూర్వోదయ పథకానికి మరిన్ని నిధులు, బనకచర్ల ప్రాజెక్టుకు ఆర్థిక సాయం కోసం తాము అందించిన ప్రతిపాదనలకు ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు. బెంగుళూరు ఎయిర్‌పోర్టు టెర్మినల్-2 చూశానని, చాలా బాగుందని.. దానిని విుంచిన విమానాశ్రయాన్ని అమరావతిలో నిర్మిస్తామని చెప్పారు. రూ.28,346 కోట్ల విలువైన గ్రీన్ ఎనర్జీ కారిడార్‌ను ఏపీకి ఇవ్వాలని కేంద్ర పునరుత్పాదక ఇంధన మంత్రి ప్రహ్లాద్ జోషీని తాను కోరానన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. 'ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా 72 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయాలి. పీఎం సూర్యఘర్ పథకం కింద రాష్ట్రంలో 35లక్షల కుటుంబాలకు సోలార్ రూఫ్ టాప్ సౌకర్యం కల్పించాలని కోరా. కుసుమ్ కింద 2 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తికి కేంద్రం అనుమతి ఇచ్చింది. ఏపీ గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తయారవుతుంది. 24 గంటలూ విద్యుత్ సరఫరాకు వీలవుతుంది' అని వివరించారు.



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం చంద్రబాబు

డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్!

'ఆపరేషన్ సిందూర్' విజయంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను అభినందించానని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ఆర్మీ కంటోన్మెంట్ లేదని... ఏర్పాటు చేయాలని కోరానని.. ఇందుకాయన అంగీకరించారని చెప్పారు. 'డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్ హబ్ కింద రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాలనూ అభివృద్ధి చేయాలని అభ్యర్థించా. జగ్గయ్యపేట-దొనకొండ క్లస్టర్‌లో 6వేల ఎకరాలు ఉంది. ఈ క్లస్టర్‌ను క్షిపణులు-మందుగుండు పరిరక్షణ కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరా. మంత్రి సానుకూలంగా స్పందించారు. లేపాక్షి, మడకశిరలో 10 వేల ఎకరాలు ఉంది. ఈ ప్రాంతంలో మిలిటరీ, సివిల్ ఎయిర్‌క్రాఫ్ట్, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్‌తో ఏరోస్పేస్ ఎకోసిస్టంను తయారు చేయాలని అడిగాం. విశాఖపట్నం, అనకాపల్లి క్లస్టర్‌లో నేవల్ ఎక్విప్‌మెంట్ ప్రొడక్షన్, ఆయుధ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరా. కర్నూలు, ఓర్వకల్లు క్లస్టర్‌లో 4 వేల ఎకరాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, మిలిటరీ డ్రోన్స్ రోబోటిక్స్, అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ కాంపోనెంట్స్‌ను ఉత్పత్తి చేయాలని కోరా. తిరుపతి ఐఐటీలో డీఆర్‌డీవో సెంటర్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశా. శ్రీహరికోట ప్రాంతంలో 2 వేల ఎకరాల్లో క్లస్టర్ ఏర్పాటు చేసి ప్రైవేటు శాటిలైట్ మాన్యుఫ్యాక్చరింగ్ లాంచింగ్ చేపడతాం. దానిపై కసరత్తు జరుగుతోంది. రాష్ట్రంలో రెండు అంతరిక్ష నగరాల అభివృద్ధికి ఆస్కారం ఉంది. షార్ అంతరిక్ష కేంద్ర సమీపంలో, లేపాక్షి వద్ద నిర్మించే ఈ నగరాల్లో ఉపగ్రహాల తయారీ, ప్రయోగ వాహనాల అభివృద్ధి, పరిశ్రమలకు తోడ్పాటు అందించవచ్చు' అన్నారు. ఆయా భేటీల్లో చంద్రబాబుతోపాటు కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, టీడీపీ ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు, పుట్టా మహేశ్, తెన్నేటి కృష్ణప్రసాద్, కలిశెట్టి అప్పలనాయుడు, మాగుంట శ్రీనివాసులురెడ్డి, సానా సతీశ్, బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ పాల్గొన్నారు.

12 గంటలు నిర్విరామ భేటీలు

» ఢిల్లీలో చంద్రబాబు బిజీబిజీ

న్యూఢిల్లీ, మే 23 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఢిల్లీలో బిజీబిజీగా గడిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కేంద్ర మంత్రులు, వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు. 12 గంటల్లో ఏడుగురు మంత్రులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఒక్కొక్కరితో దాదాపు గంట పాటు చర్చించారు. రాష్ట్రానికి సాయం అందించాలని కోరారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆయా కంపెనీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. సాయంత్రం కాస్త సమయం దొరకడంతో మీడియా సమావేశం ఏర్పాటు చేసి.. ఆయా భేటీల వివరాలను వెల్లడించారు. వారితో సమావేశాల్లో అరకు కాఫీ ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. శుక్రవారం ఆయా కేంద్ర మంత్రులు ఆ బాక్సులు అందుకుంటున్న సమయంలో.. అరకు కాఫీ రుచిపై సంతోషం వ్యక్తం చేస్తూ ప్రశంసలు కురిపించినట్లు తెలిసింది. సీఆర్ పాటిల్ మాత్రం అరకు కాఫీ బాగుందని, అయితే తాను ఎక్కువగా టీ తాగుతానని చెప్పినట్లు సమాచారం. తిరుమల లడ్డూ నాణ్యత బాగుందని మరో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ మెచ్చుకున్నారు. తిరుమలలో ఇటీవల తీసుకొచ్చిన మార్పులను కూడా ప్రశంసించారు. టీడీపీ కూటమి పాలనలో అక్కడ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలూ కలుగడం లేదని తెలిపారు.

ఎలక్ట్రానిక్స్ సిటీ ఏర్పాటుకు సిద్ధం: సీఎం

» యాపిల్, ఇతర కంపెనీల ప్రతినిధులతో భేటీ

» జేఎస్‌డబ్ల్యూ స్టీల్ చైర్మన్ సజ్జన్ జిందాల్‌తోనూ..

యాపిల్, తదితర కంపెనీల ప్రతినిధులు ఢిల్లీలో సీఎం చంద్రబాబును ఆయన నివాసంలో కలిశారు. బెంగళూరు-హైదరాబాద్ కారిడార్‌లోని లేపాక్షి- ఓర్వకల్లు మధ్య ఎలక్ట్రానిక్స్ సిటీ కట్టడానికి ఆయా కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని, మూడు నెలలలో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చాయని ఆయన మీడియాకు తెలిపారు. ఆ కంపెనీలతో త్వరలో ఎంవోయూలు చేసుకుంటామని, భూకేటాయింపులు, ఇతరత్రా అంశాలను ఖరారు చేసి ముందుకెళ్తామని చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి తమ ప్రభుత్వ బాధ్యత అని, ఫలితంగా ఉద్యోగాల కల్పనతో పాటు అభివృద్ధి జరుగుతుందన్నారు. కాగా.. జేఎస్ డబ్ల్యూ స్టీల్ చైర్మన్ సజ్జన్ జిందాల్ కూడా చంద్రబాబును కలిశారు. రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలపై ఇరువురూ నిర్మాణాత్మక చర్చించారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

మూడు రోజుల్లో మహానాడు!

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్న నిర్ణయాలపై గత నాలుగైదు రోజులుగా తీర్మానాల కమిటీ కసరత్తు చేసింది. ఎప్పటికప్పుడు చర్చల వివరాలను పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు తెలియజేశారు. సుమారు 16 తీర్మానాలను మహానాడులో పెట్టాలని ప్రాథమికంగా నిర్ణయించారు. వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉంది. తీర్మానాల కమిటీలో సభ్యుడు, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మహానాడు తీర్మానాలపై చర్చలు తుది దశకు వచ్చాయన్నారు. తీర్మానాలపై చంద్రబాబు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఇప్పటికే పలు దఫాలు చర్చించారని, శనివారం మరోసారి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి తీర్మానాలపై తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఏపీ నుంచి 13 లేదా 14 ముసాయిదా తీర్మానాలు ఉంటాయని, తెలంగాణ నుంచి 5 తీర్మానాల వరకు ఉంటాయని, ఉమ్మడిగా 4 తీర్మానాలు ఉంటాయని వివరించారు.

సీమ అభివృద్ధిపై ప్రత్యేక చర్చ

రాయలసీమ అభివృద్ధి కోసం టీడీపీ అధికారంలో ఉన్న ప్రతిసారీ చేసిన కృషిపై ప్రత్యేకంగా చర్చించనున్నారు. 2014 నుంచి సీమలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.12 వేల కోట్లు ఖర్చు చేశారు. కొప్పర్తిలో పారిశ్రామిక హబ్, ఓర్వకల్ హబ్, కియా, విండ్, సోలార్ పవర్ యూనిట్ల ద్వారా లక్షల్లో ఉద్యోగ, ఉపాధి కల్పనకు టీడీపీ కృషి చేస్తోంది. హార్టికల్చర్, పరిశ్రమలు, డెయిరీల అభివృద్ధి తదితరవాటన్నింటిపైనా చర్చించి.. ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు.

ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్

ఏడాది పాలనలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పింఛన్ల పెంపు, ఉచితంగా 3 సిలిండర్లు, అన్న క్యాంటీన్లు, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ.. తదితర వాటిపై ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడంతోపాటు మేనిఫెస్టో హామీల అమలుపైనా రెండో రోజు చర్చించనున్నారు.

పార్టీ సంస్థాగత అంశాలపై..

మహానాడు తొలిరోజే పార్టీ సభ్యత్వం, సంస్థాగత నిర్మాణంపై చర్చించనున్నారు. క్లస్టర్ యూనిట్, బూత్, గ్రామ, వార్డు, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీల ప్రాధాన్యతలను వివరించనున్నారు. ఆయా కమిటీల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన నాయకులు, కార్యకర్తలు తమ అనుభవాలను పంచుకోనున్నారు.

ప్రభుత్వ కొనసాగింపుపై!

రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం నిరంతరాయంగా అధికారంలో కొనసాగడం వల్ల జరిగే అభివృద్ధి, ప్రజా ప్రయోజనాలను మహానాడులో నేతలు వివరించనున్నారు. గుజరాత్‌లో గత మూడు దశాబ్దాలుగా బీజేపీ అధికారంలో ఉండటం వల్ల ఆ రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి సాధ్యమైంది. దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో ఒకటిగా ఉంది. మన రాష్ట్రంలోనూ ఒకే ప్రభుత్వం కొనసాగింపు వల్ల 'స్వర్ణాంధ్ర' కల సాకారానికి మార్గం సుగమం అవుతుందని నేతలు వివరించనున్నారు.



కడపలో మహానాడు సభాప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మంత్రులు, పార్టీ నాయకులు

'మై టీడీపీ యాప్'

పార్టీ, ప్రజలకు మధ్య అనుసంధానానికి మహానాడు వేదిక ద్వారా 'మై టీడీపీ యాప్'ను ఆవిష్కరించనున్నారు. ఈ యాప్ ద్వారా పార్టీ కార్యకర్తల నుంచి పొలిట్‌బ్యూరో సభ్యుడి వరకు వారి పనితీరును బేరీజు వేయనున్నారు. తద్వారా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభించనుంది. అదేవిధంగా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఈ యాప్ ఉపయోగపడనుంది.

మూడో రోజు భారీ సభ

2024 ఎన్నికల్లో ఘన విజయం సాధించిన అనంతరం జరుగుతున్న కడప మహానాడును భారీ ఎత్తున నిర్వహించాలని పార్టీ పెద్దలు భావిస్తున్నారు. కడపలోని 10 అసెంబ్లీ సీట్లలో 7 స్థానాలను టీడీపీ కైవశం చేసుకుంది. మహానాడు చివరి రోజైన 29న సుమారు 5 లక్షల మందితో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. సీమ జిల్లాలతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని 50 నియోజకవర్గాల నుంచి జన సమీకరణ చేయనున్నారు. ఈ మేరకు రవాణా కోసం ప్రైవేటు, ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకోవాలని నిర్ణయించారు. బహిరంగసభకు 50వేలకు పైగా వాహనాల్లో ప్రజలు వస్తారని అంచనా. సుమారు 150 ఎకరాల్లో వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయించారు.

మంత్రుల పర్యవేక్షణ

మహానాడు పనుల పర్యవేక్షణకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు 2 రోజులుగా కడపలోనే మకాం వేశారు. శుక్రవారం మంత్రులు అనగాని, రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి, గుమ్మిడి సంధ్యారాణి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

ఎల్లుండికల్లా పనులు పూర్తి!

మహానాడు వేదిక పనులు శరవేగంగా సాగుతున్నాయి. కడప నగర శివారులోని రింగు రోడ్డు సమీపాన పబ్బాపురం వద్ద 125 ఎకరాల స్థలంలో మహానాడు నిర్వహించనున్నారు. ప్రస్తుతం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. తొలి రెండు రోజులు నిర్వహించే ప్రతినిధుల సభకు 23 వేల మంది హాజరు కానున్నారు. ఆ వేదిక పనులు చివరి దశకు చేరుకున్నాయి. చివరి రోజున 5 లక్షల మందితో బహిరంగసభ నిర్వహించనున్నారు. ఆ వేదిక పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయి. పార్టీ అధినేత చంద్రబాబు మూడు రోజులపాటు కడపలోనే బస చేయనున్నారు. భోజనశాల, ఎగ్జిబిషన్, రక్తదాన శిబిరం పనులన్నీ 70 శాతానికి పైగా పూర్తయ్యాయి. సోమవారం నాటికి పనులు పూర్తవుతాయని నాయకులు తెలిపారు. బహిరంగసభకు భారీ ఎత్తున ప్రజలు, పార్టీ అభిమానులు హాజరు కానుండడంతో నెట్‌వర్క్‌కు ఇబ్బంది లేకుండా ఎయిర్‌టెల్, జియో, బీఎస్ఎన్ఎల్ ఇతర కంపెనీలకు చెందిన 4 మొబైల్‌టవర్లను మైదానంలో ఏర్పాటు చేశారు.

14 ముసాయిదా తీర్మానాలు

1. ఎన్డీయే కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలోనే సాధించిన ఘనవిజయాలు.
2. శరవేగంగా ప్రాజెక్టుల నిర్మాణం.(నదుల అనుసంధానం, బనకచర్లకు గోదావరి జలాలు)
3. ఒకే రాజధాని అమరావతి, అభివృద్ధి వికేంద్రీకరణ.(ప్రజారాజధాని అమరావతి నిర్మాణం. పట్టణ, గ్రామీణాభివృద్ధి, పెట్టుబడులతో వికేంద్రీకరణ. 175 నియోజకవర్గాలకు 175 పారిశ్రామిక పార్కులు. జగన్ పాలనలో దోపిడీకి గురైన ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధిపై దృష్టి)
4. విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు.
5. మహిళ, యువత సంక్షేమానికి పెద్దపీట.
6. సాంకేతిక పరిజ్ఞానంతో లాభసాటి వ్యవసాయం.
7. కట్టుదిట్టంగా శాంతిభద్రతలు.
8. చంద్రన్న విజన్‌తో సంక్షేమ రాజ్యం. అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం.
9. మౌలిక సదుపాయాల అభివృద్ధి, కేంద్రంతోడ్పాటు.
10. పేదరికం లేని సమాజ నిర్మాణ సంకల్పంతో 'పీ-4'.
11. సాకారమైన విజన్ 2020.. స్వర్ణాంధ్ర విజన్-2047 సాధన దిశగా అడుగులు.
12. విద్యుత్తు రంగంలో విప్లవాత్మక విజయాలు.
13. విపక్ష నేతగా విఫలమైన జగన్.
14. సహజ వనరుల పరిరక్షణ, అక్రమార్కులపై చర్యలు.

ఉమ్మడి తీర్మానాలు

1. తెలుగువారి చరిత్రలో ఎన్టీఆర్ ప్రత్యేకత.
2. తెలుగువారి చరిత్రలో చంద్రన్న మైలురాళ్లు/ముద్ర.
3. అమరులైన టీడీపీ కార్యకర్తలు, నాయకులకు ఘన నివాళి.
4. కార్యకర్తల సంక్షేమం.

పసుపుదళానికి నూతనోత్తేజం!

» మహానాడులో 6 కీలక అంశాల ప్రతిపాదన

తెలుగుదేశం పార్టీని మరో 4 దశాబ్దాలపాటు నూతనోత్తేజంతో నడిపించడానికి అవసరమైన కీలక నిర్ణయాలకు కడప మహానాడు వేదికగా నిలవనుంది. పార్టీ మూల సిద్ధాంతం స్ఫూర్తితో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా పార్టీలో కీలక మార్పులు తీసుకురావాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ భావిస్తున్నారు. ఈ క్రమంలో ఆరు కీలక అంశాలను మహానాడులో ప్రతిపాదించనున్నారు. ఆ ప్రతిపాదనలు ఇవీ..

1. **తెలుగుజాతి.. విశ్వఖ్యాతి:** తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసేందుకు.. తెలుగువారు ఎక్కడున్నా ఏ రంగంలో ఉన్నా నంబర్-1గా ఎదగాలనే లక్ష్యంతో 'నా తెలుగు కుటుంబం' ఐడియాలజీని ప్రతిపాదించనున్నారు.
2. **స్త్రీ శక్తి:** మహిళా సాధికారత, మహిళా శక్తిని చాటేలా స్త్రీ శక్తి పేరుతో ఈ వర్గానికి మద్దతు ఇవ్వనున్నారు. రానున్న రోజుల్లో మహిళలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు 'స్త్రీ శక్తి'ని మరింత బలోపేతం చేసి ఉన్నత స్థాయికి తీసుకెళ్లనున్నారు.
3. **సోషల్ రీఇంజనీరింగ్:** పేదరికం లేని సమాజం చూడాలన్న లక్ష్యంతో 'పీ-4'ను అమలు చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని కులాలకు సామాజిక సమన్యాయంపై ఐడియాలజీని రూపొందించనున్నారు. ప్రతి వర్గానికీ న్యాయం చేసేలా సోషల్ రీఇంజనీరింగ్ చేయనున్నారు.
4. **యువగళం:** పార్టీలో యువతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు అవసరమైన చర్యలు, ఐడియాలజీపై చర్చించనున్నారు. యువతకు అవకాశాలు సృష్టించి ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు నిరంతర ప్రణాళిక అమలు చేస్తారు.
5. **అన్నదాతకు అండ:** ఇరిగేషన్ ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం, సాంకేతికంగా రైతును బలోపేతం చేయడం, సబ్సిడీలు ఇచ్చి ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పంటలు పండించేలా చేయడంపై దృష్టి పెట్టనున్నారు. 'అన్నదాతకు అండ' అనే విధానాన్ని విస్తృతపరచనున్నారు.
6. **కార్యకర్తే అధినేత:** టీడీపీ కార్యకర్తల సంక్షేమం కోసం, వారికి చేయూత అందించేలా ఐడియాలజీ రూపొందించనున్నారు. కార్యకర్తే అధినేత అనేది తెలుగుదేశం పార్టీ నినాదం, విధానంగా ఉండబోతోంది. సీనియర్లను గౌరవించడం, యువతను ప్రోత్సహించడం, కష్టపడేవారికి మద్దతుగా నిలవడం వంటి కార్యక్రమాలు అమలు చేయనున్నారు.

అమరావతి అధికారికం!

(మొదటి పేజీ తరువాయి)

పదేళ్లు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా కొనసాగుతుందని పేర్కొన్నారని, ఇప్పుడా గడువు పూర్తయి అమరావతి రాజధానిగా ఏర్పడినందున.. ఆ విషయాన్ని పేర్కొంటూ చట్టాన్ని సవరించి నోటిఫై చేయాల్సి ఉంటుందని అమిత్ షాకు వివరించానని తెలిపారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లోనే చట్టాన్ని సవరించే అవకాశాలున్నాయని చెప్పారు. హోం మంత్రితో కలిసి శాంతి భద్రతల పరిస్థితిని సమీక్షించానన్నారు. జగన్ మద్యం కుంభకోణంపై కూడా యథాప్రకారం చర్చించానని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. మద్యం స్కాంలో అమాయకులను అరెస్టు చేశారని జగన్ అంటున్నారని ప్రస్తావించగా.. దర్యాప్తు సాగుతోందని, నేరస్థుల నిర్ధారణ జరుగుతోందని చెప్పారు. కొత్తగా ఆమోదించిన క్రిమినల్ లా చట్టాల గురించి అమిత్ షాతో చర్చించానన్నారు. రాజధానికి అంత భూమి ఎందుకని జగన్ అడిగిన ప్రశ్నకు చంద్రబాబు స్పందించారు. ఆయనకొచ్చిన నష్టమేమిటని నిలదీశారు. 'హైదరాబాద్ వంటి నగరాల అభివృద్ధి ఎలా జరిగిందో తెలుసుకోవాలి. తెలిసీ తెలియనితనంతో, మూర్ఖత్వంతో ఆయన వ్యాఖ్యలు చేస్తున్నారు. అభివృద్ధిలో భాగస్వామ్యం ఇచ్చేలా నచ్చజెబితే రాజధాని కోసం 29 వేల మంది 34 వేల ఎకరాలు ఇచ్చారు. వారిలో విశ్వాసం కల్పించాం. త్యాగం చేస్తే నష్టపోరని చెప్పాం. రాజధానికి ఏం డబ్బు ఖర్చు పెట్టాం? చరిత్రలో ఇలాంటి ప్రయోగం అమరావతిలోనే సాధ్యమైంది. నేను వ్యక్తులకు సమాధానం చెప్పదలుచుకోలేదు. తెలుగు జాతికి సమాధానం చెప్పదలుచుకున్నా. బెంగళూరు, హైదరాబాద్ విమానాశ్రయాల కంటే అధునాతన విమానాశ్రయం అమరావతిలో ఏర్పడుతుంది. విశాఖను కూడా ఉత్తమ నగరంగా, ఆర్థిక కేంద్రంగా మార్చేందుకు కార్యాచరణ పథకం చేపట్టాం' అని వివరించారు.

పట్టాలు తప్పిన అభివృద్ధి..

జగన్ హయాంలో రాష్ట్రంలో తీవ్ర విధ్వంసం జరిగిందని, మరమ్మతులు చేయలేనంతగా నష్టం చేశారని, అభివృద్ధి పూర్తిగా పట్టాలు తప్పిందని చంద్రబాబు చెప్పారు. ఆర్థికంగా వెసులుబాటు లేకుండా చేశారని.. రూ.లక్షా 20 వేల కోట్ల బిల్లులు బకాయిలు పెట్టి పోయారని.. రూ.9.94 లక్షల కోట్ల అప్పులు చేశారని ధ్వజమెత్తారు. చరిత్రలో ఎన్నడూ లేని విధ్వంసాన్ని చేసినందుకు జగన్‌ను ప్రజలు శిక్షించారని.. 93 శాతం స్ట్రైక్ రేట్‌తో కనీవినీ విజయాన్ని తమకిచ్చారని తెలిపారు. ఆర్థిక వ్యవస్థను పట్టాలపైకి తెచ్చి పునర్నిర్మాణం చేయడం తప్ప వేరే మార్గం లేదన్నారు. 92 కేంద్ర ప్రాయోజిత పథకాలకు నిధులు మంజూరు చేస్తే.. వేరే కార్యక్రమాలకు మళ్లించారని, దీంతో వాటిని కేంద్రం బ్లాక్ లిస్ట్ చేసిందని.. తామొచ్చాక వాటిలో 74 పథకాలను పునరుద్ధరించామని చెప్పారు. జల్ జీవన్ మిషన్‌ను అమలు చేయలేదన్నారు. ఒకవైపు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తూ.. మరోవైపు అమరావతిలో రాజధానిని నిర్మిస్తూ.. ఇంకోవైపు విశాఖ అభివృద్ధినీ చేపట్టామని చెప్పారు. స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీకి తెచ్చి గాడిలో పెట్టామని, రైల్వే జోన్‌ను ప్రారంభించామని వివరించారు.

పోలవరం.. తెలుగుజాతికి వరం

పోలవరం ఏపీ స్వప్నమని, తెలుగుజాతికి వరమని చంద్రబాబు అన్నారు. జగన్ డయాఫ్రం వాల్‌ను గోదావరిలో కలిపేశారని.. గతంలో 400 కోట్లతో నిర్మించిన ఈ వాల్‌ను ఇప్పుడు కొత్తగా రూ.980 కోట్లతో పునర్నిర్మిస్తున్నామని.. రెట్టింపు కంటే ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వచ్చిందని ఆయన చెప్పారు.

'జల రవాణా'లో పెట్టుబడులు పెట్టండి

» వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్‌గా శివప్రసాద్ బాధ్యతలు



అమరావతి, మే23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జల మార్గాల అనుసంధానంతో జల రవాణా సులభతరం చేసేందుకు కృషి చేస్తానని ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ జెడ్.శివప్రసాద్ చెప్పారు. జల రవాణా రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కోరారు. శుక్రవారం తాడేపల్లిలోని వాటర్‌వేస్ అథారిటీ కార్యాలయంలో చైర్మన్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ దేశీయ జల మార్గం ద్వారా వస్తు, ప్రజల రవాణా వల్ల ఖర్చు తగ్గడంతో పాటు, రోడ్ ట్రాఫిక్ తగ్గుతుందని చెప్పారు. రోడ్డు, రైలు రవాణా కంటే జల రవాణా ఖర్చు తక్కువగా ఉంటుందన్నారు. తక్కువ ఖర్చుతో జల రవాణా, కార్గో సేవలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు.

మూడేళ్ల చిన్నారిని చిదిమేశాడు..!

పెళ్లికి వచ్చిన పాపపై యువకుడి అత్యాచారం

ఆపై దారుణంగా కొట్టి హత్య.. ముళ్లపొదల్లో మృతదేహం

వైఎస్సార్ కడప జిల్లాలో దారుణం..

జమ్మలమడుగు/ మైలవరం, మే 23 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులతో కలిసి పెళ్లికి వచ్చిన మూడేళ్ల చిన్నారిపై ఓ యువకుడు దారుణానికి ఒడిగట్టాడు. అందరూ పెళ్లి హడావుడిలో ఉండగా.. ఆ పసిపాపను ఆడిస్తున్నట్లు నటిస్తూ చర్చి వెనక్కు తీసుకెళ్లి అత్యాచారం చేసి చంపేశాడు. ఈ దారుణ ఘటన వైఎస్సార్ కడప జిల్లా మైలవరం మండలం ఎ.కంబాలదిన్నెలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఎ.కంబాలదిన్నె గ్రామానికి చెందిన యువకుడికి జమ్మలమడుగు మండలం మోరగుడి గ్రామానికి చెందిన యువతికి శుక్రవారం వరుడి గ్రామంలోని చర్చిలో వివాహం జరిగింది. ఈ పెళ్లికి ప్రొద్దుటూరు మండలం అమృతనగర్ గ్రామానికి చెందిన తల్లిదండ్రులు తమ మూడేళ్ల కుమార్తెను తీసుకుని గురువారమే వచ్చారు. కాగా.. మోరగుడి నుంచి దూదేకుల రహమతుల్లా (26) కూడా ఈ వివాహానికి హాజరయ్యాడు. రహమతుల్లా గురువారం రాత్రి చర్చివద్ద చిన్నారితో ఆడుకుంటూ కనిపించాడు. శుక్రవారం మధ్యాహ్నం వివాహమైన తర్వాత చిన్నారి కనపడడం లేదనే విషయాన్ని గుర్తించారు. బాలిక తల్లిదండ్రులతోపాటు అందరూ చుట్టుపక్కల వెదకడం ప్రారంభించారు. కాగా, అంతకుముందే అందరూ పెళ్లి హడావుడిలో ఉండగా.. రహమతుల్లా చిన్నారిని మాయమాటలు చెప్పి చర్చి వెనక్కు తీసుకెళ్లాడు. ఆమె నోట్లో అరటిపండు కుక్కి అత్యాచారం చేశాడు. అనంతరం బాలికను దారుణంగా కొట్టి చంపి.. మృతదేహాన్ని ముళ్లపొదల్లో పడేశాడు. ఆపై ఏమీ ఎరగనట్టు చర్చిలోకి వచ్చాడు. అయితే బాలిక కోసం వెదుకుతున్న కొందరు రహమతుల్లా చొక్కాపై రక్తపు మరకలు గమనించి అతన్ని నిలదీశారు. బాలిక తల్లిదండ్రులు కూడా తమ కుమార్తె ఎక్కడని ప్రశ్నించగా.. అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఇంతలో కొందరు చర్చి వెనుక ముళ్లపొదల్లో పడిఉన్న చిన్నారి మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న తలమంచిపట్నం పోలీసులు అక్కడకు చేరుకుని నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాధిత కుటుంబసభ్యులు, బంధువులు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. రహమతుల్లాను తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. నిందితుడు తప్పతాగి ఈ దారుణానికి పాల్పడ్డాడని చిన్నారి తండ్రి ఆవేదన వ్యక్తం చేశాడు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పదోతరగతి వరకు చదివిన రహమతుల్లా జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. అతని తల్లి కువైట్‌లో ఉన్నారు. తండ్రి కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.



నిందితుడు రహమతుల్లా

రైల్వే స్టేషన్‌లో పెచ్చులూడి పడి బాలుడి మృతి

గుంతకల్లులో విషాదం

గుంతకల్లు, మే 23(ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖ నిర్లక్ష్యం అభంశుభం తెలియని ఓ పసివాడి ప్రాణాన్ని బలి తీసుకుంది. గుంతకల్లు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై పెచ్చులు ఊడి తలపై పడడంతో మణికంఠ (7) అనే బాలుడు మృతి చెందాడు. కర్నూలుకు చెందిన బ్యాంకు ఉద్యోగి వెంకటేశ్వర్లు కుటుంబంతో తమిళనాడులోని రామేశ్వరం తదితర పుణ్యక్షేత్రాల సందర్శనకు బయల్దేరాడు. వారు ఎక్కాల్సిన అహ్మదాబాద్-తిరుచినాపల్లి ప్రత్యేక రైలు (నంబర్ 09419) శుక్రవారం ఉదయం 6:40 గంటలకు గుంతకల్లు స్టేషన్‌కు వస్తుంది. దీంతో గురువారం రాత్రికే వారు కర్నూలు నుంచి గుంతకల్లు చేరుకున్నారు. పదిమంది కుటుంబ సభ్యులు రైల్వేస్టేషన్‌లోని 7వ నంబరు ప్లాట్‌ఫాంపై పడుకున్నారు. అయితే గోడపక్కన నిద్రిస్తున్న మణికంఠ తలపై తెల్లవారుజామున 4:30 గంటల ప్రాంతంలో గోడకు ఉన్న ప్లాస్టింగ్ పెచ్చు ఊడి పడింది. తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు బాలుడిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసుల సహకారంతో తొలుత రైల్వే ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పల్స్ రేట్ తక్కువగా ఉండటం, బాలుడు కోమాలోకి వెళ్లడంతో స్థానిక వైద్యులు అనంతపురం తీసుకెళ్లాలని సూచించారు. దీంతో తల్లిదండ్రులు అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మణికంఠ మృతిచెందాడు. రైల్వే అధికారుల నిర్లక్ష్యంకారణంగానే బాలుడు మరణించాడని సీపీఐ, సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన నిర్వహించారు.



మృతిచెందిన మణికంఠ

సుప్రీంలో కసిరెడ్డికి చుక్కెదురు



- రాజ్, ఆయన తండ్రి పిటిషన్ల కొట్టివేత
- మద్యం కేసులో ధర్మాసనం తీర్పు

న్యూఢిల్లీ, మే 23(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో కీలక నిందితుడు రాజ్ కసిరెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. రాజ్ కసిరెడ్డితో పాటు ఆయన తండ్రి దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నందున బెయిల్ కోసం సంబంధిత కోర్టునే ఆశ్రయించాలని సుప్రీంకోర్టు సూచించింది. మద్యం కుంభకోణం కేసులో సీఐడీ సీఆర్పీసీ 160 ప్రకారం తనకు నోటీసులు జారీ చేసిందని, హైదరాబాద్‌లో ఉంటున్న తనకు నోటీసులు జారీ చేసే అధికారం ఏపీ సీఐడీకి లేదంటూ ఏప్రిల్ 10న రాజ్ కసిరెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన కుమారుడు రాజ్ కసిరెడ్డి అరెస్టు అక్రమమని, తన కుమారుడికి జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను చట్టవిరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ ఆయన తండ్రి ఉపేందర్ రెడ్డి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయగా.. ఏసీబీ కోర్టు ఉత్తర్వుల్లో జోక్యానికి న్యాయస్థానం నిరాకరించింది. హైకోర్టు తీర్పును మే 9న ఉపేందర్ రెడ్డి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ రెండు పిటిషన్లపై సుదీర్ఘ వాదనల తర్వాత గత సోమవారం సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. శుక్రవారం జస్టిస్ జేబీ పార్దివాలా నేతృత్వంలో జస్టిస్ మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తుది తీర్పు వెలువరించింది. అరెస్టు అక్రమమా? కాదా? అనే అంశంలోకి తాము వెళ్లడం లేదని ధర్మాసనం తెలిపింది. రాజ్ కసిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లోని అవినీతి నిరోధక చట్టం సెక్షన్లు 17ఏ, 19పై తమకు కొన్ని ప్రశ్నలు ఉన్నందున, దానిని విస్తృత ధర్మాసనం పరిశీలనకు ప్రతిపాదిస్తున్నట్లు జస్టిస్ పార్దివాలా తెలిపారు. రాజ్ కసిరెడ్డి జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నందున ఏదైనా రెగ్యులర్ బెయిల్ దరఖాస్తు పెండింగ్‌లో ఉంటే, దానిని వీలైనంత త్వరగా విచారణకు తీసుకోవాలని సంబంధిత కోర్టుకు సూచించారు. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, సిద్ధార్థ్ అగర్వాల్, పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది మహేశ్ జెఠ్మలానీ, అల్లంకి రమేశ్ వాదనలు వినిపించారు.

పీఎస్ఆర్ గెస్ట్‌హౌస్‌లో సీఐడీ సోదాలు

- జెత్వానీ కేసులో డాక్యుమెంట్లు స్వాధీనం

అమరావతి, మే 23(ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు అతిథిగృహంలో సీఐడీఅధికారులు సోదాలు చేపట్టారు. శుక్రవారం హైదరాబాద్ శివారులోని మొయినాబాద్‌లో ఉన్న పీఎస్ఆర్ గెస్ట్ హౌస్‌కు అధికారులు వెళ్లారు. ఈ కేసులో ఆధారాల కోసం సోదాలు చేశారు. 2023 డిసెంబరులో ముంబై పోలీసులకు ఆయన పంపిన మెయిల్ ఆధారాలతో పాటు కొన్ని డాక్యుమెంట్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించి నివేదిక తెప్పించుకున్న తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశముంది.

మీ పోస్టులు శ్రుతిమించాయ్!

సజ్జల భార్గవ్‌రెడ్డిపై సుప్రీంకోర్టు ఆగ్రహం





- ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత
- రెండువారాల పాటు మధ్యంతర రక్షణ
- రెగ్యులర్ బెయిల్ కోసం ఎస్సీ, ఎస్టీ కోర్టుకు వెళ్లాలని సూచన

న్యూఢిల్లీ, మే 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా మాజీ కన్వీనర్ సజ్జల భార్గవ్‌రెడ్డిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సామాజిక మాధ్యమం వేదికగా ఆయన పెట్టిన పోస్టులపై తీవ్ర అభ్యంతరం తెలిపింది. అవి శ్రుతిమించాయని.. భరించరాని స్థాయికి వెళ్లాయని స్పష్టంచేసింది. ఏ ఉద్దేశంతో ఆ పోస్టులు పెట్టారో అర్థం చేసుకోలేమా అని నిలదీసింది. ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. 2023లో టీడీపీ అధినేత చంద్రబాబు, అప్పటి తెలుగు మహిళ అధ్యక్షురాలు అనిత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగలపై అనుచిత పోస్టులు పెట్టారని.. అవి తీసివేయాలని అడిగినందుకు తనను చంపుతానని బెదిరించి.. కులం పేరుతో తనను, అనితను దూషించారని కడప జిల్లా పులివెందులలో కొండప్పగారి హరి అనే దళితుడి ఫిర్యాదు మేరకు గతేడాది నవంబరులో సజ్జల భార్గవ్‌రెడ్డి, జగన్‌కు వరుసకు మేనల్లుడయ్యే సింగారెడ్డి అర్జున్‌రెడ్డి, వైసీపీ సోషల్ మీడియాకు చెందిన వర్రా రవీందర్‌రెడ్డిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఆ కేసులో బెయిల్ కోరుతూ భార్గవ్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా నిరాశే ఎదురైంది. దీంతో ఈ నెల 13న ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్ శుక్రవారం జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. భార్గవ్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే వాదనలు వినిపించారు. ఇది రాజకీయ దురుద్దేశంలో పెట్టిన కేసన్నారు. 2021లో ఘటన జరిగితే ఉద్దేశపూర్వకంగానే నాలుగేళ్ల తర్వాత విచారణ చేపట్టారని.. భార్గవ్‌రెడ్డి వేరేవాళ్లు చెప్పిన అంశాలను మాత్రమే పోస్టు చేశారని తెలిపారు. అయితే ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. ఇప్పుడు సామాజిక మాధ్యమాల దుర్వినియోగం ఎక్కువైపోయిందని.. ఇలాంటి కేసుల్లో బెయిల్ సులభంగా దొరికితే.. ఆ తర్వాత సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేసే వారిని నియంత్రించలేమని అభిప్రాయ పడింది. ఇది రాజకీయాలతో కూడిన అంశమని, కేసు పూర్తిగా అక్రమమని, దీనికి సంబంధించి మరిన్ని వివరాలను న్యాయస్థానం ముందుంచేందుకు సిద్ధంగా ఉన్నామని దవే మరోసారి వాదనలు వినిపించేందుకు ప్రయత్నించడంతో ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. 'మీరు ఎటువంటి పోస్టులు పెట్టారో మాకు తెలియదని అనుకుంటున్నారా? సోషల్ మీడియాలో మీ పోస్టులు మాకు అర్థం కాలేదనుకున్నారా? ఏ ఆలోచనతో పోస్టులు పెట్టారో ఆ మాత్రం అర్థం చేసుకోలేమా? మీ పోస్టులు శ్రుతిమించాయి. భరించరాని స్థాయికి వెళ్లాయి. ఇది రాజకీయమా.. మరొకటా అనేది మాకు అనవసరం. ఇలాంటి అంశాల్లో రాజకీయాలు అప్రస్తుతం. మీరు పెట్టిన పోస్టుల గురించి మాత్రమే మేం మాట్లాడుతున్నాం. తప్పు ఎవరు చేసినా తప్పే. ఇలాంటి వాటిని వ్యవస్థ క్షమించదు. తప్పక శిక్షిస్తుంది. సోషల్ మీడియా దుర్వినియోగం కేసుల్లో త్వరగా బెయిల్ వస్తుందనుకోవద్దు. అలా బెయిల్ వస్తే ప్రతి ఒక్కరూ ఇష్టారీతిన వ్యవహరిస్తారు. ఇటువంటి చర్యలు మేమెప్పటికీ క్షమించం' అని తేల్చిచెప్పింది. ముందస్తు బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ, ఆయన పిటిషన్‌ను కొట్టివేసింది. అయితే రెగ్యులర్ బెయిల్ కోసం ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక కోర్టులో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. రెండు వారాలు మధ్యంతర రక్షణ కల్పిస్తున్నట్లు తెలిపింది. కోర్టులకు వేసవి సెలవులు ఉన్నాయని.. మూడు వారాలైనా రక్షణ కల్పించాలని దవే పదే పదే విజ్ఞప్తి చేసినప్పటికీ ధర్మాసనం అంగీకరించలేదు.



సిరాజ్, సమీర్‌ను జైలునుంచి విజయనగరం తీసుకువస్తున్న పోలీసులు

ఉగ్రవాదంవైపు ఎవరు ప్రోత్సహించారు?

- ఉన్నత చదువులు చదివి అటువైపు ఎందుకెళ్లారు?
- సిరాజ్, సమీర్‌లను ప్రశ్నించిన విచారణ అధికారులు
- తెలీదు, మర్చిపోయా, సంబంధంలేదు
- తొలిరోజు పోలీసు కస్టడీలో సిరాజ్ జవాబులు

విజయనగరం/క్రైమ్/రింగురోడ్డు మే 23(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదం వైపు ఎవరు ప్రోత్సహించారు? ఉన్నత చదువులు చదివి అటువైపు ఎందుకు వెళ్లారు? అని ఉగ్రవాద సానుభూతి పరులు సిరాజ్ ఉర్ రెహ్మాన్, సయ్యద్ సమీర్‌లను విచారణ అధికారులు ప్రశ్నించారు. రిమాండ్‌లో ఉన్న వారిని ఏడు రోజులు పోలీసు కస్టడీకి తీసుకున్న నేపథ్యంలో తొలిరోజు శుక్రవారం విజయనగరంలోని పోలీస్ శిక్షణ కళాశాల (పీటీసీ)లో సుదీర్ఘంగా విచారించారు. విశాఖ సెంట్రల్ జైలు నుంచి పకడ్బందీ బందోబస్తు మధ్య ఉదయం 11 గంటల సమయంలో వారిని తీసుకొచ్చారు. ఎన్ఐఏ, యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్, ఏపీ, తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్, సీఐడీ, జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ మాధవ్‌రెడ్డితో పాటు సుమారు 20 మంది అధికారులు విచారణలో పాల్గొన్నారు. రాత్రి 9 గంటల వరకు వారు పలు ప్రశ్నలు సంధించారు. విజయనగరానికి చెందిన సిరాజ్, హైదరాబాద్‌కు చెందిన సమీర్‌లను వేర్వేరు గదుల్లో ఉంచి విచారణ చేపట్టారు. వీరి సమాధానాలను బేరీజు వేసుకుంటూ విచారణ కొనసాగించనట్లు తెలిసింది. విద్యాభ్యాసం నుంచి ఉగ్రవాదానికి సానుభూతి పరులుగా మారే వరకు జరిగిన పరిణామాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తొలిరోజు సిరాజ్‌పైనే అధికారులు దృష్టి పెట్టారు. అయితే పలు ప్రశ్నలకు తెలీదు, మర్చిపోయాను, నాకు సంబంధం లేదు అని సిరాజ్ చెప్పినట్లు తెలిసింది. ఆ సమాధానాలకు పలు ఆధారాలను అధికారులు చూపించినట్లు సమాచారం. అంతర్జాతీయ స్థాయిలో సోషల్ మీడియాలో సిరాజ్ క్రియేట్ చేసిన "అహీం" గ్రూప్‌లో కార్యకలాపాలపై గుచ్చి గుచ్చి ప్రశ్నించారని తెలిసింది. విచారణ సమయంలో సిరాజ్ ముఖంలో ఏమాత్రం పశ్చాత్తాపం కనిపించలేదని సమాచారం. సీన్‌రీకన్‌స్ట్రక్షన్‌లో భాగంగా సిరాజ్ నివాసం, అతను తిరిగిన, పేలుడు పదార్థాలు కొనుగోలు చేసిన ప్రాంతాలను విచారణ అధికారులు త్వరలో పరిశీలిస్తారని తెలిసింది.

కఠినంగా శిక్షించాలంటూ ఆందోళన

సిరాజ్, సమీర్‌ల విచారణ జరుగుతున్న సమయంలో విజయనగరం యూత్ జేఏసీ ఆధ్వర్యంలో కోట జంక్షన్ వద్ద ఆందోళన నిర్వహించారు. సిరాజ్‌ను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. సిరాజ్ తండ్రి, సోదరుడుని తక్షణమే పోలీసు శాఖ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రశాంతమైన విజయనగరంలో ఉగ్ర కుట్రలు జరగడం విచారకరమని, భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రజలకు భరోసా కల్పించాలని పోలీస్ శాఖను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు రాజేశ్ వర్మ, రెడ్డిపావని తదితరులు పాల్గొన్నారు.

'అగ్రిగోల్డ్'లో అడ్డంగా దొరికిన జోగి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న భూములను కొనుగోలు చేయడం లేదా అమ్మకాలు సాగించే అధికారం ఎవరికీ లేదు. జోగి రమేశ్ సాగించిన భూ దందాలో ఆయన కుటుంబం భారీగా లబ్ధి పొందింది. ప్రస్తుతం ఆయన కుమారుడు జోగి రాజీవ్ బెయిల్‌పై బయటకు వచ్చారు. ఈ కేసులో వాస్తవాలు నిగ్గు తేలటంతో రాజీవ్‌తో పాటు అదృశ్యంగా ఉండి ఈ మొత్తం కథను నడిపించిన అంతిమ లబ్ధిదారు జోగి రమేశ్‌ను కూడా కేసులో చేర్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇదీ కేసు నేపథ్యం..

పేద, మధ్య తరగతి ప్రజల నుంచి డిపాజిట్లను సేకరించిన అగ్రిగోల్డ్ యాజమాన్యం.. ఆ డబ్బుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు అక్రమంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో ర్యాపిడ్ గ్రోత్ ఏరియాలలో పెద్ద ఎత్తున భూములను కొనుగోలు చేసింది. భూములే కాకుండా భవనాలు, అనేక వాణిజ్య సముదాయాలను కొనుగోలు చేసింది. కోట్లాది రూపాయల ఆస్తులను కూడబెట్టుకున్న తర్వాత ప్రజలకు అగ్రిగోల్డ్ యాజమాన్యం కుచ్చుటోపీ పెట్టింది. దీంతో అగ్రిగోల్డ్ యాజమాన్యం మీద కేసు నమోదైంది. అగ్రిగోల్డ్ యాజమాన్యం కొనుగోలు చేసిన భూములను సీఐడీ స్వాధీనం చేసుకుంది. వాటిలో విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలో కొనుగోలు చేసిన భూములు కూడా ఉన్నాయి. 2024 మార్చిలో అగ్రిగోల్డ్ యాజమాన్యం తమ భూములను ఇతరులకు విక్రయించారని విజయవాడ టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అప్పటి విజయవాడ రూరల్ తహశీల్దార్ జాహ్నవికి సమగ్ర సమాచారం కోసం లేఖ రాశారు. పోలీసులు, ఆ తర్వాత ఏసీబీ అధికారుల నుంచి వచ్చిన లేఖల మేరకు మార్చి 20వ తేదీన తహశీల్దార్ జాహ్నవి ప్రతి లేఖ రాశారు. ఆ భూములు అగ్రిగోల్డ్ యాజమాన్యానివేనని అప్పట్లో ప్రాథమికంగా తేల్చారు. దీని ఆధారంగా ఏసీబీ రంగంలోకి దిగి కేసు పెట్టింది.



తప్పు మీద తప్పులు

సీఐడీ అటాచ్‌లో ఉన్న అగ్రిగోల్డ్ భూములపై జోగి రమేశ్ కన్నేశారు. వాటిని కొట్టేయడానికి పక్కా వ్యూహాన్ని అమలు చేశారు. అగ్రిగోల్డ్ భూముల పక్కనే ఉన్న సర్వే నంబర్ 88లో పోలవరపు మురళీమోహన్ దగ్గర జోగి రమేశ్ సోదరుడు జోగి వెంకటేశ్వరరావు పేరుతో 1086 చదరపు గజాలు, కుమారుడు జోగి రాజీవ్ పేరుతో 1074 చదరపు గజాలు వెరసి మొత్తం 2,160 చదరపు గజాల స్థలం కొనుగోలు చేసినట్టుగా డాక్యుమెంట్లు సృష్టించారు. వీటి కి రిజిస్ట్రేషన్ కూడా జరిగింది. అంబాపురంలోని సర్వే నంబర్ 88 ఈసీని పరిశీలిస్తే.. బొమ్ము వెంకట చలమారెడ్డి 4 ఎకరాల భూమిని పోలవరపు మురళీమోహన్‌కు ఎకరం, అద్దేపల్లి కిరణ్‌కుమార్‌కు ఎకరం, రామిశెట్టి రాంబాబుకు 2 ఎకరాలు విక్రయించారు. ఇలా కొనుగోలు చేసిన భూమిని పోలవరపు మురళీమోహన్ నాటి వీజీటీఎం-ఉడా దగ్గర అప్రూవల్ తీసుకుని ప్లాట్లు వేశారు. ఆ ప్లాట్లను దస్తావేజు నంబర్లు 4443, 4444, 4445, 4446, 4447, 4448, 4449/2003, 5283, 5284, 5285, 5286/2004 ద్వారా 2301 చదరపు గజాల స్థలాన్ని విక్రయించారు. అలాంటపుడు.. పోలవరపు మురళీమోహన్ మళ్లీ ఈ భూములను జోగి కుటుంబీలకు ఎలా విక్రయిస్తారన్నది ప్రశ్న. జోగి రమేశ్‌కు అగ్రిగోల్డ్ భూములకు సంబంధించి పక్కా సమాచారం ఉండటంతో ఆ భూములను ఆధీనంలోకి తీసుకోవటానికి కొత్త ఎత్తుగడ వేశారు. సర్వే నంబర్ 88లో తాము భూములు కొనుగోలు చేసినట్టుగా (డాక్యుమెంట్ నంబర్లు 7592, 7589, 7590, 7591/2022) చెబుతున్న భూముల సర్వే నంబర్ తప్పుగా నమోదైందని, అవి సర్వే నంబర్ 87లో ఉన్నట్టుగా అప్పటి మండల సర్వేయర్ ద్వారా ఎఫ్ లైన్ కాపీని ప్రవేశపెట్టారు. దాని ఆధారంగా జోగి వెంకటేశ్వరరావు సవరణ దస్తావేజు నంబర్ 2676/2023 ద్వారా తమ భూములు ఆర్ఎస్ నంబర్ 87లో ఉన్నట్టుగా సవరణ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. జోగి రాజీవ్ కూడా సర్వే నం. 88 తప్పుగా నమోదైందని సర్వేనం.87 పేరుతో సవరణ (డాక్యుమెంట్ నంబర్లు 2674/2023, 267 5/2023) చేయించుకున్నారు. ఆ తర్వాత ఈ భూమి చుట్టూ ప్రహరీ కూడా నిర్మించుకున్నారు.

ప్లాట్లు వేసి విక్రయం

అక్రమ రిజిస్ట్రేషన్లతో పొందిన అగ్రిగోల్డ్ భూములను 7 ప్లాట్లుగా చేసి జోగి వెంకటేశ్వరావు, జోగి రాజీవ్‌లు వైసీపీ నేత, వారి కుటుంబ సభ్యులకు విక్రయించారు. 2023లో పడిగపాటి దుర్గా ప్రసాద్ (208.5చ.గజాలు), పడిగపాటి దుర్గా ప్రసాద్(208.5చ.గజాలు), పడిగపాటి దుర్గా భవాని(208.5చ.గజాలు), సోముల దుర్గా భవాని (208.5 చ.గజాలు), సోముల వెంకటేశ్వరరెడ్డి(208.5 చ.గజాలు), పడిగపాటి బాలమ్మ(208.5 చ.గజాలు), పడిగపాటి బాలమ్మ(208.5చ.గజాలు), పడిగపాటి సుబ్బారెడ్డి(208.5 చ.గజాలు)లకు విక్రయించారు.

గుర్తులేదు.. తెలియదు

- నకిలీ ఇళ్ల పట్టాల విచారణలో వంశీ సమాధానాలు
- 20 ప్రశ్నలు సంధించిన పోలీసులు.. నేడూ విచారణ



వంశీని కంకిపాడు పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు


విజయవాడ/కంకిపాడు, మే 23(ఆంధ్రజ్యోతి): 'గుర్తులేదు.. తెలియదు.. మరిచిపోయాను'.. నకిలీ ఇళ్ల పట్టాల కేసు విచారణలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పోలీసుల విచారణలో చెప్పిన సమాధానాలు ఇవీ. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలంలో 2019 ఎన్నికల సమయంలో పంపిణీ చేసిన నకిలీ ఇళ్ల పట్టాల కేసులో శుక్రవారం పోలీసులు వంశీని కస్టడీలోకి తీసుకున్నారు. విజయవాడలోని జిల్లా జైలు నుంచి కస్టడీలోకి తీసుకుని ముందుగా ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం అక్కడి నుంచి కంకిపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. తొలిరోజున అధికారులు మొత్తం 20 ప్రశ్నలు సంధించారు. వాటిలో కొన్నింటికి మాత్రమే వంశీ సమాధానం చెప్పారు. కొన్నింటికి సమాధానాలు చెప్పలేదు. 'బాపులపాడు మండలంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారా? మీ అనుచర నాయకులు ఎవరు' అని అధికారులు ప్రశ్నించగా.. గుర్తులేదు, మరచిపోయాను అని జవాబులు ఇచ్చినట్టు తెలిసింది. ఈ పట్టాలను గన్నవరంలో ఉన్న వంశీ కార్యాలయంలోనే ముద్రించారని వివిధ కేసుల విచారణలో ప్రాసిక్యూషన్ తరఫున న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. అయితే అసలు నకిలీ పట్టాలంటే ఏమిటో తెలియనట్టుగా వంశీ వ్యవహరించారు. ఎక్కడ ముద్రించారో తనకు తెలియదని సమాధానం చెప్పారు. 2019లో ఏ పార్టీ తరఫున పోటీ చేశారని దర్యాప్తు అధికారులు ప్రశ్నించారు. ఆ ఏడాది ఎన్నికల్లో టీడీపీ తరఫున ఆయన పోటీ చేసి గెలిచారు. ఈ ప్రశ్నకు కూడా సమాధానం చెప్పకుండా దాటవేశారు. కాగా, శనివారంతో వంశీ పోలీసు కస్టడీ ముగుస్తుంది.

ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డికి బయటి భోజనం

- మద్యం కేసులో ఏసీబీ కోర్టు అనుమతి

విజయవాడ, మే 23(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న మాజీ ఐఏఎస్ అధికారి కె.ధనుంజయ్ రెడ్డి, మాజీ సీఎం జగన్‌కు ఓఎస్డీగా పనిచేసిన పి.కృష్ణమోహన్‌రెడ్డికి బయటి నుంచి భోజనానికి ఏసీబీ కోర్టు అనుమతిచ్చింది. తమకు జైలులో ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని కోరుతూ వారు దాఖలు చేసిన పిటిషన్లపై వాదనలు ముగియడంతో న్యాయాధికారి పి.భాస్కరరావు శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. అనారోగ్య సమస్యల కారణంగా వారంలో మూడు రోజులు(సోమ, బుధ, శుక్రవారం) బయటి నుంచి భోజనాన్ని అనుమతించారు.

అతివేగానికి ఆరుగురు బలి



మృతులు.. కర్రెద్దుల దివాకర్, గజ్జల నరసింహ, గజ్జల జోసెఫ్, బచ్చుల సన్నీ

- రాంగ్ రూట్‌లో వచ్చి లారీని ఢీకొట్టిన కారు
- ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

కొమరోలు, బాపట్ల రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): అసలే అతివేగం.. ఆపై తప్పిన కంట్రోల్.. దీంతో ఇన్నోవాకారు చూస్తుండగానే ఎదురుగా వస్తున్న లారీని మార్జిన్ దాటి వచ్చి మరీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతిచెందగా.. ఇద్దరు చిన్నారులు మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. ఈ సంఘటన ప్రకాశంజిల్లా కొమరోలు మండలం తాటిచర్ల మోటు పెట్రోలు బంకు సమీపంలో అమరావతి-కడప రహదారిపై శుక్రవారం జరిగింది. బాపట్ల జిల్లా స్టూవర్టుపురం గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన గజ్జల అంకాల్ (40), గజ్జల నరసింహ (23), మొగిలి భవాని (20), గజ్జల జోసెఫ్ (25), కర్రెద్దుల దివాకర్ (24), బచ్చుల సన్నీ (27)తోపాటు మొగిలి భవానీకి చెందిన ఇద్దరు పిల్లలు.. మొత్తం 8 మంది ఇన్నోవా లో గురువారం వ్యక్తిగత పనిమీద డోన్‌కు వెళ్లారు. అక్కడ పని పూర్తికాగానే శుక్రవారం తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో తాటిచర్ల మోటు సమీపంలోని పెట్రోలు బంకు వద్ద.. రోడ్డుకు ఎడమవైపు వెళ్లాల్సిన ఇన్నోవా కారు.. అతివేగంగా రోడ్డుకు కుడివైపునకు దూసుకొచ్చి మార్జిన్ కూడా దాటి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఆ సమయంలో కారు 120 కి.మీ. వేగంతో ఉంది. దీంతో కారు పూర్తిగా లారీ కింద ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న గజ్జల అంకాల్, గజ్జల నరసింహ, మొగిలి భవాని, గజ్జల జోసెఫ్, కర్రెద్దుల దివాకర్, బచ్చుల సన్నీ అక్కడికక్కడే మృతిచెందారు. భవాని పిల్లలు శిరీషా, సిద్దు (జీతన్) గాయాలతో బయటపడ్డారు. పోలీసులు చిన్నారులను గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జీతన్ పరిస్థితి విషయమంగా ఉండడంతో ఐసీయూలో ఉంచారు.

సీఎం చంద్రబాబు, లోకేశ్ దిగ్భ్రాంతి

ప్రకాశం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఉన్న ఆయన ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాగా, ఈ ప్రమాదంపై మంత్రి లోకేశ్ కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని తెలిపారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.